120 జిల్లాల్లో ప్రభుత్వ డ్రైవింగ్ స్కూళ్లు




2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 27 మార్చి 2026 | సంపుటి: 10 | సంచిక: 80 | పేజీలు:12 | వెల రూ.5


ఎయిర్ పొల్యూషన్‌కు చెక్.. కార్బన్ గార్డెన్..




11

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

## ష్..గప్‌చుప్..!!!

### సీఎంలతో పీఎం 'సన్నద్ధత' సమావేశం

ముఖ్యమంత్రులతో నేటి సాయంత్రం వర్చువల్‌గా మాట్లాడనున్న మోడీ

ఢిల్లీ, మార్చి 26: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోడీ నేడు వర్చువల్గా సమావేశం కానున్నారు. సాయంత్రం 6.30కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**ఆ సీఎంలు దూరంగా..**

వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో

...మిగతా 2లో



### మన 'చమురు' నౌకలకు ఫ్రీ ప్యాసేజ్

2

### రంగంలోకి రష్యా?

ఇరాన్‌కు డ్రోన్లు, ఆహారం ఔషధాలు అందజేస్తున్న పుతిన్ సర్కార్

రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ సహకారం కూడా!

## ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులను బీఆర్ఎస్ వారసత్వంగా ఇచ్చింది

### ఆ బిల్లులను మేం చెల్లిస్తుంటే గగ్గోలు పెడతారా?

- విదేశాల్లో పనిచేస్తున్నమన డాక్టర్ల కోసం ప్రత్యేక వెబ్‌సైట్
- సీఎంఆర్ఎఫ్ నిధులు ఎవరు గల్లంతు చేశారో తెల్వదా?
- ఆ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపిస్తం
- వైద్య ఆరోగ్య శాఖ సవాల్ వంటిది
- ఆసుపత్రుల నిర్వహణ బాధ్యత గ్రూప్ 1 అధికారికి ఇస్తం
- బడ్జెట్ పద్దులపై చర్చలో సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 26 (మనం బ్యూరో): రాజీవ్ ఆరోగ్యశ్రీ బిల్లులను మేం పెడింగ్‌లో పెట్టడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి మాకు వారసత్వంగా వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పెట్టిన భారం

...మిగతా 2లో



2

### చిన్నారులకు నాణ్యమైన విద్య, పోషకాహారం

సీఎంతో ఆర్థిక వేత్త కార్తీక్ మురళీధరన్ భేటీ

సమగ్ర మానవాభివృద్ధి అంశంపై సమీక్ష

### దామోదరపై సీఎం ప్రశంసల జల్లు


అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మాపై ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన స్వతహాగా ఇంజినీర్ అయినప్పటికీ సోషల్ డాక్టర్‌పై మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఆయనకు పేద

...మిగతా 2లో

### మార్కాపురంలో టిప్పర్‌ను ఢీకొన్న బస్సు

## 14మంది సజీవ దహనం





2

- ఘటనలో 28 మందికి తీవ్ర గాయాలు
- ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధాని సంతాపం
- మృతులకు రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా
- బస్సు కండీషన్‌పై డ్రైవర్‌ను నిలదీసిన ప్రయాణీకులు
- అతివేగంతోనే అనర్థం: ప్రత్యక్ష సాక్షులు

**రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి**

ఏపీ అధికారులతో మాట్లాడాలని సీఎస్‌కు ఆదేశం

### ఏప్రిల్ 2 నుంచి 5 మండలాల్లో

## ఇంటిగ్రేటెడ్ భూభారతి

సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు.. అంతా ఒకే గొడుగు కిందకు

- ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం
- ప్రతి సర్వేనెంబర్‌కు భూధార్ నెంబర్
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2





7

శ్రీసీతారాముల కళ్యాణానికి

### ముస్తాబైన భద్రాద్రి

3 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా

ఏర్పాట్లు చేసిన అధికారులు

పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



## ష్...గప్‌చుప్..!!!

(మొదటి పేజీ తరువాయి)

కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధాని-సీఎంల వీడియో కాన్ఫరెన్స్ లో చర్చల వివరాలను సీఎస్ లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలున్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## మన ‘చమురు’ నౌకలకు ఫ్రీ ప్యాసేజ్

**టెహ్రాన్, మార్చి 26:** భారత్ సహా తమ మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. ఈ విషయాన్ని ముంబయిలోని ఇరాన్ కాన్సు లేట్ జనరల్ కార్యాలయం ‘ఎక్స్’ వేదికగా వెల్లడించింది. ‘మేము హర్మూజ్ నుంచి ప్రయాణించేందుకు మిత్ర దేశాలకు అనుమతులు ఇస్తున్నాం. వీటిలో చైనా, రష్యా, భారత్, ఇరాక్, పాకిస్థాన్ ఉన్నాయి’ అని అరాగ్చీ ప్రకటించినట్లు అది పేర్కొంది. దీంతో హర్మూజ్ జలసంధికి ఇరువైపులా చిక్కుకుపోయిన భారత్ నౌకలు సరకులతో తమ గమ్యస్థానాలు చేరేందుకు మార్గం సులువైంది. ఇప్పటికే ఐదు గ్యాస్ ట్యాంకర్లు హర్మూజ్ వద్ద అనుమతుల కోసం ఎదురుచూస్తున్నట్లు ఇటీవల కథనాలు వెలువడ్డాయి.

# ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి

**హైదరాబాద్, మార్చి 26:** తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ( ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ ఉరిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో మంత్రి గారు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచన మేరకు తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్‌ఉరిజిస్ట్రేషన్ , సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలాల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్- డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అలాగే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను కూడా తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నాకూడా ప్రజా కోణంలోనే ఉంటుందన్నారు.

ఒక క్లిక్ తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు. అదేవిధంగా ఈ పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మైల్యాండ్ పోర్ట్‌ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వేనెంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్, వంటి పూర్తి సమాచారం, సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రతి స్టేజ్ లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్.ఎమ్.ఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. ధరణి పోర్టల్‌లో 36 మాడ్యూల్స్ ఉండగా భూభారతి పోర్టల్‌లో ఒకే ఛాప్టర్ కింద తీసుకువచ్చామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ ఉరిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.

# రంగంలోకి రష్యా?

**క్రెమ్లిన్, మార్చి 26:** అమెరికా-ఇజ్రాయెల్తో యుద్ధం చేస్తోన్న ఇరాన్ కు రష్యా నుంచి సహాయం అందుతున్నట్లు తెలుస్తోంది. ఆ దేశానికి పుతిన్ ప్రభుత్వం దశలవారీగా డ్రోన్లను డెలివరీ చేస్తోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నెలాఖరుకు ఆ రవాణా పూర్తికానుందని వెల్లడించాయి.

డ్రోన్లతో పాటు ఆహారం, ఔషధాలను కూడా పంపిస్తోందని రాసుకొచ్చాయి. ‘ఇరాన్ అభివృద్ధి చేసిన డ్రోన్లను రష్యా తయారుచేస్తోంది. వాటిని ఉక్రెయిన్ యుద్ధంలో ఉపయోగిస్తోంది. ఇరాన్ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ షిప్మెంట్లు చేస్తోంది’ అని పశ్చిమదేశాల నిఘా సమాచారాన్ని ఉటంకించాయి.

అమెరికా యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, సైనిక స్థావరాల గురించి ఇరాన్‌కు రష్యా ‘రియల్ టైమ్ ఇంటెలిజెన్స్’ సహకారం అందిస్తోందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఆ సమాచారాన్ని ఇరాన్కు రష్యా చేరవేస్తోందని వాటి సారాంశం.

ఇక తాజా కథనాలపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి స్పందించారు. ‘ప్రస్తుతం చాలా నకిలీ వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఇక్కడ ఒకటి మాత్రం వాస్తవం. ఇరాన్ నాయకత్వంతో మా సంప్రదింపులు కొనసాగిస్తున్నాం’’ అని స్పష్టం చేశారు.

**ఇరాన్లోని రష్యా ఉద్యోగులు వెనక్కి..**

ఇరాన్లోని బుషెహర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నుంచి తన ఉద్యోగులను రష్యా వెనక్కి రప్పించింది. మంగళవారం ఈ ప్లాంట్ పై క్షిపణి పడిన నేపథ్యంలో 163 మంది సిబ్బందిని అక్కడినుంచి తరలించింది. ఈ ప్లాంట్ను నిర్మించింది రష్యానే.

మిగతా యూనిట్ల నిర్మాణం కోసం అక్కడ కొందరు సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి అక్కడ కార్యకలాపాలను నిలిపివేయడం ఈ సందర్భంగా గమనార్హం.

# మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం

**‘వెలుగుమట్ల’ వివాదంపై హైకోర్టు తీర్పు**

**హైదరాబాద్,మార్చి 26(మనం,ప్రత్యేక ప్రతినిధి):** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలోని భూదాన్ భూముల్లో నిర్మించిన ఇళ్ల కూల్చివేతలపై మధ్యంతర ఉత్తర్వులు (స్టే) ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. సీసీఎల్ఏ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన 23 పిటిషన్లపై కోర్టు గురువారం విచారణ చేపట్టింది. వెలుగుమట్ల భూముల్లో జరుగుతున్న కూల్చివేతలను అడ్డుకోవాలని, స్టే ఇవ్వాలని పిటిషనర్లు కోర్టును కోరారు. అయితే, ప్రస్తుతం అక్కడ అర్హులైన పేదలకు పట్టాలు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతున్నందున మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది.

**ఏజీ..వాదనలు:**

వెలుగుమట్లలోని భూదాన్ భూములపై ప్రభుత్వ పక్షాన ఏజీ మురళీధర్ రెడ్డి వాదనలు వినిపించారు. వెలుగుమట్ల ప్రాంతంలో ప్రభుత్వం ఇప్పటికే పారదర్శకంగా సర్వే నిర్వహించిందని తెలిపారు. అర్హులైన వారిని గుర్తించి ఇప్పటికే 311 మందికి పట్టాలను మంజూరు చేసినట్లు ఆయన కోర్టుకు వివరించారు.

అర్హులకు న్యాయం జరుగుతున్న వేళ కూల్చివేతలపై స్టే ఇవ్వడం సరికాదని వాదించారు. కాగా వెలుగుమట్ల భూదాన్ భూముల్లో అక్రమ నిర్మాణాలు ఉన్నాయంటూ గతంలో అధికారులు కూల్చివేతలు చేపట్టారు. దీనిపై బాధితులు హైకోర్టును ఆశ్రయించారు.

# కాంగ్రెస్ నేత జగ్గారెడ్డికి..ఊరట

- **మానవ అక్రమ రవాణా కేసు కొట్టివేత**
- **కీలక తీర్పునిచ్చిన ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు**



**హైదరాబాద్,మార్చి 28(మనం,ప్రత్యేక ప్రతినిధి):** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి భారీ ఊరట లభించింది. మానవ అక్రమ రవాణా కేసులో జగ్గారెడ్డితో పాటు కాంగ్రెస్ నేత కుసుమ కుమార్ నమోదైన కేసును ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు గురువారం కొట్టివేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో నమోదు చేసిన ఈ కేసులో ఏ1 గా ఉన్న జగ్గారెడ్డి, ఏ3 కుసుమ కుమార్‌లపై నమోదైన కేసులో నేరాలు రుజువు కాలేదని వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది.

**ఇది జరిగింది:**

2004లో ఎమ్మెల్యేగా ఉన్న జగ్గారెడ్డి నకిలీ డాక్యుమెంట్లు సమర్పించి భార్య పిల్లలుగా పేర్కొంటూ వేరే ముగ్గురు వ్యక్తులను అమెరికాకు తీసుకువెళ్లారని ఆరోపణలు ఉన్నాయి. తన వెంట ఒక మహిళ ఒక యువకుడిని అమెరికా తీసుకువెళ్లిన జగ్గారెడ్డి తిరిగి ఆయన ఒక్కరే భారత్‌కు తిరిగి వచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ఎమ్మెల్యే, విప్ గా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ 2018లో జగ్గారెడ్డిని పోలీసులు అరెస్టు చేయగా బెయిల్ పై ఆయన బయటకు వచ్చారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు కేసును కొట్టివేస్తూ కీలక తీర్పు వెలువరించింది.

# ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులను బీఆర్ఎస్ వారసత్వంగా ఇచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తుంటే అసలు ఇవ్వనట్లు విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.627 కోట్ల ఆరోగ్యశ్రీ బిల్లులు బకాయి పెట్టిందనీ, అందులో రూ.240 కోట్లు ప్రభుత్వ ఆసుపత్రులకు, రూ.360 కోట్లు ప్రైవేట్ ఆసుపత్రులకు బకాయి ఉందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో సీఎంఆర్ఎఫ్ నిధులన్నీ గోల్ మాల్ చేసిన విషయం అందరికీ తెలుసన్నారు. ఆ చెక్కులను ఎవరి పీఏలు అక్రమంగా కాజేశారో కూడా తెలుసనీ, విచారణ జరుగుతుంది అన్నీ బయటికి వస్తాయని హెచ్చరించారు. మా ప్రభుత్వం వచ్చాక ఆన్‌లైన్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ అప్లై చేసేలా చర్యలు తీసుకున్నామనీ, దీని వల్ల అక్రమాలకు అవకాశం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో 35 మెడికల్ కాలేజీలు ఉన్నాయనీ, టీచింగ్ కాలేజీలకు రోగులు రావడం లేదని తెలిపారు. పేదలు వైద్యం కోసం వెళ్లే దగ్గర సరైన డాక్టర్లు లేరనీ, ఆరోగ్యశ్రీ రోగులను టీచింగ్ కాలేజీలకు పంపించే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఈ ఆసుపత్రులకు ఇస్తామన్నారు. దీనివల్ల ఆసుపత్రుల నిర్వహణ మెరుగు పడుతుందన్నారు. ఆసుపత్రుల నిర్వహణ బాధ్యతను గ్రూప్ 1 అధికారికి ఇచ్చే ఆలోచన ఉందన్నారు.

మన వాళ్లు వేల మంది వైద్యులు విదేశాల్లో పని చేస్తున్నారనీ, వారి కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్ తయారు చేస్తున్నామని తెలిపారు. మన ప్రాంతానికి వాళ్లు వచ్చినప్పుడు అక్కడ ఆసుపత్రులలో సేవలు అందించడానికి వెబ్‌సైట్ ద్వారా ఏర్పాట్లు చేస్తున్నామనీ, మెడికల్,అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఈ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వరంగల్, అల్వాల్, ఎల్బీ నగర్, సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రులను స్పెషలైజేషన్ ఆసుపత్రులుగా మారుస్తున్నామనీ, ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇచ్చే నిధులను ఈ ఆసుపత్రులకు కేటాయిస్తామని తెలిపారు.

గోషామహల్‌లో 30 ఎకరాల్లో రూ.3వేల కోట్లతో ఉస్మానియా కొత్త ఆసుపత్రిని నిర్మిస్తున్నామనీ, అదనంగా మరో 10 వేల బెడ్‌లు రోగుల కోసం అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు.

# 120 జిల్లాల్లో ప్రభుత్వ డ్రైవింగ్ స్కూళ్లు




- **కోటి ఉద్యోగాల కల్పన: గడ్కరీ**

**ఢిల్లీ, మార్చి 26:** దేశంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన 120 జిల్లాల్లో డ్రైవింగ్ స్కూళ్లను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. పరిశ్రమ వర్గాలతో కలిసి వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా రాబోయే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. బాలీవుడ్ నటుడు ఆమిర్ఖాన్ నిర్వహించిన ‘సడక్ సురక్షా అభియాన్’ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో 22 లక్షల మంది డ్రైవర్ల కొరత ఉందని గడ్కరీ అన్నారు. దీన్ని అధిగమించేందుకు ఇప్పటికే 200 డ్రైవింగ్ స్కూళ్లు తెరిచినట్లు చెప్పారు. రాబోయే ఐదేళ్లలో కోటి మంది యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కొత్తగా డ్రైవింగ్ స్కూళ్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రపంచంలో అత్యధికంగా భారత్లోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. ఏటా 5 లక్షల ప్రమాదాలు జరుగుతున్నాయని, అందులో 1.8 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వీరిలో 66 శాతం మంది 18-44 మధ్య వయస్కులేనని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా భారత్ 3 శాతం జీడీపీని కోల్పోతోందని గడ్కరీ వెల్లడించారు.

## కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ కోసం వెబ్‌సైట్ ఏర్పాటు చేయాలె

- **ఎక్కువ ఖర్చు చేసిన వారిని గుర్తించి సత్కరించాలి**
- **సీఎస్ఆర్ ఫండ్స్‌పై సమీక్షలో సీఎం రేవంత్**

**హైదరాబాద్, మార్చి 26 (మనం బ్యూరో):** కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ (సీఎస్ఆర్)ను పరిశ్రమలు ఈ రాష్ట్రంలోనే ఖర్చు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటు చేసి ఫండ్స్ వేరే చోట ఖర్చు చేస్తానంటే ఎలా అని ప్రశ్నించారు. సీఎస్ఆర్‌పై సీఎం శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు వచ్చిన సీఆర్ఎస్ ఫండ్స్ సరిగా లేవనీ, రాష్ట్రంలో ఎక్కువ ఫండ్స్ ఖర్చు చేసిన వారిని గుర్తించి ప్రభుత్వం తరపున సత్కరించాలని సూచించారు. సీఎస్ఆర్ ఫండ్స్‌ను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలనీ, ఇతర రాష్ట్రాల్లో ఫండ్స్ కోసం అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న సంస్థలు కనీసం 50 శాతం ఫండ్స్‌ను కచ్చితంగా ఇక్కడే ఖర్చు చేయాలనీ, ఇందుకోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## దామోదరపై సీఎం ప్రశంసల జల్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల కష్టాలపై సంపూర్ణమైన అవగాహన ఉందనీ, వైద్యంలో ఎదురయ్యే కొత్త సవాళ్లను ఆయన సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారని కొనియాడారు.

వైద్య, ఆరోగ్య శాఖ ఒక సవాల్ వంటిదనీ, ఆ సవాళ్లను ఎదుర్కొంటూ ఆయన ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో అనేక సంస్కరణలు తీసుకు రాబోతున్నామనీ, సభ్యులు ఇచ్చే సలహాలు స్వీకరిస్తామని చెప్పారు.

## సీఎం రేవంత్‌తో సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం భేటీ



**హైదరాబాద్, మార్చి 26 (మనం బ్యూరో):** రాష్ట్ర శాసనమండలి హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డితో ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం భేటీ అయింది. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో చేపడుతున్న ప్రజా వాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ భేటీలో సమాలోచనలు జరిగాయి. అందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాజస్థాన్ ప్రభుత్వం చేపడుతున్న జన్ సూచన పోర్టల్ తరహాలో తెలంగాణలోనూ ప్రజా సూచన పోర్టల్‌ను ఏర్పాటు చేయాలన్న చర్చ ఈ సందర్భంగా జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని పథకాలకు సంబంధించిన వివరాలను ఒకే చోట ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారన్నారు. ఐటీ శాఖ ద్వారా ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్. కాగా తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్‌ను ప్రశంసించిన నిఖిల్ డే ఈ బిల్ దేశంలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## చిన్నారులకు నాణ్యమైన విద్య...పోషకాహారం

**హైదరాబాద్, మార్చి 26 (మనం బ్యూరో):** రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ గురువారం సీఎంతో రాష్ట్ర శాసనమండలి హాల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 0-10 ఏళ్ల లోపు పిల్లల్లో పోషకాహార లోపం విద్యాభ్యాసన స్థాయి లోపాలకు సంబంధించి పలు నివేదికలను మురళీధరన్ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. చిన్న వయస్సులో పోషకాహారం లోపంతో భవిష్యత్తులో తలెత్తే ఆరోగ్య సమస్యలు, ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించక పోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను ఆయన తెలియజేశారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను సీఎంకు సూచించారు. ఆయా అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సీఎం తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం పెట్టేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిపినట్లు వివరించారు. అంగన్వాడీల్లో కార్యకర్తలు ఆయాలతో పాటు పోషకాహారం అందజేసేందుకు అదనంగా మరొకరిని నియమించాలని సూచిం చారు. మురళీధరన్ సూచించిన అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేసినందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు. మురళీధరన్‌తో సమన్వయం చేసుకుని ఈ అంశంపై ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# 14మంది సజీవ దహనం

**హైదరాబాద్,మార్చి26(మనం,ప్రత్యేక ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లాలో టిప్పర్‌ను ఢీకొని హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు దగ్ధమైంది. ఈ ఘటనలో 14 మంది సజీవ దహనం కాగా మరో 28 మంది ప్రయాణీకులకు గాయాలయ్యాయి. మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద గురువారం ఉదయం 6 గంటల సమయంలో కంకర లోడుతో వెళుతున్న టిప్పర్‌ను బస్సు ఢీకొట్టిన వెంటనే బస్సుతో పాటు టిప్పర్‌లోనూ ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదంలో బస్సులోని 14 మంది ప్రయాణికులు సజీవ దహనమైయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మూడు అగ్నిమాపక యంత్రాలతో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 41 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించి పోలీసులు క్షతగాత్రులను మార్కాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘోర రోడ్డు ప్రమాదంలో కోరుట్ల, జగిత్యాల ప్రాంతానికి చెందిన నలుగురు ఉన్నట్లు సమాచారం. జీవనోపాధి కోసం ఆంధ్రా ప్రాంతానికి చెందిన సుతారీలు, కార్మికులు వచ్చి ఇక్కడ గృహ నిర్మాణ పనులు చేస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. అలాగే మృతులలో ఏపీలోని కనిగిరి, పామూరు వాసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో బస్సు, టిప్పర్ లారీ పూర్తిగా కాలిపోయాయని, మృత దేహాలు సైతం గుర్తించలేని స్థితిలో ఉన్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

**ఇది జరిగింది:**

తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కనిగిరికి వెళ్తున్న హరికృష్ణ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు(నెంబర్ -ఏపీ 39 యూసి 5265) మార్కాపురం రాయవరంలో ప్రమాదానికి గురైంది. పలకల క్వారీల మలుపు వద్ద చీమకుర్తి నుంచి కంకర లోడుతో వస్తున్న టిప్పర్‌ను వేగంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో బస్సు క్యాబిన్‌లో గుర్తు పట్టలేని విధంగా నాలుగు మృతదేహాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రమాదం గురువారం ఉదయం 6 గంటలకు జరిగిందని, వెంటనే అప్రమత్తమైన స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందించారు. ప్రమాద సమయంలో బస్సులో 41 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారని, వీరిలో బస్సు వెనుక భాగంలో ఉన్నవారు బయటకు రాలేక మృతిచెందినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. టిప్పర్‌ను బస్సు ఢీకొట్టిన క్షణాల్లోనే బస్సులో మంటలు వ్యాపించాయని, బస్సు అద్దాలు పగలగొట్టి కొందరు ప్రయాణికులు కిందకి దూకారని ప్రత్యక్ష సాక్షులు వివరించారు. స్లీపర్ బస్సు కావడంతో బయటపడేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. మృతుల్లో ఎక్కువ మంది స్లీపర్ బెర్తులపై ఉన్నవాళ్లేనని తేలింది. బస్సు డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రధాని, రాష్ట్రపతి:**

ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం అత్యంత విషాదకరమని అన్నారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ బాధితులకు ధైర్యం చెప్పారు. అదేవిధంగా ప్రమాదంలో గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ. 50,000 పరిహారం ఇవ్వనున్నట్లు మోదీ స్పష్టం చేశారు.

**మృతుల సంఖ్య:**

ప్రమాదం జరిగిన వెంటనే బస్సు మంటలు చెలరేగి బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైనవారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు.. అయితే, ఇందులో ఎవరి పరిస్థితి ఎలా ఉంది..? అని పూర్తి సమాచారం అందుతుండగా.. ప్రమాద తీవ్రతను చూస్తే మాత్రం.. మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉన్నట్టుగా అంచనా వేస్తున్నారు. ఇదిలావుండగా ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బస్సు ఢీకొన్న వెంటనే మంటలు ఎలా చెలరేగాయి అనే అంశంపై కూడా విచారణ కొనసాగుతోంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది.

**బస్సు కండీషన్‌పై:**

మార్కాపురం జిల్లాలో హరికృష్ణ ట్రావెల్స్ కు చెందిన బస్సు, టిప్పర్ ఢీ కొట్టిన ఘటనలో బస్సు కండీషన్ విషయంలో ఇప్పుడు సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. బస్సు కండిషన్ బాగోలేదని మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు కీలక విషయాలు వెల్లడించారు. ప్రమాదం జరిగే సమయానికి గంట ముందు కూడా బస్సు ట్రబుల్ ఇచ్చిందని దాంతో గంట సేపు బస్సును నిలిపివేసి రిపేర్లు చేశారని ఆ తర్వాత ప్రయాణం మొదలైన కొద్దిసేపటికే ఈ ఘోరం జరిగినట్లు తెలిపారు. ఒక వేళ ఈ గంట సమయం ప్రయాణం కూడా సాఫీగా జరిగితే ఈ గండం నుంచి తమ వారు బయటపడేవారేమోనని బాధిత కుటుంబ సభ్యులు రోధిస్తున్నారు.

**ఇటీవలే..జరిమానా:**

ప్రమాదానికి గురైన హరికృష్ణ ట్రావెల్స్ బస్సు కండిషన్ బాగోలేదని రెండు నెలల క్రితం జరిగిన సంక్రాంతి పండగ సమయంలోనే బయటపడినట్లు తెలుస్తోంది. ఆర్టీఏ అధికారులు నిర్వహించిన తనిఖీలలో బస్సు కండీషన్ బాగోలేదని రూ.36 వేల జరిమానా విధించారని అధికారులు వెల్లడించారు. ఈ జరిమానాతోనైనా బస్సు కండీషన్ మెరుగు పరిచి ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదేమో అని బాధితులు చెబుతున్నారు. కాగా గురువారం చోటుచేసుకున్న ప్రమాదనికి ముందే బస్సు కండీషన్‌పై అందులోని ప్రయాణికులు ముందుగానే ఆందోళన వ్యక్తం చేశారు. కండిషన్ సరిగా లేదని డ్రైవర్‌తో చెప్పారు. దీంతో బస్సు సిబ్బంది.. యర్రగొండపాలెం వద్ద గంటసేపు నిలిపి మరమ్మతులు చేశారు. అనంతరం బయల్దేరిన కొంత సమయం తర్వాత మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద ప్రమాదం జరిగింది. ఈ నేపథ్యంలో బస్సు డ్రైవర్‌ను అధికారులు విచారిస్తే స్టీరింగ్ స్టక్ అయిందని చెప్పినట్లు తెలిసింది.

**కంట్రోల్ రూమ్:**

ఏపీలోని మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి సంబంధించి ప్రభుత్వం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. బాధిత కుటుంబాలు సమాచారం తెలుసుకోవడానికి ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచింది. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు: 6304285613, 9985733999, 7989537285, 9703578434ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

## రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి

**ఏపీ అధికారులతో మాట్లాడాలని సీఎస్‌కు ఆదేశం**

**హైదరాబాద్, మార్చి 26, (మనం బ్యూరో):** మార్కాపురం బస్సు ప్రమాద దుర్ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం జరిగిన ఈ ఘటనలో పలువురు మృతి చెందడం, కొందరికి తీవ్ర గాయాలు కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన సీఎం గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బస్సు నిర్మల్ నుంచి నెల్లూరు వెళుతున్న నేపథ్యంలో ప్రమాదంలో మృతి చెందిన వారు, గాయపడిన వారి వివరాలు తెలుసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. ఏపీ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించాలనీ, గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందేలా చూడాలని పేర్కొన్నారు. సీఎం ఆదేశాలతో సీఎస్ ఏపీ అధికారులతో మాట్లాడి బాధితుల వివరాలు సేకరించారు.




## ఆయన వ్యాఖ్యలు విని షాకయ్యా

- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆగ్రహం

హైదరాబాద్, మనం ప్రతినిధి : హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానందగౌడ్ శాసనసభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగనాథ్ ప్రజల కోసం పనిచేస్తున్నారా? లేక రాజకీయం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. రంగనాథ్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను వివేకానందగౌడ్ శాసనసభలో ప్రస్తావించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో హైడ్రా పనితీరు గురించి మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు హైడ్రాకు రెఫరెండంగా పేర్కొన్నారు. దీనితో రంగనాథ్ రాజకీయ నాయకుడిలా మాట్లాడుతున్నారని విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, దీనిపై వివేకానంద గౌడ్ అసెంబ్లీలో మాట్లాడుతూ... రంగనాథ్ మాట్లాడిన ఇంటర్వ్యూను చూసి షాకయ్యానని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను హైడ్రాకు రెఫరెండంగా ఒక అధికారి చెప్పడమేమిటని ప్రశ్నించారు. ఆయన ప్రజల కోసం పనిచేస్తున్నారా? లేక రాజకీయం చేస్తున్నారా. అని నిలదీశారు. ఆయనకు రాజకీయం చేయాలనే ఆసక్తి అంతగా ఉంటే ఖద్దర్ దుస్తులు వేసుకుంటే సరిపోతుంది కదా? అని ఎద్దేవా చేశారు. తమలాంటి రాజకీయ నాయకులు ఈరోజు ఉండి రేపు వెళ్లిపోతారని, కానీ అధికారులు సంవత్సరాల కొద్ది పనిచేస్తారని వివేకానందగౌడ్ ఈ సందర్భంగా తన వాఖ్యల్ని గుర్తుచేస్తూ సభ దృష్టికి తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు.

# చిన్నార్రులకు నాణ్యమైన విద్య...పోషకాహారం

- సీఎం రేవంత్‌తో ఆర్థిక వేత్త కార్తీక్ మురళీధరన్ భేటీ
- సమగ్ర మానవాభివృద్ధి అంశంపై సమీక్ష

హైదరాబాద్, మార్చి 26 (మనం బ్యూరో) : రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ గురువారం సీఎంతో రాష్ట్ర శాసనమండలి హాల్‌లో భేటీ అయ్యారు.


ఈ సందర్భంగా రాష్ట్రంలో 0-10 ఏళ్ల లోపు పిల్లల్లో పోషకాహార లోపం విద్యాభ్యాసన స్థాయి లోపాలకు సంబంధించి పలు నివేదికలను మురళీధరన్ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. చిన్న వయస్సులో పోషకాహారం లోపంతో భవిష్యత్తులో తలెత్తే ఆరోగ్య సమస్యలు, ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను ఆయన తెలియజేశారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను సీఎంకు సూచించారు.

ఆయా అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సీఎం తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం పెట్టేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిపినట్లు వివరించారు.

అంగన్వాడీల్లో కార్యకర్తలు ఆయాలతో పాటు పోషకాహారం అందజేసేందుకు అదనంగా మరొకరిని నియమించాలని సూచించారు. మురళీధరన్ సూచించిన అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు. మురళీధరన్‌తో సమన్వయం చేసుకుని ఈ అంశంపై ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# కామారెడ్డి డిక్లరేషన్ ఊసే ఎత్తడంలేదు?

- గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన
- బీసీలకు రూ.3 కోట్లు ఖర్చు..తీవ్రంగా అవమానించడమే : తలసాని ధ్వజం



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అత్యంత వాడివేడిగా సాగాయి. ఈ సందర్భంగా బీసీ సంక్షేమంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ, అంతకు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్ పార్క్ వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రతి ఏటా బీసీల కోసం రూ. 20,000 కోట్లు ఖర్చు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని తలసాని తీవ్రంగా మండిపడ్డారు. బీసీ సబ్ ప్లాన్‌కు మొదటి ఏడాది రూ. 800 కోట్లు చేస్తామన్నారు... రెండో ఏడాది రూ. 11,000 కోట్లు కేటాయించి, క్షేత్రస్థాయిలో కేవలం రూ. 3 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం బీసీలను అవమానించడమేనని ఆయన ధ్వజమెత్తారు.

ఇదిలాఉంటే, గత ఎన్నికల సమయంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను తీసుకొచ్చి అబద్ధపు హామీలు ఇప్పించి బీసీల ఓట్లు దండుకున్నారని విమర్శించారు. బీసీ విద్యార్థుల కోసం విదేశీ విద్య, గురుకులాలు, కులవృత్తుల ప్రోత్సాహానికి కేసీఆర్ చేసిన కృషిని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. బీసీ నేత లింగయ్య యాదవ్ వంటి నేతలేందరికో రాజ్యసభ అవకాశం ఇచ్చి బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించామన్నారు.

# సభను నడపలేకనే క్రీడా పోటీల ఎత్తుగడ

## అసెంబ్లీ సీరియస్ జరుగుతుం(దం)టే మరి ఈ ఆటలేంది?

## మీడియాతో చిచ్‌చాట్‌లో కేటీఆర్ ఎద్దేవా?



హైదరాబాద్, మనం ప్రతినిధి : ఓ వైపు అసెంబ్లీలో కీలకమైన అంశాలపై చర్చ చేస్తారనుకుంటే?... అది పక్కన పెట్టేందుకే ప్రభుత్వం ఆటల పోటీలకు తెర తీస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్ చేసిన కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తనదైన శైలీలో తీవ్రంగా విరుచుకుపడ్డారు. రేవంత్ సర్కార్ సభను నడపలేకనే క్రీడా పోటీల ఎత్తుగడ వేసిందని ఆయన విమర్శించారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు అత్యంత కీలకమైన పద్దులపై చర్చలు కొనసాగుతున్న తరుణంలో ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. ఇంత సీరియస్‌గా సభ జరుగుతున్న సమయంలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం ఏంటీ?అని ఆయన ప్రశ్నించారు. ఇదే విషయాన్ని తాను అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వద్ద ఎటువంటి సమాధానం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇరిగేషన్ వంటి అత్యంత ముఖ్యమైన సబ్జెక్టులపై సభలో లోతైన చర్చ జరగాల్సి ఉందని, కానీ ప్రభుత్వం మాత్రం పద్దులపై చర్చను త్వరగా ముగించి పారిపోవాలని చూస్తోందని ఆయన విమర్శించారు. కీలకమైన అంశాలపై చర్చలు జరగాల్సిన సమయంలో ఎమ్మెల్యేలు మైదానాల్లో ఆటలు ఆడుతుంటే ప్రజలు ఏమనుకుంటారు? అని కాంగ్రెస్ను ఆయన నిలదీశారు. ఈ నెల 28, 29 తేదీల్లో ఈ క్రీడా పోటీలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల కాలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించకుండా, ఇలాంటి కార్యక్రమాలతో కాలయాపన చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. పద్దులపై చర్చకు తగినంత సమయం కేటాయించకుండా క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు. చర్చించాల్సిన కీలకమైన అంశాలు పక్కనపెట్టి.. కేవలం ప్రతిపక్షాలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే రేవంత్ సర్కార్ క్రీడా పోటీలను ఒక సాకుగా చూపిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు.

# కాళేశ్వరం 21వ ప్యాకేజ్ త్వరగా పూర్తిజేయండి

## రేవంత్ సర్కార్‌ను కోరిన మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి



హైదరాబాద్, మనం ప్రతినిధి : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 21 ప్యాకేజ్ పనులను పూర్తి చేసి సాగు వెంటనే సాగు నీరందించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శాసనసభ సమావేశాల్లో భాగంగా ఇరిగేషన్ శాఖకు సంబంధించి ప్యాకెజ్ 21, చిట్టాపూర్, ఫత్తేపూర్, సుర్బిర్యాల్ లిఫ్ట్ సమస్యలను లేవనెత్తారు. ఈ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం 4,800 కోట్ల రూపాయలు కేటాయించగా, ఇప్పటికే 3,300 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 70 శాతం పనులు పూర్తి చేశామని వెల్లడించారు.

మిగిలిన 30శాతం పనులు పూర్తి చేస్తే 2 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చని సూచించారు. గతంలో ఇరిగేషన్ శాఖ మంత్రిని పలుసార్లు కలిసి విన్నవించడమే కాకుండా గత అసెంబ్లీ సమావేశాల్లో ఇదే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన పనుల్లో ఇప్పటికి ఎలాంటి కదలిక లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పనుల్లో వేగం పెంచిపనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

# ఆరోగ్యశ్రీకి గ్రీన్ ఛానెల్‌వెట్టాలి?

## ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకపోవడంతో దవాఖానలు మూతపడే పరిస్థితులొచ్చాయ్?

## సర్కార్ సాయంలేక.. ఐటీ కంపెనీలు వెళ్లిపోతున్నయ్? : హరీశ్ రావు



హైదరాబాద్, మనం ప్రతినిధి : ఆరోగ్యశ్రీ బిల్లులు గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నది.. కానీ, అందుకు విరుద్ధంగా సర్కార్ తీరు ఉన్నదని మాజీ మంత్రి, బీఆర్ఎప్ ఉపనేత హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. చాలకాలంగా నిధులు విడుదల కావడం లేదు అని.. బకాయివడ్డ పెండింగ్ బిల్లులను వేంటను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ వేధికగా హరీశ్‌రావు మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.5 లక్షలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10 లక్షలు ఇస్తామని చెప్పారు. రూ.5 లక్షలు నుండి రూ.10 లక్షలు పెంచడం వల్ల రెండున్నర సంవత్సరాలలో కేవలం 496 మంది మాత్రమే లబ్ధి పొందాదన్నారు. ఎందుకంటే కార్పొరేట్ హాస్పిటల్స్ మేజర్ సర్జరీలకు ఆరోగ్యశ్రీ కింద ట్రీట్‌మెంట్ ఇవ్వడం లేదు?.. కనీసం దానిపై రివ్యూ అయిన చేయాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా ఆరోగ్య శ్రీ కింద రూ.5 లక్షల నుండి రూ.15 లక్షల వరకు 607 మందికి డబ్బులు విడుదల చేశామని, కానీ మీరు 496 మందికే ఇచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తామని నోటీసులు ఇచ్చినా బిల్లులు రిలీజ్ కావడం లేదని ఆరోపించారు. చిన్న చిన్న దవాఖానలు మూతపడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి ఆరోగ్యశ్రీ కింద పెండింగ్ బిల్స్ ఎన్ని ఉన్నాయో.. ఎప్పటిలోగా చెల్లిస్తారో సదరు శాఖకు సంబంధించిన మంత్రి సమాధానం చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

### ఐటీ టవర్లపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం : హరీశ్

తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో పెద ఎత్తున గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌తో పాటు జిల్లాలో సైతం ఐటీని విస్తరింపజేసిందని హరీశ్ రావు పేర్కొన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఐటీ టవర్లను నిర్లక్ష్యం చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ విధానాల వల్ల చాలా కంపెనీలు వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట ఐటీ టవర్‌లో కూడా గతంలో 18 కంపెనీలు పనిచేస్తుంటే.. ఇప్పుడు 11 కంపెనీలు మాత్రమే పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కనీసం ఇంటర్నెట్ బిల్ కట్టకపోవడం వల్ల ఇంటర్నెట్ కూడా కట్ చేశారు. ఐటీ టవర్‌లో పని చేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా 4 నెలల నుండి జీతాలు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. అలాగే గతంలో తాము ఉన్నప్పుడు వాళ్లకు మూడేళ్లు ఉచితంగా అద్దేను సైతం కల్పించామన్నారు. ఇప్పుడు కూడా వాళ్లకు మరో మూడేళ్లు ఫ్రీ రెంటల్ ఫెసిలిటీ కొనసాగించాలని ఈ సంర్భంగా హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.

# బీసీ కార్పొరేషన్‌కు నిధులివ్వండి

## గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన ధర్నా

## గొల్ల కుర్మలకు, మత్స్యకారులకు చేపపిల్లలను విడుదల చేయాలి

హైదరాబాద్, మనం ప్రతినిధి : బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించకుండా, బీసీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. 22వ శాసనసభ సామవేశాల సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఉప నేత హరీశ్ రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు అమరవీరుల స్థూపం దగ్గర గురువారం నిరసన చేపట్టారు. అంతకుముందు గన్‌పార్క్ నుంచి అసెంబ్లీకి ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, కార్పొరేషన్లకు నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గొల్ల కుర్మలకు, మత్స్యకారులకు చేపపిల్లలను విడుదల చేయాలన్నారు. బీసీలను నట్టేట ముంచిన రేవంత్ సర్కార్ గద్దె దిగాలని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## శ్రీరామనవమి శుభాకాంక్షలు



హైదరాబాద్, మార్చి 26 మనం : రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీ రామనవమి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి సీతారాముల ఆశీస్సులతో దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించారు. భద్రాద్రి రామాలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.351 కోట్లు కేటాయించామన్నారు. భద్రాద్రి శ్రీరాముని క్షేత్ర ప్రాధాన్యం దేశమంతటికీ చాటేలా ఘనంగా నవమి వేడుకలు జరుపుకోవాలన్నారు. భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సేవలు

## స్వీయ ఆదాయ వనరులు పెంచుకోవాలి...

## ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి






హైదరాబాద్: హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఎంటీఎస్లో ఏటికేడు ప్రయాణికుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఎంఎంటీఎస్ సర్వీసులపై శాసనమండలి హాల్లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్ల సంఖ్య పెంచడంతో పాటు క్రమంతప్పకుండా సమయ పాలన పాటిస్తూ సర్వీసులు నడపాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపలికి ఉన్నందున అక్కడకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని సీఎం తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సీఎం సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు.. వసతులు మెరుగుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఆర్ అండ్ బీ వికాస్ రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హెచ్ఎంటీఏ ఎండీ జీవన్ బాబు, దక్షిణ మధ్య రైల్వే డీసీఎం చరణ్ నాయక్ పాల్గొన్నారు.

## దావోస్ పర్యటనలో రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు

- మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, మార్చి 26(మనం బ్యూరో) : ఇటీవల దావోస్‌లో పర్యటించిన సందర్భంగా రాష్ట్రానికి రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ విపక్ష సభ్యులు చేసిన విమర్శలను ఖండించారు. దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధికారుల బృందంతో కలిసి పర్యటించామనీ, ఈ సందర్భంగా పెట్టుబడిదారులతో ప్రభుత్వం 44 ఎంవోయూలు కుదుర్చుకుందని వెల్లడించారు.

ఈ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రపంచ కార్పొరేట్ల పెట్టుబడులకు స్వర్గధామమనీ, పారిశ్రామికవేత్తలు ముందుకు రావడానికి అనేక ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విదేశీ పెట్టుబడుల పేరుతో ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేసిందనీ, అయినప్పటికీ ఎవరూ ముందుకు రాలేదని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు విమర్శించారు.

## కొమ్ములెక్కుపెట్టిన దుప్పి

ఆధిపత్యం కోసంమో
ఆయుధ వ్యాపారం కోసమో
వాడు వదిలిన
లోహ విహంగాల సాక్షిగా
పచ్చగా గుబాళిస్తున్న
ప్రార్థనా మందిరాలు
అక్షరాల జ్ఞానిలయాలు
సామాన్యుల జీవన లోగిళ్లు
శిథిలాల మధ్య చిక్కుకుని
నెత్తురోడుతూ దుఃఖిస్తుంటాయి
గెలిచేదెవడో ఓడేదెవడో
తేల్చేసే అంచనాలు పూర్తవకముందే
ప్రజలే ఓడిపోయి
యుద్ధ శకలాలమధ్య
క్షతగాత్రులుగా మిగిలిపోతారు
చేజారిన భోగోళమంత స్వప్నం
భళ్లున బద్ధలై
అద్దం పెక్కులు గుచ్చుకున్న
దేశ దేహమొకటి
నీలి ఆకాశం కింద తప్పిపోయిన
నెత్తుటి చారల పావురమై
నేలకొరిగి వుంటుంది
కొమ్ములు ఎక్కుపెట్టి
తెల్ల చారల పులిపైకి
లంఘిస్తున్న దుప్పి ఒకటి
ప్రపంచం మద్ధతు కూడగడుతూ
ధిక్కార గీతాన్ని రచిస్తుంది

**- చిత్తలూరి**
9133832246

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి**
**- ఎడిటర్**

# భద్రాద్రి రామయ్య కళ్యాణం..కమనీయం



అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుమల తర్వాత రాష్ట్రంలో ఆరు పెద్ద దేవాలయాలు ఉండేవి... అవి దేవాదాయ శాఖచే 6ఏ టెంపుల్స్‌గా గుర్తింపు పొందాయి. శ్రీశైలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ కనక దుర్గమ్మ, భద్రాచలం, వేములవాడ దేవాలయాలను 6ఏ టెంపుల్స్ అని పిలిచేవారు. 6ఏ అంటే ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్ అని అర్థం. రాష్ట్ర విభజన తర్వాత ఈ ఆరు ఏ గ్రేడ్ టెంపుల్స్‌లో వేములవాడ, భద్రాచలం తెలంగాణలోకి రావడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా భద్రాచలం మండలంలోని రెవెన్యూ గ్రామం భద్రాచలం. ఇక్కడ భక్త రామదాసు నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానము కలిగిన గోదావరి నది దక్షిణ తీర పుణ్యక్షేత్రం. దీనిని భద్రాద్రి, శ్రీరామ దివ్యక్షేత్రం పేర్లతో కూడా పిలుస్తారు. పూర్వపు జిల్లా కేంద్రమైన ఖమ్మం పట్టణానికి 105 కి.మీ.ల దూరంలో ఉంది.

పూర్వం భద్రుడు అనుభక్తుడు శ్రీ రాముడికోసం తపస్సుచేసి, తను ఒక కొండగా మారి తనపై శ్రీ రాముడు వెలసే విధంగా వరంపొందాడని అంటారు.ఆ కొండకు భద్రుడు పేరు మీద భద్రగిరి అని తరువాతి కాలంలో ఆ పట్టణానికి భద్రాచలం (భద్ర + అచలం) అని పేరు స్థిరపడింది.

గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానీషా పాలనా కాలంలో భద్రాచలప్రాంతానికి తహశీల్దారుగా కంచెర్ల గోపన్న పనిచేసే వాడు. ఇక్కడికి సమీపంలోని నేలకొండపల్లి గ్రామానికి చెందిన గోపన్న శ్రీరామ భక్తుడు. తాను ప్రజల నుండి వసూలు చేసిన పన్ను (6 లక్షల రూపాయలు) సొమ్మును ప్రభుత్వానికి జమ చెయ్యకుండా..1645 - 1680 మధ్య కాలంలో భద్రగిరిపై శ్రీ రాముడు వెలసిన ప్రదేశమందు రామాలయాన్ని నిర్మించాడు. సీతారామచంద్ర స్వాములకు రకరకాల నగలు..చింతాకు పతకం, పచ్చల పతకం మొదలైనవి చేయించాడు. ఆ సొమ్ము విషయమై తానీషా గోపన్నను గోల్కొండ కోటలో బంధించగా..ఆ చెరసాల నుండి తనను విముక్తి చెయ్యమని రాముణ్ణి గోపన్న ప్రార్థించాడు. ఆ సందర్భంలో రామునిపై రచించి, పాడిన పాటలే రామదాసు కీర్తనలుగా ప్రసిద్ధి చెందాయి. గోపన్న కీర్తనలకు తన్మయత్వం చెందిన రాముడు, దేవాలయ నిర్మాణానికి ఉపయోగించిన ప్రభుత్వ సొమ్మును తానీషాకు చెల్లించి గోపన్నకు చెరసాల నుండి విముక్తి ప్రసాదించాడని ఐతిహ్యం. అలా కంచెర్లగోపన్న రామదాసుగా స్థిరపడ్డాడు.


దేవాలయమందు సీతా, లక్ష్మణ, హనుమంత సమేతంగా శ్రీరామచంద్రుడు ఇక్కడ అత్మారాముని రూపంలో కొలువుతీరి ఉన్నాడు. సీత, రాముని తొడపై కూర్చొని ఉన్నట్లు ఇక్కడి విగ్రహాలు చెక్కబడి ఉన్నాయి. మరే దేవస్థానంలోనూ లేని ప్రత్యేకత ఇది. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమికి వైభవంగా జరిగే సీతారామ కళ్యాణ ఉత్సవానికి అశేష ప్రజానీకం వస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కళ్యాణోత్సవానికి ముత్యపు తలంబ్రాలు, పట్టు వస్త్రాలు పంపించడం సాంప్రదాయం. ఇక్కడ శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా జరుగుతుంది. రామదాసు చేయించిన వివిధరకాల నగలు దేవస్థానపు ప్రదర్శనశాలలో ప్రదర్శనకు ఉంచారు. భద్రాచలం లోని శ్రీరాముడిని వైకుంఠ రాముడు అని అంటారు. ఇక్కడి రాముడు వైకుంఠమునకు వెళ్ళిన తరువాత మరల భూమి మీదకి వచ్చి, తన భక్తుడైన భద్రుడి కోరిక తీర్చి భద్ర పర్వతంపై నిలిచాడు.

భారతీయ కాలమాన ప్రకారం రాముడు జన్మించినది వైవస్వత మన్వంతరమున పంచమ త్రేతాయుగ నాలుగవ భాగ మున ఎనభై వేల సంవత్సరానికి సరియగు విళంబి సంవత్సర చైత్ర శుద్ధ నవమి బుధవారం అని శ్రీమాన్ కోయిల్ కందాడై వెంకట సుందరాచార్య స్వామి వచించారు. పురాణాల ఆధారంగా మహాభారత యుద్ధం నాటికి శ్రీరాముడు అతి ప్రాచీనుడు. మను చక్రవర్తి వంశావళిలో రాముడు 65వ పురుషుడని, ఆయన వంశస్తుడు శ్రీకృష్ణునికి సమకాలికుడైన బృహద్బలుడు మను వంశమున 94వ వాడని సుప్రసిద్ధ పాశ్చాత్య చారిత్రిక పరిశోధకుడు పరిటేరు నిర్ణయించాడు. వాల్మీకి రామాయణమునుసరించి రాముని జననకాలం క్రీ.పూ.2055వ సంవత్సరంగా ఎల్.డి. స్వామికన్ను పిళ్ళై నిర్ధారించగా, ఎం.ఆర్. సంపత్కుమార సమర్థించారు. పాశ్చాత్య చరిత్రకారులైన డబ్ల్యు.డబ్ల్యు.హంటర్, కానింగ్ ఆర్నాల్ వంటి వారు, రామాయణ చరిత్ర క్రీ.పూ.1000 సంవత్సరాల ప్రాంత మని పేర్కొన్నారు. మహా విష్ణువు ఎత్తిన 10 అవతారాలలో ఏడవది రామావ తారం. శ్రీరాముడు కోసలాధీశుడైన దశరథునికి, కౌసల్యా గర్భమున చైత్ర శుద్ధ నవమి పునర్వసు 4వ పాదమున కర్కాటక లగ్నంలో మధ్యాహ్న సమయాన జన్మించాడు. అందుకే చైత్ర శుద్ధ నవమి శ్రీరామ జయంతి దినమైంది. రాముడు పుట్టినది నవమికాగా, అంతకు ముందు అనగా రాముడు గర్భంలో ఉన్న చివరి తొమ్మిది దినాలు చేసే మత విధులు, పూజాదికాలు గర్భ నవరాత్రులుగా ఆరాధనీయం. ఆగస్త్య సంహితలో అష్టమి గురుపూజ, నవమి ప్రతిమా కల్పన, దశమి ప్రతిమా దానంగా మూడునాళ్ళ పండగగా చెప్పబడింది. నవమి ఉపవాసం, రాత్రి పురాణ శ్రవణం, జాగరణ, మరునాడు సంతర్పణ ఉంది. పునర్వసు నక్షత్ర యుక్త నవమి పుణ్యకాలమని భావిస్తారు. అష్టమితో కూడిన నవమిని రామపూజ కూడదని విష్ణుభక్తులకు అగస్త్య సంహిత సూచిస్తున్నది. అందుకే మిగులు నవమి నాడు వైష్ణవులు రామ జయంతిని జరపడం పాటిస్తారు. శ్రీరామ నవమి నాటి కార్యకలాపాలు మధ్యాహ్నం 12గంటలకు చేయాలని వ్రత గ్రంథాలు సూచిస్తున్నాయి. రామ జననం, కల్యాణం జరిపే రామ నవమి కాకుండా రామ సంబంధ పండగలలో ఒకటి రామలక్ష్మణ ద్వాదశిగా జరుపుకునే జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి, రెండవది జానకీ జయం తిగా జరుపుకునే ఫాల్గుణ శుద్ధ అష్టమి. జనకునికి యజ్ఞ శాలకై భూమిని దున్నతుండగా నాగటి చాలుకు తగిలిన బంగారు పెట్టెలో భూజాత దొరికినది ఫాల్గుణ శుక్ల అష్ట మిగా భావిస్తారు. శ్రీకృష్ణునిలా కాక, రాముని జన్మదినోత్సవం కన్నా కళ్యాణోత్సవానికి విశిష్టత ఉంది. రామ జన్మకు కారణమైన రావణవధ ద్వారా లోకకళ్యాణం. సీతాదే వితో కూడిన రాముని వల్లే లోక కళ్యాణం సాధ్యమైంది. రాముని ఆంధ్రుల దౌహిత్రునిగా భావిస్తారు. కోసలాదేశ రాజు కూతురు కౌసల్య. దక్షిణ కోసల అంటే పూర్వాంధ్ర దేశ ఉత్తర భాగం. కౌసల్య ఆంధ్రుల ఆడపడచు అనీ, వనవాసాన్ని రాముడు తల్లి పుట్టింటి దేశపుటడవులలో గడిపారని వాదం ఉంది. వనవాస రాఘవునికి ఆతిథ్యమిచ్చిన తెలుగు నేలపై ఆయన జన్మదినమైన శ్రీరామనవమి, కళ్యాణ దినంగా ఘనంగా జరుపుకోవడం సనాతన సాంప్రదాయంగా వస్తున్నది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# భారత్ తన స్వతంత్రతను కోల్పోతున్నదా?





ఇప్పుడు ప్రపంచం మళ్లీ ఒక పెద్ద సంక్షోభ దశలో నిలిచింది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు కేవలం ఆ ప్రాంతానికే కాకుండా, మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయి. భారత్ వంటి పెద్ద దేశంపై కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్లో స్వయంగా పరిస్థితులు బాగాలేవని, చాలా ఆందోళనకరంగా ఉన్నాయని చెప్పారు.గ్యాస్, ఇంధనం సరఫరాలో ఏ సమస్యాలేదని కూడా చెప్పారు. కానీ పరిస్థితులు మాత్రం చాలా ఘోరంగా ఉన్నాయి.

ప్రజల జీవితాలు దుర్భరంగా తయారవుతున్నాయి. గ్యాస్ సిలిండర్లు దొరకడం కష్టంగా ఉంది. బ్లాక్ మార్కెటింగ్ పెరిగిపోయింది. చిన్న వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలు బాగా ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు ఇన్డక్షన్ (విద్యుత్)స్టవ్లను కొనుగోలు చేస్తున్నారు. కానీ వాటి ధరలు కూడా పెరిగాయి. కొనగలిగే స్థోమత లేని వారు అర్థాకలితో జీవించడానికి లేదా ఇతరుల సహాయంపై ఆధారపడటానికి సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం కరోనా రోజులు గుర్తుకొస్తున్నాయి, ఆ సమయంలో ప్రజా జీవనం దుర్భరమైపోయింది. ఆక్సిజన్, మందులు కూడా బ్లాక్ మార్కెట్లో కొనుక్కోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి.

ప్రధాన మంత్రి మోదీ ఈ పరిస్థితులపై పార్లమెంట్లో మాట్లాడారు. కానీ ఇరాన్‌పై దాడులపై స్పష్టమైన వైఖరిని ప్రకటించలేదు. ఇది చాలా ఆశ్చర్యకర విషయం, ఎందుకంటే భారత్ ఒకప్పుడు తన నిస్పక్షపాత, న్యాయబద్ధ విధానాలతో ప్రపంచంలో ప్రసిద్ధి చెందింది. మరిప్పుడు భారత్ వైఖరిలో ఈ మార్పు ఎందుకు వచ్చిందో తెలియదు.

2003లో, అమెరికా ఇరాన్‌పై అణ్వాయుధాలు ఉన్నాయన్న ఆరోపణలతో దాడి చేసినప్పుడు, అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ఆ చర్యను తీవ్రంగా ఖండించారు. పార్లమెంటులో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించి, అమెరికా దుర్మార్గాన్ని ఎండగట్టారు. అమెరికా అహంకార చర్యలు ప్రపంచానికి ప్రమాదకరమని ప్రకటించారు. అన్యాయంగా ఎవరు ఎవరిపై యుద్ధం ప్రకటించినా తాము వ్యతిరేకిస్తామని భారత్ అప్పుడు స్పష్టంగా చెప్పింది. ఇప్పుడు భారత్ ఆ ధైర్యం, ఆ ఆత్మవిశ్వాసం ఎందుకు కోల్పోతుందో అర్థంకాదు. మోదీ పాలనలో భారత్ అమెరికా,ఇజ్రాయిల్తో సంబంధాలను గణనీయంగా పెరిగినమాట వాస్తవం. రక్షణ, సైనిక ఒప్పందాలు, సాంకేతిక ఒప్పందాలు ఇవన్నీ అవసరమే, కానీ ఈ సంబంధాల కారణంగా భారత్ తన స్వతంత్రతను తాకట్టు పెట్టాల్సిన అవసరం లేదు.

ఇరాన్‌పై ఇటీవల జరిగిన దాడులు అంతర్జాతీయ చట్టాల స్పష్టమైన ఉల్లంఘున. చాలా దేశాలు యుద్ధం పట్ల ఆందోళన వ్యక్తం చేశాయి. కొందరు తీవ్ర పదజాలంతో ఖండిస్తే, మరికొందరు సార్వభౌమత్వంపై దాడిగా అభివర్ణించారు. కానీ భారత్ ఎలాంటి నిర్దిష్టమైన ఖండన, శక్తివంతమైన విదేశాంగ చర్యలు తీసుకోలేదు. 'నిష్పక్షపాత విధానం'లో కేంద్ర స్థానంలో ఉన్న భారత్ స్థాయికి ఇది ఏమాత్రం శోభించే లక్షణం కాదు. భారతదేశం ఎనర్జీ పాలసీలో పరిమితులు ఎదుర్కొంటోంది. దేశం ఇంకా అన్ని రకాల ఎనర్జీ అవసరాలకు స్వయం సమర్థత పొందలేదు. క్రూడ్ ఆయిల్, గ్యాస్ వంటి వనరుల కోసం పెద్దమేరకు బయటి దేశాలపై ఆధారపడుతోంది.

దేశీయ పరిస్థితులు కూడా ఆందోళనకరంగా ఉన్నాయి. గ్యాస్ సిలిండర్లు, బ్లాక్ మార్కెటింగ్, పెట్రోలు కోసం పొడవైన క్యూలైన్లు ప్రజల జీవితాలను కష్టతరం చేస్తున్నాయి. ఎలాంటి క్రైసిస్ లేదని ప్రభుత్వం చెబుతోంది కానీ సమస్య ఉన్నమాట నిజం. ప్రజలు దాన్ని అనుభవిస్తున్నారు. భారత్ తన అవసరాల్లో పెద్ద భాగాన్ని గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఈ సరఫరా మార్గాలు హోర్మజ్ జలసంధి మీద ఆధారపడి ఉన్నాయి. ఒక చిన్న అవరోధం కూడా మొత్తం వ్యవస్థను అతలాకుతలం చేస్తుంది. ప్రభుత్వం అంతర్జాతీయ సమస్యలపై స్పష్టమైన స్పందన కలిగి లేదు.

ఇది ప్రజల నమ్మకాన్ని ప్రభావితం చేస్తుంది. ధరలు పెరుగుతున్నాయి, నిరుద్యోగత, ప్రాథమిక వసతుల లోపం ప్రజలను కష్టంలో పడేసింది. ఇలాంటి సందర్భంలో, విదేశీ విధానం స్పష్టంగా లేకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచు తుంది.

భారత్ విధానాలు కేవలం స్వార్థాల చుట్టూ తిరుగుతున్నాయి. గతంలో భారత్ న్యాయానికి, స్వతంత్రతకు ప్రాధాన్యం ఇచ్చేది. ఇప్పుడు ఆ సూత్రాలు మరుగున పడ్డాయి. చిన్న దేశంపై దాడి జరిగితే మౌనం వహించడం, నామమాత్రంగా స్పందించడం, పెద్ద దేశాలకు వంత పాడడం, బలవంతులతో సంబంధాలకు ప్రాధాన్యం ఇవ్వడం, దీర్ఘకాలంలో ఇది దేశ ప్రతిష్టకు హానిగా పరిణమించవచ్చు.

సాధారణంగా పాకిస్థాన్ బలహీన దేశం, భారత్‌తో దానికి పోలికే లేదు. కాని ఇప్పుడది ఇరాన్-అమెరికాల మధ్య మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు ఆసిం మునీర్ , ప్రధాని షెహబాజ్ షరీఫ్ లు ఇతర దేశాలతో సమన్వయం చేస్తున్నారు. కానీ భారత్ కేవలం ఆత్మరక్షణ ప్రకటనలకే పరిమితమైంది. ఇదే సమయంలో, ప్రపంచ దేశల ద్వంద్వ విధానాన్ని కూడా గమనించాలి. ఒక బలమైన పశ్చిమ దేశానికి ముప్పు ఏర్పడితే న్యాయం గుర్తుకొస్తుంది. మానవహక్కుల గురించి గొంతు చించుకొని మాట్లాడతారు. కానీ పెద్ద దేశాలు అంతరాజ్తీయ నియమాలను ఉల్లంఘించి చిన్న దేశాలపై, బలహీన దేశాలపై దాడులకు పాల్పడితే మౌనం వహిస్తారు. ఇలాంటి పరిస్థితిలో, భారత్ తన సూత్రప్రాయ విధానమేమిటో స్పష్టంగా ప్రకటించాలి.

మొత్తానికి భారత్ ఒక చారిత్రక మలుపులో ఉంది. దాని ముందు రెండు మార్గాలున్నాయి.

ఒకటి : శక్తివంతుల ఒత్తిడిలోకిలోనై తన స్వతంత్రత తగ్గించుకోవడం, న్యాయ సూత్రాలను వదిలివేయడం.

రెండవది: న్యాయం, ధర్మం, నైతిక విలువల నాయకత్వం కాపాడుకుంటూ, ఒక నిజమైన గ్లోబల్ లీడర్‌గా ఎదగడం. ఏ మార్గాన్ని ఎంచుకోవాలో నిర్ణయం ప్రభుత్వం చేతిలో ఉంది. ఇలాంటి సంక్లిష్ట సమయంలో తీసుకునే నిర్ణయమే భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది. దేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థను సుస్థిర పరచి ప్రజల విశ్వాసాన్ని పటిష్టం చేస్తుంది. కనుక భారత్ ఈ సంక్లిష్ట సమయంలో చారిత్రక బాధ్యతతో, ధైర్యంగా, సూత్రప్రాయ నిర్ణయాలు తీసుకోవాలి. సమస్యాత్మక సమయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోగలిగే ధైర్యవంతమైన దేశాలు మాత్రమే ముందుకు వెళ్ళగలవు.

**- యండి. ఉస్మాన్ ఖాన్**

## అక్షరాంక్షలు

రవి గాంచిన చోటే రాజుకు భీతిల్లి
నేడు కవి నక్కిన చోట
నిర్భయ కవితా దినోత్సవమా?!
పీడిత పక్షాన నిలవాల్సిన పంక్తులు
ప్రభువు మెడలో గజమాలలవుతున్న పూట
నిస్సిగ్గుగా కవి సమ్మేళనమా?!
బాధిత స్వరం అవ్వాల్సిన సిరా
రాజ్య పక్షాన బధిర నాదం అందుకుంటున్న వేళ
నిష్పక్షపాత కవితా గానమా?!
ఏరా
ఎల్లలు లేని కవిత్వానికి
ఇప్పుడు ఆంక్షల గోడలు కట్టారు కదరా !
మరి నా ఈ కవితను
సామాజికోద్ధరణకు
నేను ఏ 'శీర్షిక' తో ముస్తాబు చేయను ?
ముద్రించాల్సిన వాడే చించేస్తుంటే
ఇంకే 'చిరునామాకు' రాసి పంపించను ?!

**- తిప్పాన హరిరెడ్డి**
9493832412

## చదువు

మేధకు మేత
చదువు మార్చు రాత
పెట్టకు కోత

జ్ఞానపు దారి
చీకటి చీల్చు సూరి
చదువేమరి

నైపుణ్య జ్ఞానం
భుక్తి భక్తి జీవనం
రక్షా కవచం
వెల్గుల తావు
అందరికి చదువు
నేతల పూచీ

**- రేడియమ్**
9291527757

# అమెరికా షరతుల అంతరార్థం ఏమిటి?






ఏక ధ్రువ ప్రపంచంలో ఏకైక అగ్రరాజ్యంగా అవతరించిన అమెరికా దేశానికి అధ్యక్షుడైన వ్యక్తి ఎవరైనా తననుతాను ప్రపంచఅధినేతగా భావించుకుంటుంటాడు.ప్రస్తుత అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విషయానికి వస్తే ఆయన అది నిజమేనని నమ్ముతుంటాడు. ప్రపంచమంతా తన మాటలను శిరసావహించాలని కోరుకుంటాడు. ఆ దిశగానే పావులు కదుపుతుంటాడు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం విషయంలో ఆయన ప్రకటించిన పదిహేను షరతులను చూసినప్పుడు మనకు ఇదే విషయం స్పష్టమ వుతుంది. ఒక ప్రకటన విడుదల చేసి-దాని పైన చేసిన సంతకపు తడి ఆరక ముందే దానికి విరుద్ధమైన ఇంకో ప్రకటనను వెలువరిస్తున్నాడు. యుద్ధపరిభాషలో చెప్పాలంటే మాటను మడతపెట్టి ఒక మిస్సైల్ గా వదిలి - ఆ వెనువెంటనే,దాని వెనుక నుంచి ఇంకొక మిస్సైల్ వేసి మొదటి దానిని కూల్చడం డోనాల్ ట్రంప్ ప్రత్యేకత. అమెరికాలోగానీ, ప్రపంచంలోని ఏ ఇతర దేశాలలో గానీ ఇలాంటి ప్రకటనలు చేసిన వ్యక్తులు ఉన్నారో లేదో - చరిత్రలో కాస్త వెనుకకు వెళ్లి పరిశోధించాల్సి ఉంటుంది. ఇప్పటివరకయితే ఇతనిదే రికార్డ్.

ఒక దేశ ప్రతినిధులను చర్చల టేబుల్ ముందు కూర్చోబెట్టి అటువైపు నుంచి ఆ దేశపు నాయకులపై బాంబులు వేసి తుదముట్టించిన ఘనత కూడా బహుశా ఈయనకే దక్కుతుంది. అలాంటి ఘనత వహించిన వ్యక్తి మరిన్ని ఘనతలు సాధించే దిశగా అడుగులు వేస్తున్నాడు అందులో భాగంగానే ఇరాన్ యుద్ధాన్ని ముగించి 48 గంటల్లో లొంగిపోవాలని ఆదేశం జారీ చేశాడు. కానీ ఆ గడువు పూర్తికాక ముందే యుద్ధానికి ఐదు రోజుల విరామాన్ని ప్రకటించాడు. ఆ గడువు కూడా పూర్తిగాకముందే మరో కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చాడు. యుద్ధ విరమణకు 15 అంశాలతో కూడిన షరతులను విధించాడు.

అందులో హోర్ముజ్ జలసంధిని నిరంతరం తెరచిఉంచడం, అణ్వాయుధ కార్యక్రమాన్ని శాశ్వతంగా వదులుకోవడం, అణుశుద్ధిని నిలిపివేయడం, ఇప్పటికే శుద్ధి చేసిన యురేనియం నిలువలను అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు అప్పగించడం, పశ్చిమాసియా దేశాలలోని మిలీషియా కార్యకలాపాలను ఆపివేయడం, వివిధ సాయుధ గ్రూపులకు మద్దతు నిలిపివేయడం, బాలిస్టిక్ క్షిపణుల సంఖ్య, సామర్థ్యంపై నియంత్రణ- స్వీయ రక్షణకే క్షిపణుల వినియోగం ఇలాంటి ముఖ్యమైన షరతులకు ఒప్పుకుంటే ఇరాన్ పై ఉన్న అన్ని రకాల ఆంక్షలను ఎత్తివేస్తానని ఆయన ప్రకటించారు. ఇటు షరతులను విధించిన నోటి తోటే ఇంకొక వైపు తాము యుద్ధాన్ని గెలిచామని హోర్ముజ్‌పై ఇరాన్ తమకు పెద్ద బహుమతిని ఇచ్చిందని చెప్పుకున్నాడు. ఇరాన్ లోని గౌరవనీయమైన వ్యక్తులతో చర్చలు జరుగుతున్నాయని ఆ దేశం ఇప్పటికే చాలా ముఖ్యమైన షరతులను అంగీకరించిందని కూడా చెప్పుకొచ్చాడు. యుద్ధం ముగిసిపోయి, తాము విధించిన షరతులలో ఎదుటి పక్షం అతి ముఖ్యమైన వాటిని అంగీకరించిన తరువాత మళ్లీ ఈ కొత్త షరతులు ఏమిటి అని ఆయనను ఎవరూ నిలదీయడం లేదు. అయినప్పటికీ యుద్ధ విరమణ కోసం పాకిస్తాన్, ఈజిప్టు లాంటి దేశాలు ఇరుపక్షాలతో మధ్యవర్తిత్వం నెరపుతున్నాయని వార్తలందుతున్నాయి. ఇరు పక్షాలకు నచ్చ చెప్పే విషయంలో ఈ దేశాల నాయకులు తలమునకలైనట్లు, ఒకరి షరతులను ఇంకొకరికి చేరవేస్తున్నట్లుగా తెలుస్తున్నది. ఇరాన్ కూడా తమ యొక్క డిమాండ్లను మధ్యవర్తుల ముందు ఉంచినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తమ దేశంపై జరుగుతున్న దాడులను పూర్తిస్థాయిలో నిలిపివేయడం, రానున్న రోజులలో తమపై ఎలాంటి దాడులు జరగవని హామీ ఇవ్వాలని, అకారణంగా తమపై దాడి చేసి ఇంతటి విధ్వంసానికి కారణమైనందుకు తమ దేశానికి నష్టపరిహారం చెల్లించాలని, తమ క్షిపణి కార్యక్రమానికి ఎలాంటి నియంత్రణా పనిచేయదని, హోర్ముజ్ జలసంధి పై తమ ఆధిపత్యాన్ని అధికారింగా గుర్తించాలని, గల్ఫ్ ప్రాంతంలో అమెరికా స్థానాలని పూర్తిగా ఎత్తివేయాలనీ, లెబనాన్ లోని హిజ్బుల్లా మిలీషియాపై ఇజ్రాయిల్ దాడులను నిలిపివేయడం లాంటి ముఖ్యమైన డిమాండ్లను వారి ముందు ఉంచినట్లు తెలుస్తున్నది. ఒకవేళ మధ్యవర్తులు ఇరుపక్షాలనూ ఒప్పించి చర్చల టేబుల్ వద్దకు తీసుకు రాగలిగినా పై డిమాండ్లను చూసినప్పుడు అవి ఏ మేరకు ఫలిస్తాయనే విషయంలో అందరికీ సందేహాలు ఉన్నాయి. ఎందుకంటే చర్చల విషయంలో అమెరికా అనుసరించే విధానం అలా ఉంటుంది. ప్రస్తుతం ట్రంప్ ప్రతిపాదించిన చాలా అంశాలు గతంలో ఒబామాతో జరిగిన ఒప్పందానికి సంబంధించినవే ఉన్నవి. డోనాల్డ్ ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దుచేసి ఇరాన్‌ను మళ్ళీ ఆంక్షల చట్రంలో బిగించడం వల్లనే ఈ సమస్య ఇంతదాకా వచ్చింది. డోనాల్డ్ ట్రంప్ 48 గంటల విరామం ప్రకటించిన కాలంలోనే ఇజ్రాయిల్ ఇరాన్‌కు చెందిన పలు నగరాలపై భీకర దాడులు కొనసాగించింది. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ నావికాదళ విభాగం అధిపతి అలీరెజా తంగసిరిని చంపివేసినట్లు గురువారం రోజు ప్రకటించింది. దీనిని బట్టి అర్థమవుతున్నది ఏమిటి అంటే యుద్ధాన్ని ఆపేదెవరో.. కొనసాగించేది ఎవరో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది.

దీనికి ప్రతిగా ఎన్ని నగరాలు ధ్వంసం అయినా, ఎంతమంది ముఖ్య నాయకులు అసువులు బాసినా ఇరాన్ వెనకడుగు వేసేటట్లు కనిపించడం లేదు. అకారణంగా తమపైకి యుద్ధానికి దిగిన శత్రువుల అంతు చూసేదాకా వదలమని ఆదేశ నాయకులు ప్రకటిస్తున్నారు. ఓటమిని ఒప్పందంగా చెప్పుకోవద్దని వాళ్లు హెచ్చరిస్తున్నారు శత్రువు పశ్చాత్తాప పడేదాకా యుద్ధం ఆపేది లేదని తెగేసి చెబుతున్నారు. ట్రంపు విధించిన పదిహేను షరతులను ఆసాంతం పరిశీలిస్తే అర్థమయ్యేది ఏమిటంటే ఇరాన్‌ను అమెరికా ఇజ్రాయిల్ దేశాలకు కట్టు బానిసగా చేసే పదహారవషరతు దానిలో అంతర్లీనంగా దాగి ఉన్నట్టు కనిపిస్తుంది. ఇరాన్ వాటిని ఎట్టి పరిస్థితులలోనూ అంగీకరించేటట్టుగా కనిపించడం లేదు. కాబట్టి పశ్చిమాసియాలో యుద్ధం మరికొంత కాలం కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. అది ఎటు నుంచి ఎటువైపు వెళ్ళి ఏ రూపం తీసుకుంటుందో కాలమే తేల్చాలి.

**- గుండెబోయిన శ్రీనివాస్**
9985194697

# ప్రజలు వదంతులను నమ్మవద్దు

- జిల్లాలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ నిల్వలు నిండుగా ఉన్నాయి
- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల, మార్చి 26(మనం ప్రతినిధి): జిల్లాలో పెట్రోల్, డీజిల్ మరియు వంట గ్యాస్ కొరత ఉందంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ఆయిల్ రిఫైనరీల నుండి స్థానిక డిపోల వరకు ఇంధన సరఫరా వ్యవస్థ ఎక్కడా ఆగిపోలేదని. జిల్లా అవసరాలకు మించి నిల్వలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు భయాందోళనలతో ఒక్కసారిగా బంకులకు రావడంతో సాధారణం కంటే 3 రెట్లు విక్రయాలు పెరిగాయని దీనివల్ల కొన్ని చోట్ల తాత్కాలికంగా 'నో స్టాక్' బోర్డులు కనిపిస్తున్నాయి తప్ప, ఇంధన కొరత లేదు. పెట్రోల్, డీజిల్ను డబ్బాలలో నిల్వ చేయడం లేదా నిబంధనల ప్రకారం నేరం. ఇది అగ్ని ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంది. బ్లాక్ మార్కెట్ కు పాల్పడినా లేదా అక్రమంగా నిల్వ చేసినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు జిల్లా కలెక్టర్ సూచన... సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మకండి. ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని, అత్యవసర సేవలు (అంబులెన్సులు), డాక్టర్లు, రైతులు మరియు సరుకు రవాణా వాహనాలకు ఇబ్బంది కలగకుండా సహకరించాలని ఇంధన సరఫరాలో ఎలాంటి లోపం లేదని తెలిపారు పౌరసరఫరాల శాఖ మరియు పోలీసు శాఖల సమన్వయంతో పెట్రోల్ బంకులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రజలు సంయమనం పాటించాలని కలెక్టర్ కోరారు.

# సంగారెడ్డి వరకు మెట్రో రైలును విస్తరించండి

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి, మార్చి 26 మనంప్రతినిధిః రాష్ట్ర అసెంబ్లీలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ కీలక అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలును పొడిగిస్తామని ముఖ్యమంత్రి గతంలో చేసిన ప్రకటనను గుర్తుచేస్తూ, పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంగారెడ్డి జిల్లా కేంద్రం వరకు మెట్రో సేవలను విస్తరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంగా ఉండటంతో నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఇక్కడ నివసిస్తూ హైదరాబాద్కు రోజువారీ రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో మెట్రో రైలు విస్తరణ చేపడితే ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. అదేవిధంగా మదీనాగూడ నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు జరుగుతున్న రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయని అసెంబ్లీలో ప్రస్తావించారు. 2026 నాటికి పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్ట్ ఆలస్యమవుతుండటంతో ప్రయాణికులు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పనులను పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# దశదినకర్మలో పాల్గొన్న రవినాయక్



మహబూబాబాద్, మార్చి 26(మనంన్యూస్): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తార్య తండ లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్తండ్రి లచ్చు నాయక్ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన ముఖ్య నాయకులు బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి ఎన్ నాయక్, కార్పొరేటర్ లావుడియా రవి నాయక్, లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఈసీ అనసూర్య జగరాం నాయక్, గబ్బర్ సింగ్, సీనియర్ జర్నలిస్ట్ భూక్యా శ్రవణ్ కుమార్, బిక్షపతి, రాజేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు అన్నిసౌకర్యాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



మంగపేట, మార్చి 26, మనం ప్రతినిధిః మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర సింహస్వామి ఆలయ అభివృద్ధిపై మాస్టర్ ప్లాన్ వెంటనే సిద్ధం చేయాలని, స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ సందర్శించి అభివృద్ధి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి దర్శనం కోసం అనేకమంది భక్తులు వస్తుంటారని, వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల వసతులు సౌలభ్యాలు ఆలయ అభివృద్ధి పై వెంటనే మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆర్చి నిర్మాణం, రోడ్డు విస్తరణ, కళ్యాణ కట్ట, కళ్యాణ మండపం, పార్కింగ్ స్థలాల ఏర్పాటు, ఇతర ఆలయ అభివృద్ధి పనులపై త్వరితగతిన నివేదికలు రూపొందించాలని పేర్కొన్నారు. ఆచార సాంప్రదాయాలకు ఆటంకం కలగకుండా ఆలయ అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్కిటెక్ బృందం, దేవాదాయ శాఖ డి ఈ రమేష్ బాబు, తాసిల్దార్ తోట రవీందర్, ఆలయ ఈవో మహేష్, ఎంపీడీవో బద్రు నాయక్, ఆలయ అర్చకులు, సంబంధిత అధికారులు, స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్య సేవలపై కలెక్టర్ దృష్టి

- ప్రత్యేక వైద్య శిబిరాల తనిఖీ



సంగారెడ్డి, మార్చి 26 మనం ప్రతినిధిః ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలోని పీహెచ్సీలు, యూపీహెచ్సీలలో స్పెషలిస్ట్ వైద్యులతో నిర్వహిస్తున్న వైద్య స్క్రీనింగ్ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు.ఆసుపత్రిలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ నమోదు ప్రక్రియ, డేటా ఎంట్రీ, రోగుల వివరాల సేకరణ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, రోగులకు ఇబ్బందులు కలగకుండా ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లను పెంచాలని, ఇంటర్నెట్ వేగాన్ని మెరుగుపర్చాలని ఆసుపత్రి సూపరింటెండెంట్కు సూచించారు.అనంతరం ఓపీ విభాగాలు, సర్జికల్, స్త్రీ, పురుషుల మెడికల్ ఓపీలు, ఫార్మసీ డిస్పెన్సింగ్ యూనిట్, ఫార్మసీ స్టోర్స్, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, క్రిటికల్ కేర్ విభాగం తదితరాలను పరిశీలించి రికార్డుల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.తదుపరి స్థానిక రైతు బజార్ సమీపంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, వందరోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఆర్బీఎస్కే నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్తహీనత,కంటి, చెవి, దంత సమస్యలు, పోషకాహార లోపాలను గుర్తించి అవసరమైన చికిత్సకు రిఫర్ చేస్తున్నట్లు వైద్యులు కలెక్టర్ కు వివరించారు. అనంతరం మారక్స్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ను సందర్శించి, స్పెషలిస్ట్ వైద్యులతో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, హెల్త్ రికార్డుల నిర్వహణ, మెడికల్ ఆఫీసర్ గది, ఔషధ నిల్వ గది, ప్రయోగశాల తదితర విభాగాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డీసీహెచ్ఎస్ కవిత, డాక్టర్ శశాంక్ తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.


# జిల్లాలో ఇంధన కొరత లేదు

- వదంతులను నమ్మవద్దు.
- అడిషనల్ కలెక్టర్ మాధురి



సంగారెడ్డి, మార్చి 26 మనం ప్రతినిధిః జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ వంటగ్యాస్కు ఎలాంటి కొరత లేదని అడిషనల్ కలెక్టర్ మాధురి స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా, వదంతులను నమ్మవద్దని ఆమె కోరారు. గురువారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ వంటగ్యాస్ నిల్వలపైసమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ,జిల్లాలో ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, పెట్రోల్ బంక్లు మరియు గ్యాస్ ఏజెన్సీలకు సరఫరాలు యథావిధిగా కొనసాగుతున్నాయని తెలిపారు.ఇటీవల పెట్రోల్ బంక్ల వద్ద కనిపిస్తున్న క్యూలను చూసి కొరత ఉందనే తప్పుడు ప్రచారం జరుగుతోందని, ప్రజలు అలాంటి వదంతులను నమ్మకూడదని సూచించారు. అవసరం లేకుండా ముందస్తుగా నిల్వ చేసుకోవడం వల్లే డిమాండ్ ఒక్కసారిగా పెరుగుతోందని పేర్కొన్నారు.జిల్లాలో సాధారణంగా రోజుకు సుమారు 10 వేల ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్స్ ఉండగా, వదంతుల ప్రభావంతో అది 16 వేల వరకు పెరిగిందని తెలిపారు. అయినప్పటికీ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, రెగ్యులర్ కోట యథావిధిగా అందుతోందని స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ను కంటైనర్లు, డబ్బాలలో తీసుకెళ్లడం చట్టవ్యతిరేకమే కాకుండా ప్రమాదకరమని హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీలు, డీలర్ల కార్యకలాపాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎం సివిల్ సప్లై అంబదాస్, ఏఎస్వో రాజేశ్వర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆదివాసి దంపతులను ఘనసన్మానం



మహాదేవపూర్, మార్చి26మనం న్యూస్ః మహాదేవపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన తుడుం దెబ్బ జిల్లా కమిటీ నియామక సమావేశంలో ఇటీవల జరిగిన మేడారం జాతరలో దొరికిన బంగారాన్ని నిజాయితీగా తిరిగి ఇచ్చిన ఆదివాసి దంపతులు పూర్ణిమ నాగేశ్వరరావు గార్లను తుడుం దెబ్బజాతీయఅధ్యక్షుడుసుధాకర్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ఈ ఆదర్శ దంపతులను ఆదివాసి సమాజం గర్వపడేలా చేసిన దంపతులను వివిధ సంఘాల మరియు వివిధ ప్రాంతాల ఆదివాసి ప్రతినిధుల మరియు ప్రజల సమక్షంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఆదివాసీలు అంటే స్వచ్ఛమైన మనసుతో కూడి ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా బ్రతికేవారు అని, దాన్ని ఈ దంపతులు నిరూపించారానివారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల సంఘాల నాయకులు సమ్మయ్య ,కుమార్, కిరణ్ దామోదర్, కృష్ణ ,ఆదివాసి సర్పంచులు గురుసింగబాబు, రాజబాబు,శంకరమ్మ ,స్వరూప ,బుచ్చక్క ఆదివాసి ఉద్యోగులు మల్లేశం, కళ్యాణి, సారంగపాణి, పద్మ, సత్యనారాయణ ,సుశీల, విజయలక్ష్మి,పద్మావతి, ఆదివాసినాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



మహాదేవపూర్ మార్చి26మనం న్యూస్ః జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల రాసావిల్లి కొండయ్య మృతిచెందగా విషయం తెలుసుకున్న అంబటిపల్లి సర్పంచ్ లావణ్య శంకర్ పరామర్శించి, ఆర్థిక సహాయం అందించడం జరిగింది, ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుజ్జుల లావణ్య శంకర్ వార్డ్ సభ్యులు మోట్ల రవి తేజ మరియు ప్రజలు నాయకులుపాల్గొన్నారు.

# బాలల చట్టాలపై అవగాహన

- బాలల పరిరక్షణ కమిటీఏర్పాటు



పెన్ పహాడ్ మార్చి 26 (మనం న్యూస్)ః గ్రామంలో బాలల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సర్పంచ్ వగ్గు రవి బాలల పరిరక్షణ విభాగం , సోషల్ వర్కర్ వి. శ్రీలక్ష్మి అన్నారు గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన -99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ మిషన్ వాత్సల్య పథకం ,బాలల చట్టాలపై గ్రామ సర్పంచ్ అధ్యక్షతన అవగాహన కల్పించి వివిధ శాఖల తో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలన, బాలలపై లైంగిక వేధింపులు నివారణ, బాలల దత్తత విధానం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అనాధ బాలల పరిరక్షణ, చట్టాలపై అవగాహన కల్పించారు బాలలపై వేధింపులు దాడులు, అక్రమ రవాణా నిర్మూలన, జరిగినప్పుడు వెంటనే చైల్ హెల్ప్ లైన్ 1098కి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రధానోపాధ్యాయులు ఎన్ రవి, ఉపసర్పంచ్ గుండెబోయిన జానయ్య,, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వప్న, పంచాయతీ కార్యదర్శి జి నాగరాజు,చైల్ లైన్ కేస్ వర్కర్ డి కిరణ్, ప్రధానోపాధ్యాయులు సునీత, ఎయిడ్ఎన్జీవో మండల కమిటీ సోషల్ మొబిలైజర్ ఒగ్గు సోమన్న, ఏఎన్ఎం వీరమ్మ, ,సంఘ బంధం అధ్యక్షురాలు ఆర్. విజయలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు గుండెపునేని ఊర్మిళ, దాసరి విజయ, వార్డు సభ్యులు ఒగ్గు వెంకటమ్మ, సన్నాయిల సైదులు, ఒగ్గు విక్రమ్, వివోఏలు చెనగాని మమత, వెన్నసరిత, యూత్ సభ్యులు నిమ్మల మల్లేష్, రిటైర్డ్ ఉపాధ్యాయులు రంగినేని లక్ష్మీకాంత రావు, సిఆర్పి నాగు, అధికారులు,బాలల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

- కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, మార్చి26(మనంప్రతినిధి )ః రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వచ్చే నెల (ఏప్రిల్) ఒకటో తేదీ నుంచి ₹మన ఇసుక వాహనం ఆన్లైన్ విధానంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇసుక సరఫరా అవుతుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. మన ఇసుక వాహనం ఆన్లైన్ విధానం , ఇసుక సరఫరా తదితర అంశాలపై జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మన ఇసుక వాహనం ఆన్లైన్ విధానం ద్వారా ఇసుక సరఫరా చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కమిటీ ఆమోదించిన ఇసుక రీచ్ ల నుంచే ఇసుక తరలించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక ఇబ్బందులు రావద్దని స్పష్టం చేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మండల, డివిజన్, జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని, ఆయా ఇసుక రీచ్లను రెవెన్యూ, పోలీస్ అధికారులు తనిఖీ చేయాలని సూచించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని ఇటుక ఇటుక బట్టీలు నిబంధనలకు అనుగుణంగా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి క్రాంతి కుమార్, డీఎస్పీ నాగేంద్రచారి, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, నీటి పారుదల, భూగర్భ జల, అధికారులు, తహసీల్దార్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

జగిత్యాల, మార్చి 26(మనం ప్రతినిధి): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో నిర్మాణ దశలో కొనసాగుతున్న వివో భవనం, గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనులు నాణ్యతతో పాటు నిర్దిష్ట గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే ఈ భవనాలు సకాలంలో అందుబాటులోకి రావడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేకుండా నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, అవసరమైన సామగ్రి సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే పనుల పర్యవేక్షణను క్రమం తప్పకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు.గ్రామ పంచాయతీ భవనం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా అందుతాయని, వివో భవనం ద్వారా సంబంధిత సేవలు ఒకేచోట అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు, ఈ ఈ పి ఆర్ లక్ష్మణ్ రావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# భారీ కాంప్లెక్స్ మురుగునీటితో ప్రజల విలవిల

- పత్రిక కథనానిక స్పందించిన అధికారులు
- శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు




భారీ కాంప్లెక్స్ మురుగుతో విలవిల
- అధికారుల స్పందన కోరుతున్న స్థానికులు
జైపూర్,మార్చి: 25(మనం న్యూస్) : జైపూర్ మండల కేంద్రానికి అతి సమీపాన పెగడపల్లి, జైపూర్ రెండు పంచాయతీల ... ఓ భారీ కాంప్లెక్స్ మురుగుతో స్థానికులు విలువిలలాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ... మురుగునీటి సమస్యపై స్థానిక అధికారులు దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.కాంప్లెక్స్ నుండి ... నివాస ప్రాంతాల మధ్య నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ... నివాసి సుదమల్ల పురుషోత్తం నివాసం ఎదురుగా ఉన్న సాగర్ రావు కాంప్లెక్స్లో సుమారు 400 ... మంటున్నారు. అయితే, సదరు కాంప్లెక్స్ నుండి భారీగా వచ్చే మురుగునీటిని బయటకు వదలడం ... నిలిచిపోయి ఒక పెద్ద మడుగులా తయారైంది.నిలిచిపోయిన మురుగునీటి కారణంగా దోమలు, ... దుర్వాసన వస్తోందని, దీనివల్ల స్థానికులు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని బాధితులు ... డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించి, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరుతున్నారు.ఈ ... యితీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాంప్లెక్స్ ... బయటకు రాకుండా తగిన ఏర్పాట్లు చేసుకునేలా చూడాలని, రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించి ... పరచాలని వారు విన్నవిస్తున్నారు.
https://www.manamepaper.com/clip/224149


జైపూర్, మార్చి :26(మనం న్యూస్)ః మంచిర్యాల్ జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని పెగడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని భారీ కాంప్లెక్స్ నుంచి వచ్చే మురుగునీటితో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులు వేగంగా స్పందించారు.గురువారం మనం పత్రిక కథనానికి గంటల వ్యవధిలోనే పంచాయతీ బృందాలు పునరుద్ధరణ పనులు ప్రారంభించాయి.ఎంపివో శ్రీపతి బాపూరావు ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ యజమానికి మురుగునీటి నిర్వహణపై నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.పారిశుద్ధ్య కార్మికుల సహాయంతో మురుగునీటి నిల్వ గుంటలను సరిచేసి, పేరుకున్న చెత్తను తొలగించామని తెలిపారు.పెగడపల్లి సర్పంచి రామగిరి రామ్ కూడా స్పందిస్తూ సమస్యను తాత్కాలికంగా తగ్గించే చర్యలు చేపట్టామని, శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని అన్నారు. మురుగు సమస్యతో ఇబ్బందిపడిన స్థానిక నివాసి పురుషోత్తం అధికారుల తక్షణ స్పందన పట్ల అరిషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జైపూర్ కార్యదర్శి ఉదయ్, పెగడపల్లి కార్యదర్శి శ్రీవాణి పాల్గొన్నారు.

# మన్నె క్రిశాంక్‌కు కేటీఆర్ పరామర్శ



హైదరాబాద్, మనం ప్రతినిధి : ఇటీవల ఒక ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన బీఆర్ఎస్ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ మన్నె క్రిశాంక్‌ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం పరామర్శించారు. క్రిశాంక్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులతో కేటీఆర్ కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కేటీఆర్ వెంట బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు టీ పద్మారావు, చామకూర మల్లారెడ్డి ఉన్నారు.

# వదంతులు నమ్మొద్దు.. కంగారు పడొద్దు


- 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలున్నయ్
- తెలంగాణలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత ప్రచారంపై స్టీఫెన్ రవీంద్ర క్లారిటీ

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో గత కొన్ని రోజులుగా పెట్రోల్ బంకుల వద్ద కనిపిస్తున్న రద్దీ, సోషల్ మీడియాలో వస్తున్న వార్తల నేపథ్యంలో సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర గురువారం ప్రజలకు ఫుల్ క్లారిటీ ఇచ్చారు. రాష్ట్రంలో రాబోయే 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని,



ప్రజలు కంగారు పడి బంకుల వద్ద క్యూ కట్టాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా వంట గ్యాస్ విషయంలో ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 484 ట్రక్కుల సిలిండర్లను డెలివరీ చేయడం జరిగిందని తెలిపారు. పైప్డ్ (పైపు ద్వారా సరఫరా చేసే) నేచురల్ గ్యాస్, వాహనాలకు వాడే సీఎన్‌జీ సరఫరాలో కూడా ఎలాంటి అంతరాయం లేదని ఆయన స్పష్టత ఇచ్చారు. అవసరానికి మించి అడ్వాన్స్‌డ్ బుకింగ్స్‌తో సిస్టంపై అనవసరమైన ఒత్తిడి పెరుగుతోందని, ప్రజలు సంయమనం పాటించాలని కోరారు. ఇదిలాఉంటే, ఇంధన నిల్వలను, సరఫరాను నిరంతరం పర్యవేక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేసిందని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

## నేడు కన్నుల పండుగగా శ్రీరామ నవమి వేడుకలు



రంగారెడ్డి మార్చి 26 (మనం న్యూస్) చైతన్యపురి డివిజన్ సాయి నగర్ కాలనీలో నీ ప్రసన్నాంజనేయ సహిత శివాలయ దేవస్థానం లో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని దేవాలయ చైర్మన్ రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు . భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లతో పాటు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. భక్తులు ఈ నవమి వేడుకల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అనుగ్రహం పొందాలని కోరారు.

# సలేశ్వరం జాతరకు భక్తులకు అన్నిసౌకర్యాల ఏర్పాట్లు

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 26 (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లింగాల మండల పరిధిలోని నల్లమల అడవిలో వెలసిన శ్రీ లింగమయ్య స్వామి ఆలయంలో జరగనున్న సలేశ్వరం జాతర కు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టిందని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. వచ్చేనెల ఏప్రిల్ 1వ. తేదీ నుంచి 3వ. తేదీ వరకు జరిగే సలేశ్వరం లింగమయ్య జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం సంబంధిత అధికారులతో కలిసి నల్లమల అటవీ ప్రాంతాన్ని సందర్శించారు.



జాతర ఏర్పాట్లు, ట్రెక్కింగ్ మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అడవిలోని క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించడం జరిగింది. ప్రతి సంవత్సరం సలేశ్వరం జాతరకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈసారి మరింత రద్దీ ఉండే అవకాశముందని ముందస్తుగా అంచల వేస్తూ పేర్కొన్నారు. భక్తుల సౌకర్యం కోసం తాగునీటి సరఫరా, వైద్య సేవలు, తాత్కాలిక శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను సమర్థంగా అమలు చేయాలని ఆయా శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులతో పాటు తదితరులు ఉన్నారు.

## దశదినకర్మకు హాజరైన గిరిజన విద్యుత్ ఉద్యోగులు

మహబూబాద్, మార్చి 26(మనం న్యూస్): జాటోత్ హుస్సేన్ నాయక్, జాతీయ నేషనల్ ఎస్టీ కమిషన్ మెంబర్ తండ్రి లచ్చ నాయక్ గారి దశదినకర్మకు హాజరై నివాళులర్పించిన ఎస్టీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అజ్మీర సీతారాం నాయక్, మాజీ ఎంపీ, రాష్ట్ర అధ్యక్షులు నారాయణ నాయక్ , స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నందా రాథోడ్ , టీజీఎన్పీడీసీఎల్ కంపెనీ గౌరవ అధ్యక్షులు వాలు నాయక్ , కంపెనీ ప్రెసిడెంట్ హర్జి నాయక్ , కంపెనీ సెక్రటరీ అజ్మీర శ్రీరామ్ నాయక్, కేటీపీఎస్ భూపాలపల్లి అధ్యక్షులు రవి నాయక్ , పాండ్య నాయక్ , హన్మకొండ ప్రెసిడెంట్ డి. తారాచంద్ నాయక్ మరియు విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



# వైభవంగా సీతారాముల మాస కల్యాణం



- శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సిరసనగండ్ల గుట్ట

చారకొండ,మార్చి26(మనం న్యూస్): నాగర్ కర్నూలు జిల్లా చారకొండ మండలం సిరసనగండ్ల గ్రామం అయోధ్య నగర్ గుట్ట లో వెలసిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా,గురువారం శ్రీ సీతారాముల మాస కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ మాస కల్యాణానికి మండలంలోని వివిధ గ్రామాల భక్తులే కాకుండా,జిల్లా నలుమూల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మాస కళ్యాణాన్ని విజయవంతం చేశారు. ఈ మాస కళ్యాణం లో సర్పంచ్ కామెల్ల రామస్వామి దంపతులు,ఉపసర్పంచ్ కళ్ళు సురేందర్ రెడ్డి దంపతులు,గైరాన్ తండా సర్పంచ్ బోడి శివరాం,రామచంద్రాపురం సర్పంచ్ జ్యోతి మాధవరెడ్డి,అగ్రహారం సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, మండల నాయకులు బలరాం గౌడ్,వెంకట్ గౌడ్,సందీప్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ డేరం రామశర్మ,ఈవో స్వర్గం ఆంజనేయులు,దేవస్థాన అర్చకులు,నాయకులు,అధికారులు,ప్రజలు

## భవనం పై నుండి దూకి వివాహిత ఆత్మహత్య



రంగారెడ్డి, మార్చి 26 (మనం న్యూస్): భవనం పై నుండి దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం చైతన్యపురి హనుమాన్ నగర్ లో మన్య శివకుమార్, మాధవి లు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కొడుకులు సంతానం. భార్యాభర్తల కలహాల నేపథ్యంలో వాళ్ళు నివాసం ఉంటున్న బిల్డింగ్ పై నుండి దూకింది.

క్రిందకు దూకగా బలమైన గాయాలు అవటంతో వెంటనే ఆమె భర్త దగ్గరలో ఉన్న ఓమ్ని ఆసుపత్రికి తీసుక వెళ్ళి చేర్పించగా చికిత్స పొందుచూ మృతి చెందింది. మృతురాలి మరణములో ఆమె భర్త శివకుమార్ పై అనుమానము ఉన్నదని మృతురాలి తండ్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎమ్మెల్యేల పార్టీ మార్పు పిటిషన్‌పై విచారణ

స్పీకర్ ట్రైబ్యునల్‌కు, ఇద్దరు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు హైదరాబాద్,మార్చి 26(మనం,ప్రత్యేక ప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీ మారలేదని చెబుతున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్‌ల వ్యవహారం హైకోర్టుకు చేరింది. ఈ కేసులో ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్ పార్టీ మారలేదని అసెంబ్లీ స్పీకర్ తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్వర్ రెడ్డి, కెపి వివేకానంద స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఆ ఇద్దరిపై స్పీకర్ ట్రైబ్యునల్ ఎలాంటి




చర్యలు తీసుకోలేదని అందువల్ల ఆ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగేకడియం, సంజయ్‌లపై అనర్హత వేటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా స్పీకర్‌తో ట్రైబ్యునల్‌తో పాటు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్‌కుమార్‌కు నోటీసులు పంపింది. తదుపరి విచారణను ఏప్రిల్ 16కు వాయిదా వేయడంతో పాటు కడియం శ్రీహరి, సంజయ్‌లకు కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. ఈకేసు తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేసింది.

# శ్రీరాముని శోభయాత్రకు బందోబస్తు

- నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్,మార్చి 26(మనం,ప్రత్యేక ప్రతినిధి): శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా హైదరాబాద్ నగరంలో శుక్రవారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయని హైదరాబాద్ పోలీసు అధికారులు తెలిపారు. ముఖ్యంగా సీతారాంబాగ్ దేవాలయం నుంచి కోఠిలోని హనుమాన్ వ్యాయామశాల వరకు శోభాయాత్ర జరగనుందని వివరించారు. ఈ మార్గంలో వాహనాలకు అనుమతి ఉండదని, శోభాయాత్ర సమయంలో ట్రాఫిక్‌ను ఇతర మార్గాల్లోకి మళ్లించనున్నామన్నారు. సీతారాంబాగ్, బోయిగూడ కమాన్ నుంచి మల్లేపల్లి ఎక్స్ రోడ్స్ వైపు ట్రాఫిక్ మళ్లించనున్నామని, మంగళ్‌హాట్, గాంధీ విగ్రహం, పురానాపూల్, జుమేరాత్ బజార్ నుంచి వచ్చే వాహనాలను టక్కర్‌వాడీ జంక్షన్ వైపు డైవర్ట్ చేయనున్నామని



తెలిపారు. ఎంజే బ్రిడ్జ్, బేగంబజార్, అఫ్జల్‌గంజ్, సిటీ కాలేజీ వైపు వెళ్లే వాహనాలను జుమేరాత్ బజార్ మీదుగా మళ్లించనున్నట్లు వివరించారు. అబిడ్స్ జీపీఓ, సుల్తాన్ బజార్, కోఠి, అబిడ్స్ ప్రధాన రోడ్ల వద్ద ట్రాఫిక్‌ను నిలిపివేయనున్నామని, బేగంబజార్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, కోఠి, కాచిగూడ ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ రద్దీగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నామని హైదరాబాద్ పోలీసు అధికారులు తెలిపారు.

# కన్నుల పండుగల శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించాలి

రంగారెడ్డి మార్చి 26 (మనం న్యూస్) కన్నుల పండుగల శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించాలి అని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్కెపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ రామ నవమి సందర్భంగా నిర్వహించే శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి హాజరుకావాలని చిలుక ఉపేందర్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, కళ్యాణం రోజున 3000 మంది భక్తులకు సరిపడా అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి



సహకరించవలసినదిగా కోరగా వారు వెంటనే స్పందించి అన్నప్రసాద వితరణ కైకర్యానికి సంబంధించిన మొత్తం ఖర్చులను భరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ గుణిగంటి వెంకట్ గౌడ్, చంద్రమౌళి, తలాటి రమేష్, సంతోష్, రమేష్, వినయ్, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

# మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగాచావలి రామరాజు

- ప్రధాన కార్యదర్శిగా కోట జ్ఞానేశ్ ఎన్నిక

మధిర టౌన్, మార్చి 26(మనం న్యూస్) : మధిర బార్ అసోసియేషన్ ఎన్నికల్లో చావలి రామరాజు ప్యానల్ ఘనవిజయం సాధించింది. ప్యానెల్ లో పోటీ చేసిన అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూడు ప్రధాన పదవులను కైవసం చేసుకున్నారు. మధిర బార్ అసోసియేషన్ ఎన్నికల్లో మొత్తం 39 ఓట్లు పోల్ కాగా, అధ్యక్షులుగా పోటీ చేసిన చావలి రామరాజుకి 24 ఓట్లు కావూరి రమేష్ కి 15 ఓట్లు వచ్చాయి. తొమ్మిది ఓట్ల మెజార్టీతో రామరాజు అధ్యక్షులుగా గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా పోటీచేసిన కోట జ్ఞానేశ్ కి 25 ఓట్లు రాగా ఆయన ప్రత్యర్థి పల్లపోతు కృష్ణ రావుకి 14 ఓట్లు వచ్చాయి. 11 ఓట్ల మెజార్టీతో కోట జ్ఞానేష్





ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా పోటీ చేసిన సునీతకి 22 ఓట్లు రాగా ఆమె ప్రత్యర్థి భైరవభట్ల వెంకటరమణ కి 17 ఓట్లు వచ్చాయి. దీంతో ఆమె ఐదు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈసారి మధిర బార్ ఎలక్షన్లు సాధారణ ఎన్నికలను తలపించాయని పలువురు చర్చించుకుంటున్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన



భీమదేవరపల్లి మార్చి 26 మనం న్యూస్: భీమదేవరపల్లి మండల పరిధిలోని శేషాద్రి పరిశీలించారు. గురువారం రోజున ఎంపీడీవో వీరేశం ఆధ్వర్యంలోమండల పరిధిలోని కొత్తకొండ, భీమదేవరపల్లి గ్రామాలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను వివో నిర్మాణంలో ఉన్న భవనమును, ఉపాధి హామీ నిధుల ద్వారా భీమదేవరపల్లి పాఠశాల నిర్మాణంలో ఉన్నప్రహరీ గోడ పనులను పరిశీలించి అనంతరంనర్సరీలనుపరిశీలించిసంతృప్తిని జెడ్పి సీఈవో వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, కొత్తకొండ సర్పంచ్ సిద్దిమల్ల రమా రమేష్, కొత్తకొండ భీమదేవరపల్లి పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# పి.డి.ఎస్.యూ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ విజయవంతం

రంగారెడ్డి మార్చి 26 (మనం న్యూస్): పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ బకాయిల విడుదలకై ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) తలపెట్టిన రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్,పీజీ ప్రొఫెషనల్ కళాశాలల బంద్ ను గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం ఆధ్వర్యంలో విద్యానగర్, ఓయూ,నారాయణగూడ దిల్ సుఖ్ నగర్ ప్రాంతాలలో బంద్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.మహేష్,పొడపంగి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మంద నవీన్,కే. శ్రీనివాస్ లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ప్రభుత్వ నుండి రావలసిన బకాయిలు 10వేల కోట్లు ల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయకుండా ప్రభుత్వం పేద,బడుగు,బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ ప్రత్యక్షంగా ఉన్నత విద్యకు దూరం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో విద్యారంగానికి అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్పులను సకాలంలో విడుదల చేస్తాం,విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తాం అని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేటికీ 25 నెలలు పూర్తవుతున్న విద్యార్థులకు రావలసిన 10వేల కోట్ల బకాయిలు విడుదల చేయకపోవడం సిగ్గు చేటు అని అన్నారు. లక్షలాదిమంది విద్యార్థులు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ ప్రొఫెషనల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యా సంవత్సరం పూర్తయిన రియంబర్స్మెంట్ రాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజు మొత్తం చెల్లిస్తేనే సర్టిఫికెట్స్ ఇస్తామని చెబుతున్నారని అన్నారు. తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షాన పెద్ద ఎత్తున విద్యార్థి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు తీగల శ్యామ్. సహాయ కార్యదర్శులు కే.ఝాన్సీ,జి.యశ్వంత్, జిల్లా నాయకులు గణేష్ లు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



ఏటూరునాగారం, మనంన్యూస్: ఏటూరునాగారం గ్రామానికి చెందిన మహమ్మద్ ఘనీ మరణించడం చాలా బాధాకరమని మొహమ్మద్ ఘనిసాబ్ ముస్లిం కుల పెద్దగా ఎన్నో కార్యక్రమాలను చేసేవారని వారి సేవలను ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గుర్తు చేసుకున్నారు మహమ్మద్ ఘని ఆత్మ శాంతించాలని ఆ అల్లా దయ ఉండాలని మరియు వారి కుటుంబ సభ్యులకు అల్లా మనోధైర్యాన్ని కల్పించి వారి కుటుంబానికి నేనున్నానని ధైర్యాన్ని కల్పించి వారి పార్థివ దేహానికి నివాళులర్పించి వారి ఆత్మ శాంతించాలని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు

# శ్రీసీతారాముల కళ్యాణానికి ముస్తాబైన భద్రాద్రి

## 3 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా

## ఏర్పాట్లు చేసిన అధికారులు

## పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**భద్రాచలం, మార్చి 26(మనం న్యూస్):** భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణానికి మిథిలా స్టేడియం ముస్తాబైంది. కల్యాణ ఘడియలు సమీపిస్తుండగా పట్టు వస్త్రాలు ధరించి, పెళ్లిపీటలు ఎక్కేందుకు శ్రీ సీతారామచంద్ర స్వామివారు సిద్ధమయ్యారు. జగత్ కళ్యాణం కళ్లారా చూడాలని వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిమంది రామ భక్తులు గురువారం నుండి భద్రాచలం చేరుకుంటున్నారు. అందుకు తగ్గట్లు అధికారులు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. సీతారాముల కళ్యాణం చూడటమే మహాభాగ్యంగా భక్తులు భావిస్తున్నారు. భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణానికి మిథిలా స్టేడియం ముస్తాబైంది . కల్యాణ ఘడియలు సమీపిస్తుండగా, పట్టు వస్త్రాలు ధరించి పెళ్లిపీటలు ఎక్కేందుకు శ్రీ సీతారామచంద్రస్వామి వారు సిద్ధమయ్యారు .శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 12 గంటలకు పునర్వసు నక్షత్రం, అభిజిత్ లగ్న సుముహూర్తాన స్వామి, అమ్మవార్ల కల్యాణం జరుగనుంది. ఈ కమనీయ వేడుకను తిలకించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్, ఒడిశా, తమిళనాడుతో పాటు దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. ముత్యాల తలంబ్రాలు, గోటి తలంబ్రాలు, పెళ్లి సామాగ్రితో ఆలయానికి చేరుకుంటున్నారు. గతంలో జగదభిరాముడి కల్యాణాన్ని తిలకించలేకపోయిన, భక్తులు ఈసారి భారీ సంఖ్యలో భద్రాచలం చేరుకుంటున్నారు. భద్రాద్రి రామయ్య కల్యాణ మహోత్సవాన్ని కనులారా వీక్షించి తరించేందుకు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

### సర్వం సిద్ధం..

ఏడాదికోసారి శ్రీరామనవమి నాడు భద్రాద్రిలో అంగరంగ వైభవంగా జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం కోసం అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. దేశం నలుమూలల నుంచి తరలి వచ్చే భక్తులను ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. శనివారం జరిగే మహా పట్టాభిషేకాన్ని కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా రామాలయంలో జరిగిన ఎదుర్కోలు ఉత్సవం, గరుడ సేవ తదితర కార్యక్రమాలను తిలకించిన భక్తులు పరవశించిపోయారు. ఎక్కడ చూసినా భక్తుల కోలాహలమే.. భద్రాద్రి మిథిలా స్టేడియంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు జరిగే రామయ్య కల్యాణ కమనీయ దృశ్యాలను కనులారా వీక్షించి తరించేందుకు భక్తులు భారీగా స్టేడియంకు చేరుకున్నారు.

భద్రాచలం పట్టణంలోని రామాలయ పరిసరాలు, గోదావరి స్నానఘట్టాలు, కరకట్ట, ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ సెంటర్, బ్రిడ్జి సెంటర్ ఇలా ఎక్కడ చూసినా భక్తజన సందోహమే కనిపించింది. స్వామి వారి కల్యాణానికి ఈ ఏడాది సుమారు మూడు లక్షల మంది భక్తులు రావచ్చని అంచనా వేసిన అధికారులు అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేశారు. కళ్యాణం జరిగే మిథిలా స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్టేడియం బయట నిల్చుని కల్యాణ తంతును వీక్షించేందుకు ప్రత్యేకంగా టీవీలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రామాలయ పరిసర ప్రాంతాలలో వసతి కేంద్రాలను, తాగునీటి సౌకర్యం కల్పించారు. గోదావరి స్నానఘట్టాలు, విస్తా కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో షామియానాలు ఏర్పాటు చేశారు. మిథిలా స్టేడియం చుట్టు పక్కల గ్యాలరీలో ప్రత్యేకంగా ఈసారి కూలర్లు ఏర్పాటు చేశారు.

### ఏర్పాట్లు పూర్తి..

ఒక పక్క ఎండ వేడిమి ఉండటంతో భద్రాద్రికి తరలివచ్చే భక్త జనం కోసం పట్టణ పరిసర ప్రాంతాలలో మంచినీటి వసతితో పాటు మజ్జిగ, వైద్య ఆరోగ్య శిబిరాలను సైతం ఏర్పాటు చేశారు. రామాలయం, మాఢవీధులు, గోదావరి ఘాట్లలో చలువ పందిళ్లు వేశారు. రామాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవ మూర్తులను మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి తీసుకొస్తారు. 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు కల్యాణ తంతు నిర్వహిస్తారు. తలాంబ్రాలు, లడ్డుల కోసం పట్టణంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు.సీతారామచంద్ర స్వామి కల్యాణ వేడుకలలో అపశృతి చోటు చేసుకోకుండా పోలీసులు డేగ కన్నులతో క్షుణంగా పరిశీలిస్తున్నారు. మావోయిస్టు ప్రాబల్యం కలిగిన భద్రాద్రితో పాటు చత్తీస్గడ్, ఒడిసా, మహారాష్ట్ర, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలలో మావోయిస్టుల కదలికలను సైతం సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నారు. అనుమానస్పదంగా ఉన్న వారు, లొంగిపోయిన మావోయిస్టుల కదలికలపై దృష్టి సారించారు. రామయ్య కళ్యాణ ఏర్పార్లను జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ అంకిత్,, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐటీడీఏ పీవో రాహుల్ , దేవస్థానం ఈవో దామోదర్ రావు ,ఏ ఎస్ పి విక్రాత్ కుమార్ సింగ్,తదితరులు ఏర్పాట్లు పరిశీలించారు..

# భద్రాద్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

## నవమి, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి





**భద్రాచలం, మార్చి 26(మనం న్యూస్):** భక్త రామదాసు నిర్మించిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిందని, ఈ పవిత్ర క్షేత్రానికి దేశ విదేశాల నుంచి భారీగా భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున, ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం, మహా పట్టాభిషేకం ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేయనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, వీఐపీలు, వివిఐపీలు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు స్వామివారి కల్యాణం, 28వ తేదీన అదే సమయాల్లో మహా పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. స్వామివారి కల్యాణం అనంతరం ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించి, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దేవాలయంతో పాటు భద్రాచలం పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భక్తులకు మరింత సౌకర్యం కల్పించేందుకు రహదారులు, రైల్వే, నదీ మార్గాల అభివృద్ధిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమరావతి-జగదల్పూర్ మధ్య రవాణా సౌకర్యాల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని కరకట్టల ఎత్తు పెంపు, ఘాట్ల నిర్మాణం, రెండో పీట నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు.


భవిష్యత్తులో భక్తుల రాకను మరింత సులభతరం చేసే దిశగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం భద్రాచలం అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల ఫోటోలను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఎస్పీ రోహిత్ రాజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్ సమీక్ష

ఉదయం మిథిలా స్టేడియం వద్ద జిల్లా కలెక్టర్ అంకిత్ సెక్టార్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలంబ్రాల కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వైద్య సదుపాయాలు వంటి అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సెక్టార్, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎక్కడైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గొంది మురళి మోహన్ విజయం



**దమ్మపేట, మర్చి 26:(మనం న్యూస్):** దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి కం ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం ఉత్సాహభరితంగా జరిగాయి. అత్యంత ఉత్కంఠగా సాగిన అధ్యక్ష పదవి పోరులో గొంది మురళి మోహన్ ఘన విజయం సాధించారు. అసోసియేషన్ పరిధిలోని మొత్తం 13 ఓట్లకు గాను 12 ఓట్లు పోల్ అవ్వగా, మెజారిటీ సభ్యులు మురళి మోహన్ వైపు మొగ్గు చూపారు. అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించగా, మిగిలిన కీలక బాధ్యతలకు సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ముప్పుడి శ్యామ్ సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా లక్కినేని నరేంద్ర బాబు, కోశాధికారిగా బాల రాజు, కార్యదర్శిగా తుమ్మ రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు క్రీడల కార్యదర్శిగా తిర్నాటి సంజయ్, మహిళా ప్రతినిధిగా శృతి తనగాల అరుణ కుమారి, ఈసీ-1 సభ్యుడిగా దార మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నల్లపు ఉదయ్ కుమార్ ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని, కార్యవర్గ సభ్యులను స్థానిక న్యాయవాదులు ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. బార్ అసోసియేషన్ బలోపేతానికి, న్యాయవాదుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గొంది మురళీమోహన్ స్పష్టం చేశారు.

# సింగరేణిని కాపాడు కుందాం

- కార్మికుల ఉద్యోగ భద్రత హక్కులను రక్షించు కుందాం
- గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 26(మనం న్యూస్):** సింగరేణి మనుగడ ప్రమాదకరంగా మారిందని గోదావరి పరివాహక ప్రాంతంలో సింగరేణి సర్వే చేసిన ప్రకారం అపారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ నూతన బావులు తీయడం లేదని సింగరేణిని చరిత్రను సమాధి చేసే వైపున పాలకుల విధానాలున్నాయని గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొత్తగూడెంలో ఐఎఫ్టియు కార్యాలయంలో ఐ.కృష్ణ అధ్యక్షతన గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల ఉద్యోగం ఉపాధికి తీవ్ర ప్రమాదం నెలకొందని సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యలనుపరిష్కరించకుండా తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి మనుగడను కాపాడుకో వాల్సిన అవసరం, కార్మికుల హక్కులను ఉద్యోగ భద్రతను రక్షించుకోవాల్సిన అవసరం నెలకొందని ఇందుకు సింగరేణి కార్మిక సంఘాలన్నీ ఒక తాటిమీదకు వచ్చి బలమైన ఐక్య ఉద్యమ నిర్మాణానికి పూనుకోవాలని సాదినేని వెంకటేశ్వరరావు అన్నారు.

ఐక్య ఉద్యమానికి నిర్మాణానికి ఏఐటియుసి బాధ్యతగా కార్మిక సంఘాలని ఐక్యం చేసేందుకు పూను కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సింగరేణి బొగ్గుగనుల అమ్మకాలతో మనుగడకు ప్రమాదం నెలకొందని వేలంలో పాల్గొనాలని ప్రభుత్వం అనుమతించడం సంస్థను సజీవంగా సమాధి చేయడం అవుతుందని అన్నారు. యాజమాన్యం కార్మికులపై స్వారీ చేస్తుందని సేఫ్టీని విస్మరించి ప్రమాదాలకు గురి చేస్తుందని మెడికల్ బోర్డు శాశ్వత జబ్బులు గల వారిని ఫిట్ చేసిందని దీన్ని సరిచేయాలని నాడే ఇప్పు డిమాండ్ చేసిందని ఇప్పుడు కోర్టు సహితం యాజమాన్యం వైఖరిని తప్పు పట్టిందని అన్నారు.150 మాస్టర్లు, వేధింపులు, మెడికల్ ఫిట్ అయిన వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం, భూపాలపల్లి, బెల్లంపల్లి తదితర సింగరేణి ప్రాంతాల్లో కొత్త గనులను సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సింగరేణి మనుగడ కార్మికుల సమస్యలపై ఐక్య ఉద్యమానికి ఇఫ్టు గత 10 నెలలుగా ప్రయత్నం చేసిందని గుర్తు చేస్తూ చేశారు. కార్మికుల సమస్యలపై, సింగరేణి మనుగడకు ఏఐటీయూసీ జాతా నిర్వహిస్తుందని ఇది న్యాయమైనదని దీనికి ఇఫ్టు సంపూర్ణ మద్దతును తెలియజేస్తుందని చెప్పారు. సింగరేణి మనుగడ కోసం ఐక్యంగా అన్ని సంఘాలను కలుపుకొని బలమైన కార్మిక ఉద్యమ నిర్మాణంకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జనరల్ సెక్రెటరీ జే.సీతారామయ్య, ఏ.వెంకన్న, ఎండి.రాసుద్దిన్, డి.బ్రహ్మానందం, ఈదునూరి రామకృష్ణ, కాపు కృష్ణ, తోట్ల రాయమల్లు, సంతు, సంజీవరావు, నాసర్ పాష, నరేష్, యన్.సంజీవ్, గౌని నాగేశ్వరరావు, రాజేశం, తోడేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలందరికీ శ్రీ రామా నవమి శుభాకాంక్షలు

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం, మార్చి 26(మనం న్యూస్):** జిల్లా ప్రజలందరికీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. శ్రీసీతారాముల దీవెనలతో రాష్ట్ర ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని అభిలషించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంటింటా శ్రీరామనవమి పర్వదినాన్ని, రాములవారి కల్యాణాన్ని వేడుకగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

సకల గుణ సంపన్నుడు శ్రీరాముడు ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మం వీడలేదు, అబద్ధం ఆడలేదు; ప్రజారంజక పాలకుడు శ్రీరాముని జీవితం తరతరాలకు ఆదర్శనీయం అని తెలిపారు. ఆ జానకీవల్లభుడి ఆశీస్సులు తెలుగు ప్రజలందరిపై సదా ఉండాలని కోరుకుంటూ అందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్తగా భద్రాచల శ్రీ సీతారామ స్వామి దేవస్థాన ఉత్సవ కమిటీలో భాగస్వామ్యులైన సభ్యులు ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు.

గత ప్రభుత్వానికి భిన్నంగా భద్రాచలం శ్రీ సీతారామ దేవస్థానం, పట్టణ అభివృద్ధికి 586 కోట్లు అంచనా వేసి మొదటి దశలో 351 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు తమ ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అందుకు సహకరించిన ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అనునిత్యం సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలి

- అధికారులు నిబద్ధతతో పని చేయాలి
- డివిజన్లలో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలి
- కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్



**పాల్వంచ, మార్చి 26(మనం న్యూస్):** కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో నెలకొన్న సమస్యలు పరిస్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. కార్పొరేషన్ పరిధి పాల్వంచ 42,7,35వ డివిజన్లలో ఆయన విస్తృతంగా పర్యటించారు. 42వ డివిజన్ పరిధిలో పర్యటించి అక్కడి ప్రజల సమస్యలు అడిగి గెలుసుకొని కొన్ని సమస్యలు తక్షణమే పరిష్కరించుట జరిగినది. వార్డులో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు, డ్రైనేజీ వ్యస్తలను గాడిలో పెట్టడం, తాగు నీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అదికారులను ఆదేశించారు. ప్రాధమికోన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడి సమస్యలను పాఠశాల హెచ్ఎం తో చర్చించి పరిష్కరించారు. శిధిలావస్థలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. 2 రోజులలో దానిని తీసివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలను, వంటశాలలను, వాటర్ సప్లై అంశాలను పరిశీలించారు. అదే విదంగా 35వ డివిజన్ లో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (టీఎస్డబ్ల్యూఆర్) డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యువ మండల్ వికాస్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. విద్యార్థులతో కార్యక్రమ ఉద్దేశాలను వివరించారు. ఈ కార్యక్రమములో డిప్యూటి మేయర్ సిరిపురపు లలిత కుమారి, 42వ డివిజన్ కార్పొరేటర్ డి మణి, 7వ డివిజన్ కార్పొరేటర్ సింధు తపస్వీ, 35వ డివిజన్ కార్పొరేటర్ నామ కీర్తి, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ



**ఖమ్మం, మార్చి 26(మనం న్యూస్):** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు సత్యానికి, న్యాయానికి నిలువెత్తు ప్రతిరూపమని పేర్కొన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, శాంతి, సహనం, విశ్వాసం వంటి విలువలు ఆదర్శమన్నారు. సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొని ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలని ఆకాంక్షించారు. యువత శ్రీరాముడి ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని తెలిపారు. సీతారామచంద్రుల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఇంట సుఖశాంతులు నెలకొనాలని కోరుకున్నారు. భక్తి, శ్రద్ధలతో శ్రీరామ నవమిని జరుపుకోవాలని, ఈ పర్వదినం అందరికీ శుభ ఫలితాలను అందించాలని నామ ఆకాంక్షించారు.

# భద్రాచలం రామాలయం ట్రస్ట్ బోర్డ్ ఉత్సవ కమిటీ మెంబర్లగా మిట్టపల్లి, రంగా





**వైరా, మార్చి26 (మనం న్యూస్):** భద్రాచలం రామాలయం ట్రస్ట్ బోర్డు ఉత్సవా కమిటీ మెంబర్ గా ఖమ్మం జిల్లా వైరా కి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు మిట్టపల్లి నాగేశ్వరరావు (నాగి), రంగా జనార్ధన్ రావులను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా మిట్టపల్లి నాగేశ్వరరావు, రంగా జనార్ధన్ రావు మాట్లాడుతూ తమపై నమ్మకంతో భద్రాచలం ట్రస్ట్ బోర్డ్ ఉత్సవ కమిటీ మెంబర్లగా అవకాశం కల్పించిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణకు ,మాజీ జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్‌కు, కార్పొరేషన్ చైర్మన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బాధిత కుటుంబానికి భరోసానిచ్చిన ఎమ్మెల్యే



ముమ్మిడివరం, మార్చి 26, మనం న్యూస్ః డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని ఐ పోలవరం మండలం మురుమళ్ళ గ్రామంలో గల ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు కార్యాలయంలో గురువారం ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేశారు.ఈ సందర్భంగా ఒక కుటుంబం మూత్రపిండా మార్పిడి సహాయం నిమిత్తం దాట్ల సుబ్బరాజును అడుగగా ఆయన ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి,అవసరమైన సహాయాన్ని చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఏ విధంగా సహాయం చేయాలనే అంశంపై వైద్యాధికారులతో వారి ఎదుటే ఫోన్లో చర్చించారు.

## స్వర్ణాంధ్రలో ముగిసిన జాతీయస్థాయి హ్యాకథాన్




నరసాపురం, మార్చి 26 (మనం న్యూస్) : నరసాపురం మండలం సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 26 న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్, సైబర్ సెక్యూరిటీ అండ్ బిజినెస్ సిస్టమ్స్ డిపార్ట్మెంట్, ఆక్వాటెక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజన్ - ఎక్స్ 2026 జాతీయ స్థాయి హ్యాకథాన్ రెండవరోజు గురువారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుండి 64 టీములు, ఇతర రాష్ట్రాల నుండి 12 టీములు, స్వర్ణాంధ్ర కళాశాల నుండి 37 పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎస్ఆర్.కె.ఆర్ కళాశాల విద్యార్థులు మొదటి బహుమతి రూ. 30 వేలు, డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విద్యార్థులు రెండవ బహుమతి రూ. 25 వేలు, ఎన్ఐటిఏపి విద్యార్థులు మూడవ బహుమతి రూ.20 వేలు, బెస్ట్ ఉమెన్ టీముగా స్వర్ణాంధ్ర విద్యార్థులు రూ. 15 వేలు, బెస్ట్ ఇన్నోవేషన్ టీముగా లక్కిరెడ్డి బాల్ రెడ్డి కళాశాల విద్యార్థులు రూ.10 వేల రూపాయలు బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కొండవీటి వెంకట సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, డైరెక్టర్ ఎస్. కీర్తి కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. గోపీచంద్ సిఎస్సీ విభాగాధిపతి డాక్టర్ పి శ్రీనివాసులు, డాక్టర్ బి మధుకుమార్, సిఎస్ అండ్ బి ఎస్ విభాగాధిపతి డాక్టర్ టి. మురళీమోహన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.

## ప్రజలను తప్పుదోవ పట్టించే పని నాకు లేదు

- మాజీ మంత్రి మాజీ ఎంపీ తోట నరసింహం



జగ్గంపేట మార్చి 26 ( మనం న్యూస్)ః కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం జగ్గంపేట గ్రామపంచాయతీ పరిధిలో గల డ్రైవర్స్ కాలనీ ఇళ్ల స్థలాల వివాదంలో నాడు మాజీ మంత్రి తోట నరసింహం కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొని కలెక్టర్ వారికి వినతిపత్రం అందజేయడం జరిగింది, ఈ కలెక్టరేట్లో మీడియా సమావేశంలో మాజీ మంత్రి తోట నరసింహం మాట్లాడిన మాటలపై నేడు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రెస్ మీట్ నిర్వహించి నిజాలు మాట్లాడాలని ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని విమర్శించారు.మాజీ ఎంపీ తోట నరసింహం మాట్లాడుతూ 2010లో అప్పటి మంత్రిగా ఉన్న నేను డ్రైవర్స్ కాలనీ సర్వేనెంబర్ 196/2 లో సుమారు 200 మంది పేదలకు డ్రైవర్లు, ఆశ వర్కర్లు, సెక్స్ వర్కర్లు, పేదవారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని, ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే కార్యకర్తలకు ఆ స్థలాలను కేటాయించి ఆ స్థలాలలో గల లబ్ధిదారులను మరోచోట స్థలాలు ఇస్తామంటూ టిడిపి నేతలు బెదిరింపులు పై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల స్టూడెంట్ విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తోట రాంజీ మరియు జగ్గంపేట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇళ్ల స్థలాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం భరోసా

- ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్



నరసాపురం, మార్చి 26 (మనం న్యూస్)ః ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషి చేస్తోందని అనారోగ్యం పాలై ఆర్థిక ఇబ్బందులకు కారణంగా సరైన వైద్య సదుపాయం అందని బాధితులు తమ దృష్టికి తీసుకు వస్తే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వారికి కార్పొరేట్ వైద్య సహాయం అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నామని అవసరమైన వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం ఆయన నరసాపురం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు,, వీర మహిళలు పాల్గొన్నారు.

## పప్పుధాన్యాల నిల్వలో జాగ్రత్తలు పాటించాలి

- మండల వ్యవసాయ శాఖ అధికారి పి. గాంధీ




శంఖవరం మార్చి 26 మనం ప్రతినిధిః పప్పుధాన్యపు పంటల కోత అంతరం సాంకేతికత మరియు పంట నిల్వ చేయుటలో సురక్షితమైన నిర్వహణ పద్ధతులు పాటించడం ద్వారా పంట ఉత్పత్తులను ఎక్కువ రోజులు నిల్వ చేసుకోవచ్చని శంఖవరం మండల వ్యవసాయ శాఖ అధికారి పి. గాంధీ రైతులకు వివరించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా శృంగధార గ్రామంలో రైతులతో మినుము పొలం పరిశీలన చేసి పంట కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,అనంతరం పంట నిల్వ చేయుటలో సురక్షితమైన నిర్వహణ పద్ధతులు గూర్చి వివరించారు. గింజలో తేమ 12 శాతం కంటే తక్కువ ఉండేలా చూసుకోవడం ద్వారా పంట ఉత్పత్తులు తొందరగా పాడవకుండా చూడొచ్చని తెలిపారు. అనంతరం రైతులతో బృంద విన్యాసం చేయించి ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమం లో ఉద్యాన సహాయకులు సువర్ణరాజు,ప్రసాద్,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, మహిళలు పాల్గొన్నారు.




## వాకర్స్ క్లబ్ పాలకొల్లు ఆధ్వర్యంలో మందుల పంపిణీ

పాలకొల్లు, మార్చి 26,మనం ప్రతినిధిః పాలకొల్లు పట్టణం మరియు రూరల్ కు చెందిన దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న 4 గురు పేద రోగులకు 20 వేల రూపాయలు విలువైన మందులను వాకర్స్ క్లబ్ పాలకొల్లు తరపున అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు సభ్యులతో కలిసి గురువారం కొత్త కుళాయి చెరువు వద్ద అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, ధనాని శ్రీరామమూర్తి, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు,సభ్యులు జవ్వాజి కల్యాణ్, టంగుటూరి నాగేశ్వరరావు, కటారి నాగేంద్ర కుమార్, వెంకయ్య మాస్టారు పాల్గొన్నారు.

## లస్కర్ల జీతాల పెంపుపై హర్షం

- ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును సన్మానించిన లస్కర్లు



ముమ్మిడివరం, మార్చి 26, మనం న్యూస్ః రాష్ట్ర ప్రభుత్వం లస్కర్ల జీతాలను పెంచిన నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలోని ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ పోలవరం, తాళ్లరేవు మండలాల నుంచి లస్కర్లు గురువారం మురమళ్ళ క్యాంపు కార్యాలయానికి భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజును మరియు ఇతర సీనియర్ నాయకులను వారు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ, లస్కర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వారికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా నెలకు రూ.6,000 జీతం పెంపు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అన్నారు. లస్కర్లు సాగునీటి కాలువల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషిస్తారని, వ్యవసాయానికి వారు అందిస్తున్న సేవలు అమూల్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పనులు కల్పించాలి

- వలసలు నివారించే చర్యలు చేపట్టాలి



ఏలేశ్వరం, మార్చి, 26:-(మనం న్యూస్)ః మండలంలో కూలీలకు ప్రభుత్వం తక్షణమే పనులు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు లేకపోవడంతో కూలీలు పెద్దఎత్తున వలసలు వెళ్తున్నారు. ముఖ్యంగా మహిళలు ఇతర మండలాలకు ఆటోలలో వెళ్లి పనులు చేసుకుంటున్నారు. మండలంలో పంటలు లేకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు గుంటూరు, విజయవాడ, బెంగళూరు వంటి నగరాలకు వలస వెళ్తున్నారు. కొంతమంది కూలీలు గుంటూరుకు మిర్చి కోత పనుల కోసం వెళ్లాల్సి వస్తోంది.

### సూరిబాబును పరామర్శించిన

## ఎమ్మెల్సీ తోట



ముమ్మిడివరం, మార్చి 26, మనం న్యూస్ః డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని తాళ్లరేవు మండలం సుంకరపాలెం గ్రామంలో సుధీర్ఘ కాలం పాటు మునసబుగా సేవలందించి ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన గుంటముక్కల వీరబద్రరావు చిత్ర పటానికి గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నివాళులు అర్పించారు. సోదరవియోగంతో బాధపడుతున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుంటముక్కల సూరిబాబును మరియు కుటుంబ సభ్యులను త్రిమూర్తులు పరామర్శించారు. ఈ పరామర్శలో చిక్కం హనుమంతరావు,సుంకర రామచంద్రరావు, గుంటముక్కల విష్ణు, తోట బాబి, మర్రి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల హక్కులకు భద్రత కల్పించండి



శంఖవరం మార్చి 26 మనం ప్రతినిధిః దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు తీర్పును తీవ్రంగా ఖండిస్తున్నానని బహుజన సమాజ్ పార్టీ కాకినాడ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ గునపర్తి అపురూప్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల దళిత క్రైస్తవులపై వెలువడిన తాజా సుప్రీంకోర్టు తీర్పుపై తీవ్రంగా ఖండిస్తున్నానని భారత రాజ్యాంగం నేరుగా ఉల్లంఘిస్తున్నది అని ఆయన అన్నారు. ఆర్టికల్ 15 ప్రకారం మతం ఆధారంగా వివక్షత చూపరాదని అని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోంది అలాగే ఆర్టికల్ 25 ప్రతి పౌరుడికి తనకు నచ్చిన మతాన్ని స్వీకరించొచ్చని రాజ్యాంగంలో స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ నేపథ్యంలో ఒక వ్యక్తి మతమార్పిడి చేసుకున్న కారణంగా ఆ వ్యక్తికి లభించే సామాజిక రక్షణలను తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు.




## పేకాట స్థావరాలపై పోలీసులు ఆకస్మిక దాడి

- అదుపులో 17 మంది, 9,650 రూపాయలు నగదు స్వాధీనం
- ఎస్సై టి. రామకృష్ణ కోటనందూరు

కోటనందూరు, మనం న్యూస్ మార్చి 26ః కాకినాడ జిల్లా,కోటనందూరు మండలం, అల్లిపూడి లో జూదం(కాయిన్స్) ఆడుతున్న స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేసినట్లు ఎస్సై టి రామకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, డిఎస్పి సత్యనారాయణ, రూరల్ సీఐ చెన్నకేశవరావు ఆదేశాలతో పక్కా సమాచారంతో 25-3-2026 తేదీ బుధవారం సాయంత్రం సమయంలో దాడి చేశామని ఈ సమయంలో 17 మంది వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్లు, వారి వద్ద నుండి 9,650 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో జూదం, అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

## కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



కోటనందూరు. మనం న్యూస్ మార్చి 26ః కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కస్తూరిబా బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ సగిలి శాన్మోహన్ ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది .పాఠశాలలో గల తరగతి గదులు, వంట షెడ్డు, భోజన హాలు, డార్మిటరీ,టాయిలెట్స్, ఆర్వో ప్లాంట్, పనితీరును స్వయంగా చూశారు. గ్యాస్ సరఫరా మరియు నిల్వ గురించి వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న తెలియజేయాలని ప్రిన్సిపాల్ కు సూచించారు.10వ తరగతి విద్యార్థులు వ్రాస్తున్న పరీక్షలు గూర్చి విద్యార్థినులతో మాట్లాడారు ఎలాంటి ఒత్తిడి లేకుండా మిగిలిన పరీక్షలను బాగా వ్రాయాలని 100% ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థినులకు సూచనలు ఇచ్చారు.పాఠశాల ప్రాంగణంలో గల నూతన భవన నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపాల్ జి. రాజేశ్వరి గారు పాఠశాల ప్రస్తుత పనితీరును కలెక్టర్ గారికి తెలియచేశారు ఎలాంటి అవసరాలు ఉన్నా ఇంటిమేట్ చేయాలని కలెక్టర్ తెలియజేశారు. పాఠశాలలో గల విద్యార్థుల హాజరు, బోధన సిబ్బంది హాజరు, పాఠశాల వసతి,ఆహారం, తాజా కూరగాయలు, ఆహార నిల్వలు వంటి నిర్వహణ సంతృప్తికరంగా ఉండటం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా జడ్జి



నరసాపురం, మార్చి 26 (మనం న్యూస్)ః ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన జిల్లా న్యాయమూర్తి చైర్మన్ ఎస్. శ్రీదేవి గురువారం నరసాపురం సబ్ జైలులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, మంచినీటి సౌకర్యం, అనారోగ్యం పాలైన వారికి అందించే వైద్య సదుపాయాలను ముద్దాయిలను న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. జైలు ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని సూచించారు వంటశాల, స్టోర్ రూమ్ పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతను రుచి చూసి జైలు సిబ్బందిని అభినందించారు. ఈ తనిఖీలలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవితో పాట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్, నరసాపురం లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్ పర్సన్, 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ. వాసంతి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. రాజ్యలక్ష్మి, సబ్ జైలు పర్యవేక్షణ అధికారి టి. అప్పారావు, సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు కె. చిట్టిపద్మజ, ఎన్. కుమార్ రత్నం, పుల్లాజి, పూర్ణ రవిచంద్ర, నగేష్ కరుణాకర్, పి.ఎల్.వి.ఎస్. దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధే లక్ష్యం



వాసవి పెనుగొండ మార్చి 26 మనం న్యూస్ : పెనుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సాధారణ మహాజన సభ సొసైటీ ప్రాంగణంలో బుధవారం అధ్యక్షులు నక్క వేదవ్యాస శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశంలో సొసైటీ త్రిసభ్య కమిటీ పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలను ఆమోదించింది.ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు నక్క వేదవ్యాస శాస్త్రి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం పెరిగిందని అన్నారు. రైతులకు సబ్సిడీలు, రుణ సౌకర్యాలు, మద్దతు ధరల పరిరక్షణలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తోందని పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సహకారంతో ఆచంట నియోజకవర్గ ప్రాంత అభివృద్ధికి వేగం పెరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వేండ్ర మురళి, కానూరి వెంకట సత్యనారాయణ, సీఈఓ సూర్నీడి శ్రీరంగ సాయి పవన్ కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధే కూటమి ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ కామినేని



ముదినేపల్లి , మార్చి 26 (మనం న్యూస్)ః గ్రామీణ ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆరోగ్యకరమైన తాగునీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లి మండలంలోని వడాలి గ్రామంలో మంచినీటి సరఫరా పథకాన్ని జడ్పీ నిధులు 15 లక్షలతో మర మత్తు చేసిన ఫిల్టర్ బెడ్లను , ఉపాధి పథకం కింద రామాలయం వద్ద నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించగా మరో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి పథకం నిర్వహణ సక్రమంగా ఉండాలని ప్రజలు దాన్ని చక్కగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామములోని పలు సమస్యలను మహిళలు ఎమ్మెల్యే వద్ద ఏకరువు పెట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు , రాష్ట్ర టిడిపి కార్యదర్శి కొత్త నాగబాబు , ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ , మండల పార్టీ అధ్యక్షులు బొప్పన సుందరామయ్య , జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పోసిన పాండురంగారావు , చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి , చలసాని జగన్ మోహన్ రావు తదితర నాయకులు , గ్రామస్తులు పాల్గొన్నారు.



## ముద్రగడ నివాసంలో కీలక రాజకీయ భేటీ

- రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం

కిర్లంపూడి, మార్చి 26:( మనం న్యూస్ )ః కాకినాడ జిల్లా కిర్లంపూడిలో మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో జరిగిన కీలక రాజకీయ భేటీ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ భేటీకి ప్రత్యేక రాజకీయ ప్రాధాన్యత నెలకొనగా, భవిష్యత్తు పరిణామాలపై ఆసక్తి వ్యక్తమవుతోంది. ఈ సమావేశానికి సీనియర్ నాయకుడు అంబటి రాంబాబు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా హాజరై ముద్రగడ పద్మనాభం, ఆయన తనయుడు ముద్రగడ గిరిబాబుతో ఆత్మీయంగా సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, రాబోయే ఎన్నికల వ్యూహాలు, నియోజకవర్గ అభివృద్ధి, కార్యకర్తల సమస్యలు వంటి పలు అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లాలో పార్టీ స్థితిగతులు, నాయకత్వ సమన్వయం, గ్రామస్థాయి కార్యకర్తల పాత్రపై ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిసింది.

## కొత్తపేట గ్రామంలో 100 కెవి విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ ప్రారంభం



పాలకొల్లు, మార్చి 26,మనం ప్రతినిధి : పాలకొల్లు మండలం కొత్తపేట గ్రామంలో 100 కె.వి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను కూటమి నాయకులు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఏం సి చైర్మన్ కోడి జభాస్కర్, సర్పంచ్ కౌరుభారతి భాస్కరరావు, ఎంపీటీసీ వెంకటరత్నం, కౌరు మురళీకృష్ణ, కౌరు సందీప్ కుమార్, అందే కోటి వీరభద్రం, అంబాటి శేషగిరి, పోతుల సూరిబాబు, రాయ ప్రసాద్, పితాని దుర్గారావు ఇబ్బ రాంబాబు, కేతా రామకృష్ణ, గుబ్బల రామకృష్ణ, గుబ్బల నాగేశ్వరరావు, కట్ట మురళీధర్, కేతా సత్యనారాయణ, కేతరాజు, మల్లా సాంబమూర్తి, శీలంఅశోక్ కుమార్ గ్రామ ప్రజలు తదితరు నాయకులు పాల్గొన్నారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో...
# దేశంలో ఊపందుకున్న పర్యాటకం



**ఢిల్లీ, మార్చి 26:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా గల్ఫ్ దేశాల్లో పర్యటక రంగానికి బ్రేక్ పడింది. యుద్ధం వేళ ఆయా దేశాలకు వెళ్లేందుకు పర్యటకులు భయపడుతున్నారు. ఈ క్రమంలోనే భారతీయులు కూడా గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు చేసుకొన్న తమ వేసవి విహారయాత్రలను రద్దు చేసుకుంటున్నారు. దీంతో మన దేశంలోని టూరిస్టు ప్రాంతాలకు డిమాండ్ పెరిగింది. ఈ పరిణామాలు స్వదేశీ పర్యటకానికి ఊతమిస్తున్నాయి. వేసవి సెలవుల్లో అమెరికా, ఐరోపా దేశాలను సందర్శించేందుకు ఇప్పటికే ప్రణాళిక వేసుకొన్న టూరిస్టులు పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణానికి భయపడి ప్రస్తుతం దేశంలోని ప్రముఖ పర్యటక ప్రాంతాల వైపు మొగ్గు చూపుతున్నారు. లద్దాఖ్, రిషికేశ్, సిమ్లా, మనాలీ, షిల్లాంగ్ వంటి శీతల ప్రదేశాలను వేసవిలో సందర్శించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పర్యటకుల్లో దాదాపు 65% మంది దేశంలోని వివిధ ప్రాంతాలను చుట్టేసేందుకు ప్లాన్ చేసుకుంటున్నట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, లద్దాఖ్ వంటి ప్రాంతాలకు గతంతో పోలిస్తే ఇప్పుడు 30శాతం బుకింగ్‌లు పెరిగాయి. 23శాతం మంది ఆధ్యాత్మిక పర్యటనలకు ఆసక్తి చూపిస్తున్నారు. అలాగే విదేశీ పర్యటనలకు వెళ్లాలనుకునేవారు ఎక్కువగా వియత్నాం, నేపాల్, శ్రీలంక, ఇండోనేసియా, సింగపూర్, థాయ్‌లాండ్లను ఎంచుకుంటున్నట్లు ట్రావెల్ ఏజెన్సీల గణాంకాలు తెలిపాయి.

# ఏఐ' తీర్పుల ప్రస్తావన
## సుప్రీం కోర్టు ఆందోళన



**ఢిల్లీ, మార్చి 26:** కృత్రిమ మేధ ద్వారా సృష్టించిన తీర్పులను.. కక్షిదారులు, న్యాయవాదులు ఉటంకిస్తున్న తీరుపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా న్యాయస్థానాల్లో ఈ సమస్య అంతకంతకూ పెరుగుతోందని జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం తెలిపింది. ఓ కంపెనీ డైరెక్టర్‌కు సంబంధించిన కేసును గతంలో బాంబే హైకోర్టు విచారించింది. ఇందులో భాగంగా ఆ డైరెక్టర్ దాఖలు చేసిన రాతపూర్వక అంశాలను పరిశీలించి చాట్‌జీపీటీ, లేదా అటువంటి ఏఐ టూల్స్‌ను ఉపయోగించి రూపొందించినట్లు భావిస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఓ 'కేసు లా'ను కూడా ప్రస్తావించారని, అయితే.. దాని ప్రతిని అందించలేదని తెలిపింది. దాని గురించి తెలుసుకునేందుకు కోర్టు సిబ్బంది ప్రయత్నించినా.. ఫలితం లేకపోయిందని చెప్పింది. దీంతో విలువైన కోర్టు సమయం వృథా అయ్యిందని పేర్కొంది.

ఈ క్రమంలోనే బాంబే హైకోర్టు వ్యాఖ్యలను తొలగించాలని కోరుతూ కంపెనీ డైరెక్టర్ సుప్రీం కోర్టు ను ఆశ్రయించారు. ''మేం సంబంధిత వ్యాఖ్యలను తొలగిస్తున్నాం. కానీ వాస్తవానికి దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టుల్లోనూ ఈ సమస్య ఉంది. ప్రతి ఒక్కరూ ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి'' అని సుప్రీం కోర్టు ధర్మాసనం సూచించింది.

# 'వందేభారత్' భోజనంలో పురుగులు..
## ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా



**ఢిల్లీ, మార్చి 26:** వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో అందించిన ఆహారంలో పురుగులు కన్పించడం తీవ్ర వివాదాస్పదమైంది. తమకు ఇచ్చిన భోజనంలో పురుగులు ఉన్నాయంటూ రితేశ్ కుమార్ అనే ప్రయాణికుడు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన రైల్వేశాఖ ఐఆర్‌సీటీసీకి జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే.. రితేశ్ కుమార్ మార్చి 15న పట్నా-టాటానగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. ఆ సమయంలో తమకు అందించిన భోజనంలోని పెరుగులో పురుగులు రావడంతో ఆయన కంగుతిన్నారు. వెంటనే మేనేజర్ని పిలిచి ఫిర్యాదు చేశారు. రైలు సిబ్బంది ఆ భోజనాన్ని పరిశీలించారు. ఇదంతా రితేశ్ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది కాస్తా వివాదాస్పదం కావడంతో రైల్వే మంత్రిత్వశాఖ ఎక్స్‌లో స్పందించింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధిస్తున్నట్లు వెల్లడించింది. ఆ రైల్లో కేటరింగ్ చేసిన ఫుడ్ సర్వీస్ ప్రొవైడర్‌కు రూ.50 లక్షల జరిమానాతో పాటు అతడి కాంట్రాక్టును రద్దు చేసినట్లు తెలిపింది. ప్రయాణికుల భద్రత, రైల్వే సౌకర్యాల్లో నాణ్యతే తమ ప్రథమ ప్రాధాన్యమని రైల్వేశాఖ వివరించింది.



# ప్రధానిపై ఏఐ వీడియోలు
## 'ఎక్స్'పై సైబర్ పోలీసుల కేసు

ఢిల్లీ, మార్చి 26: ఏఐ జనరేటెడ్ వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో విపరీతంగా వాడేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ప్రధాని మోడీ,ఎన్నికల కమిషనర్‌పై ఏఐ ఆధారిత వీడియోలు ఎక్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలోనే కేరళకు చెందిన సైబర్ పోలీసులు సదరు సామాజిక మాధ్యమంపై కేసు నమోదు చేశారు.''ఆ వీడియోలు ప్రజలను తప్పుదారి పట్టించేలా, దేశ ప్రధాని, ఎలక్షన్ కమిషన్ పరువుకు భంగం కలిగేలా ఉన్నాయి. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణపై ప్రతికూల ప్రభావం చూపేవిధంగా వాటిని రూపొందించారు. అందుకే వాటిపై చర్యలు తీసుకోవాల్సి వచ్చింది'' అని సైబర్ పోలీసులు వెల్లడించారు. ఎక్స్ సంస్థతో పాటు ఆ ఏఐ వీడియోలు పోస్ట్ చేసిన ఓ యూజర్ ఖాతాపై కూడా తిరువనంతపురంలోని సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కువైట్ నాయకులు లక్ష్యంగా హెజ్బొల్లా ఉగ్ర కుట్ర..!
## కువైట్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడి

**బాగ్దాద్, మార్చి 26:** ఓవైపు పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొని ఉండగా, మరోవైపు ఉగ్రవాదుల కుట్రలు ఆందోళనను కలిగిస్తున్నాయి. కువైట్ నాయకులను హత్య చేసేందుకు హెజ్బొల్లా చేసిన కుట్రలు భగ్నమయ్యాయి. ఈ నెట్‌వర్క్‌ను ఛేదించిన కువైట్ స్టేట్ సెక్యూరిటీ ఏజెన్సీ.. ఆరుగురు ఉగ్రవాదులను అరెస్టు చేసింది. వీరి నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న మరో 14 మందిని కువైట్ భద్రతా సంస్థ గుర్తించింది. ''నిషేధిత ఉగ్రవాద సంస్థ హెజ్బొల్లాతో నిందితులకు సంబంధాలు ఉన్నట్టు గుర్తించాం. వీరంతా ప్రముఖ వ్యక్తులు, నాయకులపై హత్యకు కుట్ర పన్నుతున్నట్లు దర్యాప్తులో తేలింది. ఇందుకోసం కొందరు వ్యక్తులను కూడా నియమించుకున్నట్లు సమాచారం. నిందితుల్లో కొందరు తమ నేరాన్ని అంగీకరించారు'' అని కువైట్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. పేలుడు పదార్థాలు, ఆయుధాల వినియోగం, నిఘాకు సంబంధించి హెజ్బొల్లా ఏజెంట్ల నుంచి నిందితులు శిక్షణ తీసుకున్నట్లు కువైట్ అధికారులు తెలిపారు.



# ఖర్గ్ ద్వీపంలో ఇరాన్ మందుపాతరలు



**టెహ్రాన్, మార్చి 26:** ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ఐలాండ్‌ను స్వాధీనం చేసుకునే ఉద్దేశంతో పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా తన బలగాలను మోహరిస్తోందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఖర్గ్‌ను రక్షించుకునేందుకు ఇరాన్ సిద్ధమైంది. ఇందుకోసం అమెరికా దళాలను అక్కడ అడుగుపెట్టనీయకుండా ఇరాన్ భారీగా మందుపాతరలు అమర్చినట్లు సమాచారం. వాటితో విధ్వంసకర ఉచ్చులు పన్నుతోందని తెలుస్తోంది. అంతేకాకుండా అక్కడికి భారీగా బలగాలను కూడా తరలిస్తున్నట్లు అంతర్జాతీయ వార్తా కథనం వెల్లడించింది.

హర్మూజ్ జలసంధిని తెరిపించేలా ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఓ సాధనంగా వాడాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తోంది. ''పశ్చిమాసియా ప్రాంతంలోని ఓ దేశం(ఇజ్రాయెల్‌ను ఉద్దేశించి) సహకారంతో ద్వీపాలను ఆక్రమించుకోవాలని మా శత్రువులు సన్నాహాలు చేస్తున్నారన్న నిఘా సమాచారం ఉంది. శత్రువుల కదలికలను మేం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. శత్రువు ఒక్క అడుగు ముందుకువేసినా.. పశ్చిమాసియాలోని ఆ దేశంలోని కీలక మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఎడతెగని దాడులు చేస్తాం'' అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఎంబీ ఘలిబాఫ్ ఇప్పటికే హెచ్చరికలు చేశారు. అమెరికా సైనికులు, కమాండర్ల ఆచూకీ చెప్పండంటూ పశ్చిమాసియా దేశాలకు ఇరాన్ విజ్ఞప్తి చేసింది. అమెరికా స్థావరాలపై తాము దాడులు చేస్తుండటంతో అక్కడున్న యూఎస్ సైనికులు ఇతర ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్నారని ఇరాన్ వెల్లడించింది. ''పశ్చిమాసియా దేశాల ప్రజలు వారి ఆచూకీని వెల్లడించాలని కోరుతున్నాం. అలాగే మీ భద్రత కోసం వారిని బహిష్కరించండి'' అని అడిగింది. తమ దాడుల్లో దెబ్బతిన్న అమెరికా స్థావరాలు నిర్జన ప్రాంతాలుగా మారాయని పేర్కొంది. 13 సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయని వెల్లడించింది. భూతల దాడుల వార్తల నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ సైన్యాన్ని ఇరాన్ హెచ్చరించింది. నెతన్యాహు, ట్రంప్ చేస్తోన్న మోసానికి మీ పిల్లలను బలిచేయకండంటూ హెచ్చరించింది.


# సౌదీ నుంచి ఎయిరిండియా యూటర్న్




**ఢిల్లీ, మార్చి 26:** దేశ రాజధాని ఢిల్లీ నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం ఏడుగంటల పాటు గాల్లోనే ఉండాల్సి వచ్చింది. చివరకు బయల్దేరిన చోటే ల్యాండ్ అవ్వాల్సి వచ్చింది. సాంకేతిక కారణంతో సౌదీ అరేబియా గగనతలం నుంచి వెనుతిరగాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ రోజు ఉదయం 6.13 గంటల సమయంలో ఢిల్లీ నుంచి బయల్దేరిన ప్రయాణికుల విమానం లండన్‌లోని హీత్రూ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావాల్సి ఉంది. కానీ సౌదీ అరేబియా గగనతలంలోకి ప్రవేశించిన తర్వాత అది వెనుతిరిగి, మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మళ్లీ ఢిల్లీలో ల్యాండ్ అయింది. ఫ్లైట్ రాడార్ డేటా ప్రకారం.. అప్పటికే అది 3,300 కి.మీ. ప్రయాణించింది. సౌదీ నుంచి లండన్‌కు వెళ్లాలంటే ఆరు నుంచి ఏడు గంటల సమయం పడుతుంది. అయితే ఇలా అకస్మాత్తుగా వెనుతిరగడానికి సాంకేతిక సమస్య కారణమని తెలుస్తోంది.

''ఎయిరిండియా భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. అయితే ప్రస్తుతం సాంకేతికంగా పూర్తిస్థాయి తనిఖీలు చేస్తున్నాం. అవి పూర్తవడానికి కొంచెం సమయం పడుతుంది'' అని విమానయాన సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. విమానంలో శబ్దాలు వినిపించడం వల్లే వెనక్కి మళ్లించినట్లు సమాచారం. పది రోజుల క్రితం ఇదే విమానాన్ని దారిమళ్లించారు. మార్చి 15న ఢిల్లీ నుంచి న్యూయార్క్ బయల్దేరిన విమానాన్ని ఐర్లాండ్‌కు మళ్లించడం గమనార్హం. అప్పుడు సాంకేతిక సమస్యే కారణమని సంస్థ వెల్లడించింది.

# హర్మూజ్ సమీపంలో దాడి
## ఇరాన్ నేవీ చీఫ్ మృతి!



**జరూసలెం, మార్చి 26:** ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్' (ఐఆర్జీసీ) నౌకాదళ చీఫ్ అలీరెజా తంగ్‌సిరిని మట్టుబెట్టినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. తీరప్రాంత నగరమైన బందర్ అబ్బాస్‌పై జరిపిన దాడుల్లో ఆయనతోపాటు మరికొందరు సీనియర్ నౌకాదళ కమాండర్లు మృతి చెందినట్లు ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ వెల్లడించారు. దీనిపై ఇరాన్ ఇంకా ఎటువంటి ప్రకటన చేయలేదు. 2018 నుంచి అలీరెజా నేవీ చీఫ్ పదవిలో కొనసాగుతున్నారు. హర్మూజ్ జలసంధి మూసివేతను ఆయనే పర్యవేక్షిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. క్షిపణి శిథిలాలు మీదపడి అబుధాబీలో ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇజ్రాయెల్లోని కెఫర్ ఖాసీం ప్రాంతంలో ఐదుగురు, టెల్‌అవీవ్లో ఇద్దరు గాయపడ్డారు. ఇజ్రాయెల్ సైనిక నియంత్రణ కేంద్రం, అణు మౌలిక సదుపాయాలకు సంబంధించిన పరిశ్రమలపైనా దాడులు చేశామని ఐఆర్జీసీ ప్రకటించింది. లెబనాన్‌లో ఓ సైనికుడు మృతి చెందినట్లు ఇజ్రాయెల్ తెలిపింది.

# ఇకపై మరిన్ని వీసాలకు 'సోషల్ వెట్టింగ్'




**వాషింగ్టన్, మార్చి 26 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే హెచ్-1బీ వంటి కొన్ని వీసాలకు 'సోషల్ మీడియా వెట్టింగ్'ను అమలుచేస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ నిబంధనను మరిన్ని వీసా కేటగిరీలకు తప్పనిసరి చేసింది. మార్చి 30 నుంచి ఈ కొత్త రూల్స్ అమల్లోకి రానున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. ఏ-3, సీ-3 (డొమెస్టిక్ వర్కర్లు), జీ-5, హెచ్-3, హెచ్-4 (హెచ్-3 డిపెండెంట్స్), కె,క్యూ,ఆర్,ఎస్,టీ,యూ వీసాల దరఖాస్తుదారులకు కూడా ఇకనుంచి 'సోషల్ వెట్టింగ్' చేయనున్నారు. జాతీయ భద్రత పేరుతో గతేడాది ఈ నిబంధనను అమెరికా తీసుకొచ్చింది. గత డిసెంబరు నుంచి హెచ్1బీ, హెచ్4, ఎఫ్, ఎం, జే వీసాలకు దరఖాస్తు చేసుకునేవారి ఆన్‌లైన్ యాక్టివిటీని క్షుణ్ణంగా తనిఖీ చేస్తోంది.

వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేస్తారు. దీన్నే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. సంబంధిత వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారులు తమ సామాజిక మాధ్యమ ఖాతాల సెట్టింగ్‌లను ప్రైవేటు నుంచి పబ్లిక్‌కు మార్చుకోవాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో వారు ఎలాంటి కంటెంట్ పోస్ట్ చేస్తున్నారు? వారివల్ల అమెరికా భద్రతకు ముప్పు ఉందా? అన్న కోణంలో అధికారులు ఈ తనిఖీలు చేస్తారు.

# కెనడాలో కీలక చట్టం
# ఖలిస్థానీల ఆగడాలకు చెక్!



**ఒట్టావా, మార్చి 26:** విద్వేషపూరిత చర్యలు, నేరాలను అరికట్టేందుకు తీసుకొచ్చిన 'కాంబాటింగ్ హేట్' (సీ9 బిల్లు) బిల్లుకు కెనడా చట్టసభ ఆమోదం తెలిపింది. ఈ కీలక బిల్లుకు హౌస్ ఆఫ్ కామన్స్ ఆమోదముద్ర వేయగా, అనంతరం దీనిని ఎగువసభ (సెనెట్)కు పంపించారు. విద్వేష చిహ్నాలను బహిరంగంగా ప్రదర్శించడాన్ని నేరంగా పరిగణిస్తారు. ఇది అమల్లోకి వస్తే ప్రార్థనా స్థలాలపై దాడులు, ఖలిస్థానీ మద్దతుదారుల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని విశ్లేషకుల అంచనా. ఈ చట్టం కోసం కెనడాలోని భారత సంతతి వ్యక్తులు సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్నారు.

కెనడాలో ఖలిస్థానీల ఆగడాలు ఇటీవల పెరిగిపోయాయి. కొన్ని వర్గాల వారిని లక్ష్యంగా చేసుకుంటూ బెదిరింపులకు పాల్పడుతుండటం, విధ్వంసం సృష్టించడం.. తదితర ఘటనలు పెరుగుతున్నాయి. ఈ తరహా ఘటనలపై ప్రవాస భారతీయులు ఎన్నో ఏళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి తరుణంలోనే విద్వేష చర్యలకు సంబంధించి కొత్త బిల్లు ఆమోదం పొందడం ఊరట కలిగించే విషయం. నిషేధిత సంస్థల చిహ్నాలను బహిరంగంగా ప్రదర్శించడం, కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకొని విద్వేషాన్ని రెచ్చగొట్టడం వంటి చర్యలను కొత్త బిల్లు ప్రకారం తీవ్ర నేరంగా పరిగణిస్తారు. యూదులు, ముస్లింలు, ఇతర మతాల వారిని ఆయా ప్రార్థనా స్థలాల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం కూడా నేరమే. ఇటువంటి చర్యలకు పాల్పడేవారికి గరిష్ఠంగా పదేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉంది. అయితే, కన్జర్వేటివ్‌లు మాత్రం ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నారు.

# నా మాటలు సీరియస్‌గా తీసుకోండి
## ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్, మార్చి 26:** ఇరాన్‌తో యుద్ధం ముగింపు కోసం ప్రయత్నాలు జరుగుతోన్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. చర్చల విషయంలో ఇరాన్ వింతగా ప్రవర్తిస్తోందన్నారు. ఆ దేశం ఒప్పందం కోసం ప్రాధేయపడుతూనే బయటకు మాత్రం అంగీకరించడం లేదన్నారు.''వారు ఒక ఒప్పందం కోసం మమ్మల్ని వేడుకుంటున్నారు. ఇరాన్ మిలిటరీ పూర్తిగా నాశనమై, తిరిగి పుంజుకునే అవకాశం లేకుండా పోయినందున అలా వేడుకోవాల్సిందే. అయినప్పటికీ, వారు కేవలం మా ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని చెబుతున్నారు. వారు తప్పు చేస్తున్నారు. మరీ ఆలస్యం కాకముందే వారు సీరియస్‌గా వ్యవహరించడం మంచిది. ఆలస్యమైతే.. వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు. దాని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి'' అని సామాజిక మాధ్యమం ట్రుత్లో ట్రంప్ పోస్టు చేశారు. కొన్నిగంటల ముందు కూడా ట్రంప్ ఇవే వ్యాఖ్యలు చేశారు. రిపబ్లికన్ పార్టీ విరాళాల సేకరణ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ''యుద్ధం ముగింపు విషయంలో చర్చలు జరుపుతున్నాం. ఆ ఒప్పందం కోసం ఇరాన్ ప్రాధేయపడింది. కానీ, ఆ విషయాన్ని వారు బయటకు చెప్పట్లేదు. ఎందుకంటే సొంత ప్రజల చేతుల్లోనే హత్యకు గురవుతారని వారు భయపడుతున్నారు'' అని అన్నారు. మరోవైపు ఇరాన్ నుంచి భిన్నమైన స్పందన వచ్చింది. అమెరికా ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని, ఘర్షణల ముగించేందుకు చర్చలు జరిపే ఉద్దేశం లేదని ఆ దేశ విదేశాంగమంత్రి స్పష్టం చేశారు.ఇరాన్ యుద్ధం విషయంలో నాటో దేశాల నుంచి ఎలాంటి మద్దతు లభించకపోవడంపై ట్రంప్ మరోసారి తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ''ఇప్పటికే మిలిటరీ పరంగా తీవ్రంగా నష్టపోయిన ఇరాన్ విషయంలో అమెరికాకు నాటో దేశాలు ఏమాత్రం సహకరించడం లేదు. నాటో నుంచి ఎలాంటి అవసరం లేదు. కానీ, ఇలాంటి ముఖ్యమైన సమయంలో వారు ప్రవర్తించిన తీరును ఎప్పటికీ మర్చిపోం'' అని మరో పోస్టు చేశారు.

# చదువుతోనే కుటుంబాలు బాగుపడతాయి

- ప్రతి ఒక్కరూ పిల్లలను చదివించాలి
- నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ గా తీర్చిదిద్దుతా
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ -మార్చి 26 (మనం ప్రతినిధి)**: నల్గొండ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నంబర్ వన్ గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.గురువారం ఆయన నల్గొండ జిల్లా, కనగల్ మండల కేంద్రంలో 6 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అంతేకాక కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చదువు ద్వారానే కుటుంబాలు బాగుపడతాయని ,అభివృద్ధి సాధ్యమని, అందువల్ల ప్రతి ఒక్కరు తప్పకుండా పిల్లలను చదివించాలని కోరారు. తమ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో అన్ని ఆధునిక సౌకర్యాలతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నదని చెప్పారు. కనగల్ లో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థుల మాదిరిగానే ఇంటర్ విద్యార్థులకు కూడా వచ్చే విద్యా సంవత్సరం నుండి ఉదయం అల్పాహారంతో పాటు, మధ్యాహ్న భోజనం అందించనుందని, అందువల్ల తప్పనిసరిగా పిల్లలను కళాశాలకు పంపించాలని ఆయన కోరారు. నల్గొండ జిల్లా కేంద్రంలో 150 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్మించామని, అలాగే నర్సింగ్ కళాశాల నిర్మాణం డిసెంబర్ లోపు పూర్తి చేస్తామని, చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో భాగంగా 20 కోట్ల రూపాయలతో న్యాక్ బిల్డింగ్ నిర్మించి మొదటి అంతస్తు పూర్తి చేశామని, అక్కడ మహిళలకు కూడా శిక్షణ ఇస్తున్నామని, సెట్విన్ ద్వారా 2500 మంది మహిళలకు వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నామని, అంతేకాక 80 కోట్ల రూపాయల వ్యయంతో ఏటీసీ కేంద్రాన్ని నిర్మించడం జరిగిందని, వీటన్నిటి ద్వారా చదువుకున్న యువత స్వయం ఉపాధి పొందవచ్చని మంత్రి తెలిపారు.తమ సొంత నిధులతో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా నల్గొండలో జూనియర్ కళాశాల కట్టించడం జరిగిందని, అంతేకాక బొట్టు గూడా ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ తరహాలో నిర్మించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.స్వయం సహాయక మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రుణాల మంజూరు తో పాటు, నల్గొండ ఎస్ఎల్బీసీ సమీపంలో 5 కోట్ల రూపాయల వ్యయంతో పెట్రోల్ పంపు నిర్మిస్తున్నదని, అక్కడే సూపర్ మార్కెట్, రెస్టారెంట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాక అన్ని నియోజకవర్గాలలో ఇలాంటి పెట్రోల్ పంపులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మహిళలు స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేరాలని కోరారు. మహిళలు సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆదాయం పొందవచ్చు అని తెలిపారు. రహదారుల అభివృద్ధిలో భాగంగా నల్గొండ నుండి దర్వేశిపురం వరకు 50 కోట్ల రూపాయలతో డబుల్ రోడ్డు నిర్మాణం మంజూరు చేయడం జరిగిందని, ధర్వేశిపురం నుండి గుర్రంపోడు మీదుగా 180 కోట్ల రూపాయలతో చేపట్టే రోడ్డుకు టెండర్లు పూర్తయ్యాయని, వారం రోజుల్లో పనులు మొదలు పెడతామన్నారు. కనగల్ చివరస్తా నుండి అసంపూర్తిగా ఉన్న రహదారిని సరి చేసేందుకు 8 కోట్ల రూపాయలను మంజూరు చేసామని, శుక్రవారం నుండి పనులు ప్రారంభమవుతున్నాయని, అలాగే రేగట్ట వరకు 60 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం, పగిడిమర్రి మీదుగా మరో రోడ్డు ముశ్రంపల్లి వరకు 100 కోట్ల రూపాయలతో రోడ్డును మంజూరు చేసినట్లు వెల్లడించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందని, మూడు కోట్ల 15 లక్షల మందికి సంవత్సరానికి సన్నబియ్యం అందిస్తున్నామని, 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తున్నామని చెప్పారు. నల్గొండ ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దస్రు నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు మాట్లాడారు. స్థానిక సర్పంచ్ ,ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.




# నేటి యువతకు ఆదర్శం బొమ్మగాని ధర్మభిక్షం

- సూర్యాపేట జిల్లాకు బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టాలి
- బీసీ నేత ధనుంజయ నాయుడు డిమాండ్

**నేరేడుచర్ల, మార్చి 26 మనం న్యూస్**: సూర్యాపేట జిల్లాకు తెలంగాణ సాయుధ పోరాట యోధులు మాజీ శాసనసభ్యులు, మాజీ పార్లమెంటు సభ్యులు బొమ్మగాని ధర్మబిక్షం పేరు పెట్టాలని నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు.సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ప్రధాన కూడలిలో దివంగత నేత బొమ్మగాని ధర్మబిక్షం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అలాగే ఆ తరువాత జరిగిన ప్రపంచ ప్రఖ్యాత తెలంగాణ రైతాంగ పోరాటం లో పాల్గొని అసమాన పోరాటాల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిలిచిన ధీరుడు అని అట్టడుగు వర్గాల కుటుంబాల పిల్లలు చదువుకోవాలనే ఆకాంక్షతో సూర్యాపేట కేంద్రంగా ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేసి దాతల నుంచి విరాళాలు సేకరించి అట్టి సొమ్మును పేద కుటుంబాల పిల్లల చదువు కోసం వినియోగించి ఎందరినో గొప్ప వ్యక్తులుగా శక్తులుగా తీర్చిదిద్ది తన యావత్ జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసి మూడుసార్లు శాసనసభ్యుడిగా రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా గెలిచినప్పటికీ చిల్లిగవ్వ ఆస్తి సంపాధించకుండా నిరాడంబ జీవితం గడిపిన బొమ్మగాని ధర్మభిక్షం గారి పేరు సూర్యాపేట జిల్లాకు పెట్టడం ఎంతైనా సముచితంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు కార్యక్రమంలో నేరేడుచర్ల మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి పాలక వీడు మండల సిపిఐ కార్యదర్శి ముళ్ళ జానయ్య ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మరాజు వెంకట్, జై గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పుల లక్ష్మీనారాయణ గౌడ్ బీసీ సంఘం నాయకులు ముత్యాల భాస్కర్ గౌడ్ బుడిగె చంద్రయ్య గౌడ్ చామకూరి వీరయ్య గౌడ్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ దొంతగాని వెంకటేశ్వర్లు గౌడ్ బండి శ్రీనివాస్ అనిల్ కొండ రాము గౌడ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ బండల రేటు పెరిగిందని టిఫిన్ రేట్లు పెంచిన హోటల్ యజమానులు



**కోదాడ, మార్చి 26(మనం న్యూస్)**: గ్యాస్ సిలిండర్లపై ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా ధరలు వసూలు చేస్తున్నారని గుర్తించిన నేపథ్యంలో, టిఫిన్ సెంటర్ల, హోటల్ యజమానులు దీనిని ఆసరా చేసుకుని టిఫిన్ ధరలను పెంచడం జరిగింది. కృతిమ కొరతను సృష్టించిన గ్యాస్ ఏజెన్సీల వారు గ్యాస్ ను అక్రమంగా బ్లాక్ మార్కెట్ లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ కిసాన్ మోర్చ మాజీ రాష్ట్ర కార్యదర్శి కనగాల నారాయణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెబోయిన వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో డీటీ సతీష్ కు మెమొరాండం అందజేయడం జరిగింది. ప్రజలకు అవసరమైన గృహ వినియోగ గ్యాస్పై అధిక ధరలు వసూలు చేయడం వలన సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యతరగతి, పేద వర్గాలపై ఈ అదనపు భారం మరింత ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, సంబంధిత గ్యాస్ ఏజెన్సీలపై తగిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే గ్యాస్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని మెమొరాండం ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నడిగూడెం మండల అధ్యక్షులు వీరబాబు, అనంతగిరి మండల అధ్యక్షులు సతీష్, జిల్లా నాయకులు జల్లా జనార్ధన్, రాష్ట్ర నాయకులు చిట్టయ్య, కృష్ణ ప్రసాద్, దేవరశెట్టి సత్యనారాయణ, విశ్వేశ్వరరావు, భూమా శ్రీనివాస్, సాగర్ల సతీష్, కొండయ్య, సుధాకర్ రెడ్డి, శంకర్, పసి, బిజేపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# విద్యార్థులు చదువు లక్ష్యాలను ఎంచుకోవాలి

- రోడ్డుపై ప్రయాణించే సమయంలో జాగ్రత్తగా ఉండాలి
- ప్రమాదాల నివారణ కోసం అరైవ్ అలైవ్ ఉద్యమం
- తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు
- వారి కలలను పిల్లలకు నెరవేర్చాలి
- నూతన విషయాలు నేర్చుకుని ప్రణాళిక పెట్టుకుని లక్ష్య సాధనకు ముందుకెళ్లాలి
- జిల్లా ఎస్పీ కే నరసింహ




**సూర్యాపేట, మార్చి 26 (మనం ప్రతినిధి)**: ఉజ్వలమైన, ఉన్నతమైన లక్షాలను ఎంచుకుని నిరంతరం కృషి చేస్తే మంచి విజయాలు వస్తాయి, పాఠశాలలు దేవాలయాలు, తరగతి గదులు ప్రయోగశాలలు వీటిని సద్వినియోగం చేసుకోవాలి అని ఎస్పి నరసింహ అన్నారు. చివ్వెంల పోలీస్ స్టేషన్ పరిధి దురాజుపల్లి గ్రామం వద్ద ఉన్న ఎం.ఎస్.ఆర్ సెంట్రల్ స్కూల్ నందు చివ్వెంల పోలీసులు, షీ టీమ్స్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అరైవ్ - అలైవ్ అవగాహన కార్యక్రమం నందు జిల్లా ఎస్పి నరసింహ ముఖ్య అతిథిగా ఆసన్న గారు ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ....మంచి లక్ష్యాలు ఎంచుకోవడం, ప్రణాళికతో చదువుకోవడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండడం, రోడ్డు భద్రత, సైబర్ మోసాలు లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. మంచి ప్రణాళిక పెట్టుకుని చదవాలి అన్నారు. ప్రస్తుత సమాజంలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్ వినియోగం ప్రధాన సమస్యగా ఉన్నాయి వీటి నిర్మూలనకు పోలీసు శాఖ కృషి చేస్తుంది తెలిపారు. యువత, పౌరులు భాగస్వామ్యం కావాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడం, రోడ్డు ప్రమాదంలో ఏ ఒక్కరు మరణించకుండా సురక్షితంగా గమ్యం చేరడం, రోడ్డు భద్రతా నియ మాలు తెలియజేయడం లక్ష్యంగా రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ₹అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత మహాఉద్యమం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది పేర్కొన్నారు. మానవ తప్పిదాల వల్ల అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవించి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఏ ఒక్కరూ రోడ్డు ప్రమాదంలో ప్రాణం కోల్పోకూడదు అనేది పోలీస్ శాఖ లక్ష్యమని స్పష్టం చేశారు. పిల్లలు వాహనాలు నడపడం ప్రమాదం, నేరము అన్నారు. విద్యార్థులు ఇంటర్నెట్ సద్వినియోగం చేసుకోవడంలో సామాజిక మాధ్యమాలు ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్ ట్విట్టర్ వాట్సప్ వంటివి వినియోగించేటప్పుడు నకిలీ వాటిని గుర్తించాలని వీటికి వచ్చే సందేశాలను అనుసరించి పెట్టుబడులు పెట్టవద్దని ఉద్యోగాలు ఇప్పిస్తామంటే డబ్బులు కట్టవద్దని కోరారు.ఈ కార్యక్రమంలో షీ టీం, పోలీస్ కళా బృందం వారు విద్యార్థుల రక్షణ, సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, షీ టీం ఎస్సై నీలిమ, ఎమ్మెస్సార్ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

# ఉత్కంఠంగా .. బార్ అసోసియేషన్ ఎన్నికలు



- ఇద్దరికీ చెరిసమానం రావడంతో డ్రాలో జ్ఞాన సుందర్‌కు వరించిన అధ్యక్ష పదవి

**తుంగతుర్తి: మార్చి 26,( మనం న్యూస్)**: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో గురువారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠంగా సాగింది. అధ్యక్షుడిగా అన్నెపర్తి జ్ఞాన సుందర్, తాళ్లపల్లి సత్యనారాయణ ఇద్దరు బరిలో నిలవగా 16 ఓట్ల గాను ఇద్దరికీ సమానం రావడంతో డ్రా తీయగా అన్నెపర్తి జ్ఞానసుందర్ కు అధ్యక్ష పదవి వరించిందని ఎన్నికల అధికారి ఎస్కే.వజీర్ తెలిపారు. దీంతో జ్ఞాన సుందర్ నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జ్ఞాన సుందర్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని, కోర్టు నూతన భవన నిర్మాణం కోసం కృషి చేస్తానని, న్యాయవాదులకు కావాల్సిన హెల్త్ కార్డులు, నూతన కోర్టు భవనంలో రూ.1లక్షతో లైబ్రరీ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని పలువురు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రవేశ పరీక్ష ఏదైనా... వెంపటి ప్రాథమిక పాఠశాల ప్రభంజనం



**తుంగతుర్తి, మార్చి 26,(మనం న్యూస్)**: ప్రవేశ పరీక్ష ఏదైనా వెంపటి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం ప్రభంజనం సృష్టిస్తున్నారు. తాజాగా తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలల్లో 5 వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో వెంపటి ప్రాథమిక పాఠశాల నుండి 35 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాయగా ,వారిలో 28 మంది విద్యార్థులు అర్హత సాధించి జిల్లాలోని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.ఇది పాఠశాల ఉపాధ్యాయుల కృషి,విద్యార్థుల పట్టుదల,తల్లిదండ్రుల సహకారం కలిసి సాధించిన విజయం. ఈ మేరకు గురువారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను అభినందించారు. సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్తలూరి వెంకట్రామనరసమ్మ మాట్లాడుతూ... మా పాఠశాల విద్యార్థులు సాధించిన ఈ విజయము మాకు మా పాఠశాలకు ఎంతో గర్వకారణమని అన్నారు.గ్రామీణ ప్రాంతంలో ఉన్నప్పటికీ పిల్లలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొని ఉన్నత లక్ష్యాలను చేరగలరని మరోసారి నిరూపించారని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, నిరంతర సాధనతో ఈ ఫలితాలను సాధించినట్లు తెలిపారు.తల్లిదండ్రులు కూడా పిల్లల విద్యపై ఆసక్తి చూపడం వల్లే ఈ ఈ విజయం సాధ్యమైందన్నారు. భవిష్యత్తులో ఇంకా మంచి ఫలితాలు సాధించేందుకు పాఠశాల తరపున అన్ని విధాల కృషి చేస్తామని అన్నారు.ఉపాధ్యాయులు మాట్లాడుతూ... విద్యార్థులకు పునాది స్థాయి నుంచే సరైన మార్గదర్శనం,సాధన,పరీక్షలపై అవగాహన కల్పించడం ద్వారా ఈ ఫలితాలు సాధించగలిగామని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాల ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ పెద్దలు ఈ విజయాన్ని ప్రశంసిస్తూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ విజయంతో వెంపటి పాఠశాల జిల్లా స్థాయిలో ఒక ఆదర్శ పాఠశాలగా నిలిచిందని అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భీవనపల్లి శ్రీనివాస్,మల్లెపాక రవీందర్, గుండ్ల ఆంజనేయులు,గట్టు మాధవి, నిమ్మరబోయిన నవీన, బండారు భవాని, జీడి అనిల్ కుమార్, మిట్టగడుపుల విక్రమ్, మాలోతు కృష్ణ,రామణ బోయిన మౌనిక, అబ్బగాని మంజుల,శీలోజు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# సాదాబైనమా భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలి



**సూర్యాపేట,మార్చి 26 (మనం ప్రతినిధి)**: జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాదా బైనామ, భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని వీసీ హాల్ నందు జిల్లాలోని ఆర్డీవోలు, తహసిల్దార్ లతో పెండింగ్ సాదాబైనమా, భూభారతి, భూ సమస్యలపై వేబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకునేలా జీవో 76ను జారీ చేసినట్లు పేర్కొన్నారు..సాదా బైనామా ద్వారా భూములు అమ్ముకునే సమయంలో అమ్మే వ్యక్తి రికార్డు నందు నమోదు కలిగి ఉండాలని, అదే విదంగా పట్టా భూములను మాత్రమే ప్రాసెస్ చేయాలని సూచించారు. వీటితో పాటు భూమి మీద పొజిషన్ తో పాటు, 5ఎకరాల లోపు భూములు కలిగివున్న వారికే మాత్రమే పరిష్కరించాలన్నారు. నోటీస్ జారీ చేసి 30 రోజులు పూర్తి అయిన వాటిని పరిష్కరించాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి పంచనామా చేయాలని స్పష్టం చేశారు.చాలన్ కట్టే ముందు ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు సరిచేసుకోవాలని ఆదేశించారు. సాదా బైనమా దరఖాస్తులకు పరిష్కారం తొందరగా పూర్తి చేసి అర్హులైన వారికి 13 బి. పట్టాలను జారీ చేయాలని తెలిపారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కారం చూపాలని, అలాగే కోర్టు కేసులు, హైకోర్టులో నమోదైన కేసులకు విధిగా జవాబు ఇవ్వాలన్నారు. అదే విదంగా స్లాట్స్ బుకింగ్ క్యాన్సిల్ చేసుకున్న వారికి రీ పేమెంట్ అయ్యే విధంగా చర్యలు చేపట్టలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ కింద ఎలక్షన్ మ్యాపింగ్ ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఫారం - 6,7,8 పెండింగ్ లేకుండా చూడాలని, అదే విదంగా మరణించిన ఓటర్లను జాబితా నుండి తొలగించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సుదర్శన్ రెడ్డి, సూపర్డెంట్లు సాయిగౌడ్, శ్రీలత, సంతోష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తాం




**అనంతగిరి, మార్చి 26 (మనం న్యూస్)**: గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని సర్పంచ్ వాడ కొప్పుల ఉమా అన్నారు.మండలంలోని శాంతినగర్ గ్రామపంచాయతీ ఆవరణలో స్థానిక సర్పంచ్ వాడ కొప్పుల ఉమా అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రతి సమస్యను గుర్తించి అట్టి సమస్యను బట్టి ప్రాధాన్యతల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు.ప్రధానంగా ఎండాకాలం నీటి ఎద్దడి తలెత్తకుండా పాలకవర్గ సహకారంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు.తాగునీరు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం,వీధి దీపాల ఏర్పాట్లకు కృషి చేస్తామని ఆమె అన్నారు .గ్రామంలో ఉన్న అన్ని సమస్యలను క్రమ క్రమంగా పరిష్కరించి గ్రామాన్ని ఆదర్శ గ్రామపంచాయతీగా ప్రజల సహకారంతో తీర్చిదిద్దుతామని తెలిపారు.ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంక్షేమ పథకం అర్హులైన పేదలకే అందేలా కృషి చేస్తామని తెలిపారు.నూతన పాలకవర్గం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధి కోసం నిత్యం ప్రజా సమస్యలపై పని చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గరిడేపల్లి స్వాతి చంద్రయ్య, వార్డు సభ్యులు విష్ణు, అక్బర్, సుగుణ, లక్ష్మి,వెంకటేశ్వర్లు,నరేష్,గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ భద్రం కృష్ణా రెడ్డి, రాఘవరెడ్డి, ఖాజబీ, హనుమా రెడ్డి,రవి, శెట్టి నారాయణ, నీలం కృష్ణా,భాషా పంచాయతీ కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పశువుల వైద్యంపై ఖర్చు ఎంతైనా ప్రభుత్వం భరిస్తుంది

- ప్రతీ ఇంట్లో లాభాల పాడి వెలుగులు నింపడమే సర్కార్ లక్ష్యం
- మెరుగైన వైద్యానికి కావలసిన అన్నిసౌకర్యాల ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్




**సూర్యాపేట, మార్చి 26 (మనం ప్రతినిధి)**: చికిత్స కన్నా నివారణ మేలన్న సామెత అనుసరించి పశువైద్యం ప్రజావైద్యం కన్నా ప్రాముఖ్యమని జిల్లాలో పశువైద్యసేవలు అభినందనీయం అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ పశు వాద్యాధికారులను ప్రశంసించారు. గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన పశువాద్యాధికారుల సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ.... పశు ఆరోగ్యం, జాతి అభివృద్ధికి కృత్రిమ గర్భధారణ, ఆడదూడల కోసం లింగవిభజన వీర్యం వాడకం, వ్యాధుల నివారణకు టీకాలు మొదలు వినూత్నంగా జంతువులకు అత్యవసర వైద్యంతో పాటు ఆపరేషన్లు విరిగిన కాళ్ళకు రాడ్లు వేయడం, ఆర్థోపెడిక్ సర్జన్ల సహకారంతో కుక్కలకు వెన్నెముక ఆపరేషన్స్ తోపాటు ఈ మధ్య ఆంధ్రాలో కోడి పందాల్లో కాళ్ళు రెక్కలు విరిగి గాయాలైన పందెం కోళ్లకు కూడా మనజిల్లాలో వైద్యం అందించడం సంతోషంగా ఉందన్నారు. నూటికి నూరు శాతం లక్ష్యాలను సాధించిన శాఖ పశుసంవర్ధక శాఖ అని జిల్లాలో మరింత మెరుగైన సేవలతో పశుపోషకుల ఆదాయ మార్గాలను పెంచడానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు అవసరాలు తెలియజేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని పశు వైద్యశాలల్లో ప్రజా సమాచారం కోసం పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ఏర్పాటు, శౌచాలయాల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, ఆపరేషన్ పరికరాలకిట్లను అందిస్తామని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పట్టణాల్లో వ్యాధిసోకిన పశువులను ఆసుపత్రికి తీసుకొచ్చి ఇంటి వద్ద దింపడానికి హైడ్రాలిక్ అంబులెన్స్ల ఏర్పాటుతో పాటు ప్రతీ నియోజక వర్గానికి క్రిటికల్ ఆపరేషన్లకోసం ఆర్థోపెడిక్ సర్జరీ పరికరాల కిట్టు ఏర్పాటు చేస్తామని అన్నారు. జిల్లాలో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉందని పశుగ్రాసం కొరత తీర్చడానికి కావలసినంత పశుగ్రాస విత్తనాలు అందిస్తామని, ఆసక్తి గల సమభావన సంఘాలతో పశుగ్రాసాలు పెంచి జిల్లాలో పశుగ్రాస బ్యాంక్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కోదాడ లో దాతల సహకారంతో పశు ఔషధ బ్యాంక్ ఏర్పాటుతో అనతికాలంలో పశుపోషకులకు రూ. కోట్ల అదనపు సంపద సృష్టించడం అభినందనీయమని జిల్లాలో ఇదే తరహాలో ఇతర పశువైద్యశాలల్లో పశు ఔషధ బ్యాంక్ ల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో 55 ఆఫీస్ సబార్డినేట్ పోస్ట్ లు ఖాళీగా ఉన్నాయని అడిగిన జిల్లా అధికారికి ఆ పోస్టు లను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఇవ్వడానికి ప్రతిపాదనలు పంపించాలని కోరారు. కోదాడ, చిలుకూరు ఆసుపత్రులకు అల్ట్రా సౌండ్ కలర్ డాప్లర్ స్కానింగ్ యంత్రాలకు నిధులు ఇచ్చామని 50 పశువైద్య శిబిరాలకు కూడా నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. ఆసుపత్రుల్లో వైద్యులకు కుర్చీ టేబుల్స్, ఉపాధిహామీలో పశువులకొట్టాల మంజూరీ తక్షణమే ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. సమాజంలో నూటికి 98.7 శాతం ప్రజలు పశు ఉత్పత్తులైన పాలు, మాంసం, గుడ్లు ఆహారంగా తీసుకుంటున్నారని, వారంతా ఆరోగ్యంగా ఉండాలంటే పశువైద్యం పటిష్టంగా ఉండాలని ఇక నుండి ఆకస్మిక తనిఖీలు చేపడుతామని తెలిపారు. అందరూ అంకిత భావంతో పని చేసి పశు ఆరోగ్యంతో పశుపోషకుల ఆదాయం పెంచి జిల్లాకి మంచి పేరు తేవాలని సూచించారు. సమావేశంలో జిల్లా పశు వైద్య మరియు పశుసంవ అధికారి డా బి శ్రీనివాసరావు అసిస్టెంట్ డైరెక్టర్ లు డా వెంకన్న డా పి పెంటయ్య , డా సత్యనారాయణ, డా బి వి ప్రసాద్ , పశువైద్యులు పాల్గొన్నారు.

# ఓపెన్ వర్సిటీలపై పెరిగిన యూజీసీ నియంత్రణ

- కార్పొరేట్ కళాశాలలు డీమ్డ్ యూనివర్సిటీలుగా మారుతున్నయ్?
- ఇది మంచి పరిణామం కాదు?.. అంబేద్కర్ వర్సిటీ వీసీ చక్రపాణి
- ముగిసిన సరిహద్దులకు అతీతంగా సార్వత్రిక విద్య జాతీయ సదస్సు




**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఇండియన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (ఐడియా), డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో), తెలంగాణ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, గుజరాత్కు చెందిన ఇన్ఫ్లిబ్నెట్ భాగస్వామ్యంతో సరిహద్దులకు అతీతంగా సరికొత్త దిశలో సార్వత్రిక విద్య అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉత్తరాఖండ్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ.నవీన్ చంద్ర లోహాని పాల్గొని ప్రసంగించారు. ప్రొ.లోహాని మాట్లాడుతూ... చైనాలో సాంప్రదాయ విశ్వవిద్యాలయాల కంటే ఓపెన్ వర్సిటీలు చాలా మెరుగ్గా ఉన్నాయని ప్రొ. లోహాని అభిప్రాయపడ్డారు. నిధుల కొరత కారణంగా దేశంలో సార్వత్రిక విద్యా సంస్థలను నడపడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నామని ఆయన వివరించారు. మారుతున్న ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన భాద్యత దూర విద్యా సంస్థలపై ఉందని పేర్కొన్నారు. అభ్యాసకుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఓపెన్ యూనివర్సిటీలు సెల్ఫ్ లెర్నింగ్ మెటీరియల్స్ ను కూడా సొంత నిధులతోనే రూపొందిస్తున్నాయని, దూర విద్యను అందించే విద్యా సంస్థలకు నిధుల కేటాయింపు పెంచాలని ప్రభుత్వాలను కోరారు. యూజీసీ దూరవిద్య విశ్వవిద్యాలయాలను కట్టడికి కఠిన నిబంధనలు పెడుతుందని, దీంతో పభుత్వ రంగ యూనివర్సిటీలు ఇబ్బందులకు గురవుతున్నాయని వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని కార్పొరేట్ కళాశాలలు డీమ్డ్ యూనివర్సిటీలుగా మారుతున్నాయని, ఇది ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియట్లేదన్నారు. ఇలా మారడం వల్ల విద్య కార్పొరేట్ విద్యగా, వ్యాపార వస్తువుగా మారిందని ఆయన దుయ్యబట్టారు. ఇది పేద విద్యార్థులకు దూరం అవడమే కాకుండా ఉన్నత విద్య అభ్యసించడం భారంగా మారుతోందని చక్రపాణి తీవ్ర ఆవేదన వెలబుచ్చారు. అనంతరం ఇండియన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (ఐడియా) అధ్యక్షులు, అంబేద్కర్ వర్సిటీ మాజీ వీసి ప్రొ. కె. సీతారామ రావు మాట్లాడుతూ.. దేశంలో విద్యా వ్యాప్తికి, అభివృద్ధికి ఐడియా కట్టుబడి ఉందని పేర్కొన్నారు. యూజీసీ లేదా మరో నియంత్రణ సంస్థ దేశంలోని ఓపెన్ యూనివర్సిటీలను కట్టడి చేస్తుంటే భరించేది లేదని, పేద ప్రజలకు అందుబాటులో ఉండేది దూర విద్య మాత్రమేనని ఈ విషయాన్ని ప్రభుత్వాలు గ్రహించాలని సూచించారు. యశ్వంతరావు చవాన్ మహారాష్ట్ర ఓపెన్ యూనివర్సిటీ, (నాసిక్ - మహారాష్ట్ర) మాజీ ఉపకులపతి ప్రొ.ఇ.వాయునందన్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సేమినార్కు దేశ వ్యాప్తంగా పేరుగాంచిన పలు ఓపెన్ యూనివర్సిటీల వీసీలు, మాజీ వీసీలు, ఆయా విభాగాల డైరెక్టర్లు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. రెండు రోజుల జాతీయ సదస్సు సమగ్ర రిపోర్టును సభకు సమర్పించారు.

ఐడియా సెక్రటరీ జనరల్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఎల్.వి.కె. రెడ్డి ఐడియా బలోపేతానికి రానున్న రోజుల్లో మరిన్న చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. అంతకు ముందు దూర విద్యా పితామహుడు ప్రొ. జి. రాం రెడ్డి స్మారకోపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిజిటల్ లెర్నింగ్ ప్రత్యేక అధికారి ప్రొ. సంజయ్ మిశ్రా పాల్గొని ఓపెన్ డిస్టెన్స్ పాలసీ అండ్ లీడర్షిప్ అనే అంశంపై ప్రసంగించారు. ఈ ప్లీనరీ సెషన్కి జీ.ఆర్.సి.ఆర్.డి. డైరెక్టర్ ప్రొ. ఇ. సుధారాణి అధ్యక్షత వహించారు. ఆ తర్వాత జాతీయ విద్యా విధానం, డ్యూయల్ మోడ్ విశ్వవిద్యాలయాలు: సమస్యలు, సవాళ్లు అనే అంశంపై దూర విద్యా విభాగం డైరెక్టర్ ప్రొ.ఎస్. జిలానీ అధ్యక్షత వహించారు. ముంబై విశ్వవిద్యాలయం, సీడీఈ మాజీ డైరెక్టర్ ప్రొ.డి. హరిచందన్; మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం, దూర విద్యా విభాగ డైరెక్టర్ ప్రొ. రజావుల్లా ఖాన్; ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్యా విభాగ మాజీ డైరెక్టర్ ప్రొ. జె. రాము నాయుడు; కాకతీయ విశ్వవిద్యాలయం, దూర విద్యా విభాగం మాజీ డైరెక్టర్ ప్రొ.కె. మురళీ మనోహర్; డా.కిషోర్ మెండెం ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. పలు సాంకేతిక సెషన్స్ నిర్వహించగా ఇందులో దేశ వ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాల నుంచి హాజరైన అధ్యాపకులు, పరిశోధకులు తమతమ పరిశోధనా పత్రాలను సమర్పించారు.

## ఎయిర్ పొల్యూషన్కు చెక్.. కార్బన్ గార్డెన్



**ఢిల్లీ, మార్చి 26 :** దేశవ్యాప్తంగా ఆయా నగరాలను వాయు కాలుష్యం వేధిస్తోంది. ఈ క్రమంలోనే ఢిల్లీ యూనివర్సిటీ.. దీనికి తక్కువ ఖర్చుతో కూడిన ప్రభావవంతమైన పరిష్కారం చూపింది. అదే 'కార్బన్ గార్డెన్'. యూనివర్సిటీలోని వృక్షశాస్త్ర విభాగ అధిపతి దీనబంధు సాహూ ఆధ్వర్యంలో 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేశారు. 50 రకాల మొక్కలతోపాటు శైవలాలు, శిలీంధ్రాలు, బ్యాక్టీరియాలతో కూడిన ఈ గార్డెన్.. కార్బన్ మోనాక్సైడ్, మీథేన్ వంటి హానికరమైన కాలుష్య కారకాలను గ్రహిస్తుంది. ఈ మొక్కలు, సూక్ష్మజీవులు.. విష వాయువులను విచ్ఛిన్నం చేయడంతోపాటు నేలను పునరుజ్జీవింపజేస్తాయని సాహు తెలిపారు. ఇదొక చిన్నపాటి జీవవైవిధ్య ఉద్యానవనంలా పనిచేస్తుందన్నారు. ఇటీవల వర్సిటీలో నిర్వహించిన ఓ జాతీయ సదస్సులో నిపుణులు ఈ నమూనాను ప్రశంసించారు. ఇది తక్కువ ఖర్చుతో కూడుకున్నదని, అధిక జనసాంద్రత కలిగిన నగరాల్లో విస్తరించేందుకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన జెడ్పీ సీఈవో

**భీమదేవరపల్లి మార్చి 26 మనం న్యూస్:** భీమదేవరపల్లి మండల పరిధిలోని జెడ్పీ సీఈవో శేషాద్రి పరిశీలించారు. గురువారం రోజున ఎంపీడీవో వీరేశం ఆధ్వర్యంలోమండల పరిధిలోని కొత్తకొండ, భీమదేవరపల్లి గ్రామాలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను వివో నిర్మాణంలో ఉన్న భవనమును, ఉపాధి హామీ నిధుల ద్వారా భీమదేవరపల్లి పాఠశాల నిర్మాణంలో ఉన్నప్రహరీ గోడ పనులను పరిశీలించి అనంతరం నర్సరీలను పరిశీలించిసంతృప్తినిజెడ్పి సీఈవో వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, కొత్తకొండ సర్పంచ్ సిద్దిమల్ల రమా రమేష్, కొత్తకొండ భీమదేవరపల్లి పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాగితాల మీద...కంపెనీలు

- రూ.217 కోట్ల జీఎస్టీ స్కాం బట్ట బయలు
- తెలుగు రాష్ట్రాలలో 72 షెల్ కంపెనీలు గుర్తింపు..!
- ఇద్దరు నిందితుల అరెస్ట్

**హైదరాబాద్,మార్చి 26(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రెండు తెలుగు రాష్ట్రాలలో జరుగుతున్న జీఎస్టీ మోసాల గుట్టును డైరెక్టరేట్ జనరల్ అఫ్ జీఎస్టీ ఇంటలిజెన్స్ అధికారులు రట్టు చేశారు. తెలంగాణ,ఏపీ రాష్ట్రాల్లో సిండికేట్ ద్వారా సుమారు రూ. 217 కోట్ల ఫేక్ ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ దోపిడీ జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. డీజీజీఐ అధికారులు దర్యాప్తులో తెలుగు రాష్ట్రాలలో మొత్తం 72 నకిలీ (షెల్) కంపెనీలున్నట్లు తేలింది. విశాఖపట్నం జోనల్ కార్యాలయం చేపట్టిన దాడులలో నిందితులు కాగితాల మీద కంపెనీలు చూపించి ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు లేకుండా తప్పుడు ఇన్వాయిస్ లను సృష్టించి భారీగా ఐటీసీ క్లెయిమ్ చేస్తున్నట్లు వెలుగుచూసింది. ఈ కేసులోని నిందితులు అమాయకుల ఆధార్, పాన్ కార్డులతో నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లు చేశారని, ఖాళీ షాపులను అద్దెకు తీసుకుని తాత్కాలిక కార్యాలయాలుగా చూపించారని అధికారుల విచారణలో వెల్లడైంది. డిజిటల్ లాగిన్ ల ద్వారా ఇన్వాయిస్ లు జారీ చేశారు. ఈ పద్ధతి ద్వారా దాదాపు రూ. 1,472 కోట్ల విలువైన నకిలీ ఇన్వాయిస్లను సృష్టించి, అందులో రూ. 217 కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం కలిగించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ స్కామ్లో ప్రధాన సూత్రధారి ధంట్ల ఆదిరెడ్డి (అలియాస్ అంజి రెడ్డి) పరారీలో ఉన్నాడని, రామావత్ నాగరాజు నాయక్, సిద్దిగోని ప్రభాకర్లను అరెస్ట్ చేశామని అధికారులు తెలిపారు.

**ఇలా చేశారు :**

తెలంగాణ,ఏపీ రాష్ట్రాలలో సిండికేట్ ద్వారా నిందితులు నకిలీ డాక్యుమెంట్లు సిద్ధం చేయడం, డమ్మీ యజమానులను ఏర్పాటు చేయడం, జీఎస్టీ రిజిస్ట్రేషన్లను పూర్తి చేసినట్లు డీజీజీఐ విచారణలో వెల్లడైంది.

పట్టుబడిన నిందితులపై సీజీఎస్టీ చట్టం 2017 కింద నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి రిమాండ్కు తరలించామని, ఈ స్కామ్ లో లబ్ధి పొందిన మరి కొందరిని గుర్తించేందుకు దర్యాప్తును మరింత వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఆదిరెడ్డి అలియాస్ అంజిరెడ్డి పట్టుబడితే మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## ఎవరి సంతోషం కోసం మమ్మల్ని తిడుతున్నరు?

మీరు తిడితే? వాళ్లు రెండు నిమిషాలే సంతోషిస్తరు?
తర్వాత మీ సంగతెంటి?
అసెంబ్లీలో మంత్రి సీతక్కపై మాజీ మంత్రి,
బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఫైర్
కాంగ్రెస్ పార్టీకి మేం సేవలు చేయలేదా?
చేసిన సేవలకే కాంగ్రెస్ నాకు మంత్రి పదవి ఇచ్చింది?
ఏం చేయకున్న మాపై 5 సీబీఐ కేసులు కూడా పెట్టింది?..
ఇది తెలియకపోతే?.. సీతక్కపై సబితా ధ్వజం


**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తాను కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశానని, ఆ పార్టీ తనకు మంత్రి పదవి ఇచ్చిందని, అలాగే 5 సీబీఐ కేసులు కూడా పెట్టిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే, సీనియర్ నాయకురాలు సబితా ఇంద్రారెడ్డి శాసనసభలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అసంతృప్తి వ్యక్తం చేశారు. 22వ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంత్రి సీతక్కపై..



సబితా ఇంద్రారెడ్డి శాసనసభలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తనను, కేసీఆర్ కుటుంబాన్ని, సీతక్క... పదేపదే తిడుతున్నారని ఆరోపించారు. అలా చేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషపడతారేమో... అందుకే తమను లక్ష్యంగా చేసుకున్నట్లుగా ఉందని విమర్శించారు. సీతక్క కాంగ్రెస్ పార్టీలోనే పుట్టి పెరిగినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. తన మీద రేవంత్ రెడ్డి కామెంట్ చేసేవరకు తాను ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు ఆ పార్టీకి మేం సేవలు చేయలేదా? అని ప్రశ్నించారు. పార్టీ చేసిన మంచితో పాటు చెడును కూడా చెబుతామని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబాన్ని దెబ్బతీయడానికి తనపై ఐదు సీబీఐ కేసులు పెట్టారని ఆరోపించారు. ఆ రోజు తాను ఒక్కమాట మాట్లాడలేదని అన్నారు. తనకు టిక్కెట్ ఇవ్వని సమయంలోనూ మాట్లాడలేదని తెలిపారు. వ్యక్తిగతంగా తమను లక్ష్యంగా చేసుకోవడానికి వారికి చాలా వేదికలు ఉన్నాయని, కానీ శాసనసభలో ప్రజాసమస్యలపై మాట్లాడుదామని అన్నారు. అయితే. ఈరోజు ముఖ్యమంత్రి తన గురించి మాట్లాడారని, అందుకే తాను కాంగ్రెస్ గురించి మాట్లాడవలసి వస్తోందని సబితా ఈ సందర్భంగా అన్నారు.

## టీటీడీకి రూ.60 లక్షలు విరాళం

**తిరుమల, మార్చి 26,మనం న్యూస్:** టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు పలువురు దాతలు రూ.60 లక్షలు విరాళంగా అందించారు. వీరిలో చెన్నైకు చెందిన శ్రీమతి రేవతి విశ్వనాథ్ రూ.40 లక్షలు విరాళంగా అందించారు.హైదరాబాద్ కు చెందిన వి. శ్రీ భవేశ్ చౌదరి రూ.10,07,777 విరాళంగా అందించారు. అదేవిధంగా తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పొనకల నాగేంద్ర రావు రూ.10 లక్షలు విరాళం అందించారు. ఈ మేరకు సదరు దాతలు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు.



## ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయడానికి మీ ఇంటికి - మీ డాక్టర్

- మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**తిరుపతి, మార్చి 26, మనం న్యూస్:** గ్రామీణ ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడానికి పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా మీ ఇంటికి మీ డాక్టర్ ప్రాజెక్టులో భాగంగా మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం తిరుపతి మెటర్నిటీ ఆసుపత్రి ప్రాంగణంలో ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన 'మీ ఇంటికి మీ డాక్టర్ ' ప్రాజెక్టులో భాగంగా మొబైల్ మెడికల్ యూనిట్ ఇండియా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీహరి రావు, డిఎంహెచ్వో బాలకృష్ణ నాయక్ తో జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ సంరక్షణ బలోపేతం చేసే దిశగా.. తిరుపతి జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ సహకారంతో మీ ఇంటికి మీ డాక్టర్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ



కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ వైద్య వాహనం ను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. ఈ వాహనం ప్రధానంగా అత్యంత వెనుకబడిన వర్గాలు అయిన ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాలకు చేరుకొని, రోజుకు సుమారు 100 మంది రోగులకు అవుట్ పేషెంట్ సేవలు మరియు అవసరమైన మందులను అందించే విధంగా రూపకల్పన చేయబడిందన్నారు. ఈ వాహనంలో ఒక డ్రైవర్తో పాటు ఇద్దరు ఫార్మసిస్టులు, ఒక స్టాఫ్ నర్స్, ఒక వైద్యుడు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతిరోజూ నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం రెండు నుంచి మూడు గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందించేందుకు ఈ బృందం పనిచేస్తుందని తెలిపారు. సుమారు రూ 8.40 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో మాత్రమే ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, అందులో తిరుపతి జిల్లా ను ఒకటిగా ఎంపిక కావడం విశేషమని తెలిపారు. ఈ కార్యక్రమం 100% రోగనిరోధక టీకాలు కవరేజ్ తో పాటు ప్రస్తుత మరణాలు రేటు చేయి డెంగ్యూ మలేరియా వంటి అంటువ్యాధుల భారాన్ని తగ్గించే దిశగా దృష్టి సారిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం అమలులో డాక్టర్ శ్రీహరి కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. తిరుపతిలో ఇటీవల రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పూర్తి స్థాయి ఆధునిక బ్లడ్ బ్యాంక్ ను ప్రారంభించామని తెలిపారు. ఈ బ్లడ్ బ్యాంక్లో అన్ని రకాల రక్త గ్రూపులు అందుబాటులో ఉండటంతో పాటు, ప్లేట్లెట్లు, ప్లాస్మా వంటి భాగాలను వేరు చేసే ఆధునిక యంత్రాలు ఉన్నాయని అన్నారు. త్వరలో మొబైల్ బ్లడ్ బ్యాంక్ను కూడా ప్రారంభించి, కళాశాలలు మరియు ప్రధాన సంస్థలకు తీసుకెళ్లి రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ అవసరమైన రక్తాన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. తిరుపతి జిల్లాలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో, రక్తం సమయానికి అందించడం అత్యంత కీలకమని తెలియజేశారు.

ప్రజల ఆరోగ్య సేవలను మెరుగుపర్చడా లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో ఎంతో చురుకుగా పనిచేస్తున్నారని, ఈ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మయూరి, కార్యదర్శి ప్రతీత్, సుబ్బారావు రుయా హాస్పిటల్ సూపర్డెంట్ రాధా, ఎస్ వి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ రవి ప్రభు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయండి

- జిల్లా కలెక్టర్కు ఏపీడబ్ల్యుజేఎఫ్ వినతి

**తిరుపతి, మార్చి 26,మనం న్యూస్:** తిరుపతి జిల్లాలో జరిగిన అక్రిడిటేషన్ మొదటి జాబితాలో మంజూరు అయ్యి పెండింగ్ లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ను ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు గురువారం కోరారు. కలెక్టర్ను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ తిరుపతి జిల్లా నూతన అధ్యక్షుడు జి.చెంగల్రాయులు(గాంధీ), ప్రధాన కార్యదర్శి వళిగళం గోపీ, ఉపాధ్యక్షులు పానేటి చెంగల్రాయులు, సీనియర్ జర్నలిస్ట్ ఆలూరు గిరిధర్, కోశాధికారి శ్రీనివాస్, తిరుపతి నియోజకవర్గం అధ్యక్షుడు, బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి చామంచి కుమార్, కోశాధికారి మణి తదితరులు కలిశారు. జ అక్రిడిటేషన్



మొదటి జాబితాలో పెండింగ్ అక్రిడిటేషన్ కార్డులతో పాటు రెండో జాబితా సమావేశం కూడా త్వరగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ రెండో జాబితా సమావేశం ఏప్రిల్ మొదటి వారంలో నిర్వహిస్తామని, అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ నూతన జిల్లా కమిటీ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ను ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. సవరించిన ఎక్రిడేషన్ నిబంధనల వల్ల పలువురు పాత్రికేయులు అక్రిడిటేషన్ పొందలేక ఇబ్బంది పడుతున్న తరుణంలో పూర్వపు నిబంధనల మేరకు పాత్రికేయిలకు హెల్త్ కార్డులు ఇప్పించాలని అన్నపరెడ్డి కమిషనర్ కు విన్నవించారు. గతంలో డస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఉండేవి కాదని అయినా వారికి హెల్త్ కార్డులు మంజూరు చేసారని గుర్తు చేశారు. ఈ క్రమంలో కనీసం పూర్వపు అక్రిడిటేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు మంజూరు అయ్యేలా ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. నిజానికి హెల్త్ కార్డుల విషయంలో అక్రిడిటేషన్ తప్పనిసరన్న నిబంధన లేదని ఈ విషయాన్ని పరిశీలించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. . అక్రిడిటేషన్ ఉన్న వారికి మాత్రమే ఆరోగ్య కార్డులు ఇవ్వాలన్న నిబంధన ఉన్నట్లయితే దానిని సవరించి అర్హులు అందిరికీ ఆరోగ్య కార్డులు మంజూరు చేయించే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

## శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- మార్చి 27న ధ్వజారోహణం

**ఒంటిమిట్ట / తిరుపతి,మార్చి 26, మనం న్యూస్:** ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో నిర్వహించనున్న వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు భక్తి భావపూర్వక వాతావరణంలో వేదమంత్రాల నడుమ గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. పురాతన చారిత్రక ప్రాశస్త్యాన్ని కలిగిన ఈ ఆలయంలో ఒకే శిలపై శ్రీ సీతారామ లక్ష్మణుల దివ్య మూర్తులు వెలసి ఉండటంతో ఒంటిమిట్టను ఏకశిలానగరంగా కూడా పిలుస్తారు.ఈ సందర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, కలశ ప్రతిష్ఠ, కలశపూజ, వాసుదేవ పుణ్యాహవచనం, కంకణధారణ వంటి శాస్త్రోక్త కర్మలను నిర్వహించారు. అనంతరం పుట్టమన్ను సేకరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది.

**మార్చి 27న ధ్వజారోహణం**

శుక్రవారం ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. దీంతో శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 4 నుండి 7 గంటల వరకు పోతన జయంతి కార్యక్రమం, కవి సమ్మేళనం జరుగనుంది. రాత్రి 7 నుండి 9 గంటల వరకు శేష వాహనసేవను భక్తులు వీక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ఎ. ప్రశాంతి, ఏఈవో బాలరాజు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ఐపీఎల్ 2026..
# పూర్తి షెడ్యూల్ వచ్చేసింది

ఐపీఎల్ 2026 సీజన్ కు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్ ను బీసీసీఐ విడుదల చేసింది. ఇంతకుముందు తొలి దశలో కేవలం 20 మ్యాచులకు మాత్రమే వేదికలు, తేదీలను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రెండో దశలో 50 మ్యాచులకు షెడ్యూల్ ను విడుదల చేసింది. దీంతో మొత్తం 70 లీగ్ మ్యాచులకూ షెడ్యూల్ ప్రకటించినట్లైంది. అయితే, ప్లేఆఫ్స్ వేదికలను ఇంకా ఖరారు చేయలేదు. మార్చి 28 నుంచి మే 24 వరకూ జరగనున్న లీగ్ స్టేజ్ మ్యాచ్ ల వివరాలను ప్రకటించింది. బెంగళూరు వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు - సన్రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్ తో 19వ ఎడిషన్ ప్రారంభం కానుంది. లీగ్ స్టేజ్ కోల్ కతా నైట్రైడర్స్ రిట దిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ తో ముగియనుంది. ఈ మ్యాచ్ కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనుంది.



**క్యాచులపై క్లారిటీ**

క్యాచుల విషయంపై ఇప్పటికే పది జట్ల సారథులకు బీసీసీఐ క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కెప్టెన్లతో జరిగిన సమావేశంలో అందుకు సంబంధించిన వీడియోలను ప్లే చేసి చూపించారని సమాచారం. క్లాజ్ 33.3 ప్రకారం బంతిపై ఫీల్డర్ కు పూర్తి నియంత్రణ వచ్చినట్లు అంపైర్లు భావిస్తేనే ఔట్ ఇవ్వడం జరుగుతుందని బీసీసీఐ స్పష్టం చేసింది. అందుకోసం గత టీ20 ప్రపంచ కప్ లో కాస్త చర్చకు దారితీసిన క్యాచుల వీడియోలను ప్రదర్శించింది.

## సన్ రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు శుభవార్త

సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ కొంతకాలంగా వెన్ను గాయంతో ఇబ్బందిపడుతున్న విషయం తెలిసిందే. అతడు ప్రస్తుత ఐపీఎల్ 2026లో ఆడే విషయమై అనిశ్చితి నెలకొంది. అయితే కమిన్స్.. అభిమానులకు ఓ శుభవార్త తెలిపాడు. తాను కోలుకుంటున్నానని.. సీజన్ మధ్యలో జట్టులోకి వస్తానని చెప్పాడు. బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో బుధవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్ లో అతడు పాల్గొన్నాడు. వార్మప్ లు, ఫీల్డింగ్, క్యాచ్ లు ప్రాక్టీస్ చేశాడు. తక్కువ రనప్ తో ఖాళీ నెట్స్ లో కొన్ని బంతులు కూడా బౌలింగ్ చేశాడు. 'నేను వెన్ను గాయం నుంచి ఇంకా కోలుకుంటున్నా. కానీ ప్రస్తుతం బాగుంది. ఇప్పుడు నెట్స్ లో బౌలింగ్ చేయగలుగుతున్నా. ఐపీఎల్ త్వరలోనే ప్రారంభం కానుంది. కానీ నేను ప్రారంభ మ్యాచుల్లో ఆడలేకపోతున్నా. టోర్నీ మధ్యలో జట్టులోకి వచ్చే అవకాశముంది.

# శ్రీరామనవమి స్పెషల్.. ఇరుముడి టీమ్ ప్రత్యేక పోస్టర్



రవితేజ హీరోగా వస్తోన్న తాజా చిత్రం ఇరుముడి. ఈ చిత్రంలో మాస్ మహారాజా అయ్యప్పదీక్షలో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్స్ చూస్తే డెవోషనల్ టచ్ తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. తండ్రీ, కూతుళ్ల బంధం నేపథ్యంలో ఈ మూవీని రూపొందిస్తున్నారు.

తాజాగా ఇరుముడి టీమ్ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేసింది. ప్రేమ, ఆప్యాయత గల తండ్రి.. ముచ్చటైన కూతురి కథ.. అంటూ మైత్రి మూవీ మేకర్స్ పోస్ట్ చేసింది. ఈ పోస్టర్ తోనే కథేంటో మేకర్స్ రివీల్ చేశారు. ఈ ఏడాది రవితేజ బర్త్ డే సందర్భందా మూవీ టైటిల్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. పాన్ ఇండియా రేంజ్ లో తెరకెక్కుతోన్న ఈ సినిమా ఏడాదిలోనే విడుదల కానుంది.

# సిద్ధం కండి 'పెద్ది' బిగ్ ట్రీట్‌కి..



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ సినిమానే పెద్ది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ సినిమా పట్ల అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అయితే ఈ రోజు 27న రామ్ చరణ్ పుట్టినరోజు కానుకగా ఓ బిగ్ ట్రీట్ ని ఆశిస్తున్నారని తెలిసిందే. మరి ఫైనల్ గా దీనిపై మేకర్స్ బిగ్ అప్డేట్ అందించారు. ఒక గదాదండం తో డిజైన్ చేసిన సరికొత్త పోస్టర్ తో టైం ని రివీల్ చేసారు. ఇది వరకు తమ పెద్ది ని బ్యాట్ తో చూసారు. ఈసారి మరోలా చూడబోతున్నారు అంటూ ఈ రోజు ఉదయం 9 గంటల 35 నిమిషాల సమయాన్ని ఖరారు చేసారు. సో ఈసారి కూడా మోత గట్టిగానే ఉంటుందని చెప్పొచ్చు. ఇక ఈ సినిమాకి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. అలాగే వృద్ధి సినిమాస్ వారు ఏప్రిల్ 30న గ్రాండ్ గా విడుదల చేస్తున్నారు.

# రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తి చాటి చెప్పడానికే శాసనసభ్యుల క్రీడా పోటీలు

- మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026



రాష్ట్రంలో విద్యార్థులు యువకులు అన్ని వర్గాలకు క్రీడల ప్రాముఖ్యత తెలియజేసే విధంగా శాసన సభ్యుల క్రీడోత్సవాలు నిర్వహించబోతున్నామని రాష్ట్ర మంత్రులు జూపల్లి కష్ణారావు వాకిటి శ్రీహరి లు తెలిపారు. ఈనెల 28 29 తేదీల్లో జరగబోయే శాసనసభ్యులు శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 నిర్వహణ సన్నాహక సమావేశం ఈరోజు అసెంబ్లీలోని కమిటీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనునిత్యం రాజకీయాల్లో బిజీ ఉండే శాసన సభ్యులు శాసనమండలి సభ్యులకు ఈ క్రీడా పోటీలు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని క్రీడల పట్ల అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబోతున్నామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పోటీలు మొట్టమొదటిసారిగా నిర్వహించబోతున్నామని, పార్టీలబేధ భావాలు పక్కనపెట్టి శాసనసభ్యులు అందరూ ఈ క్రీడల్లో పాల్గొన్న పోతున్నారని వారు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి వయసుల వారికి క్రీడల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఇందుకోసం శాసనసభ సచివాలయము తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మరియు రాష్ట్ర సాంస్కృతిక శాఖ తోపాటు వివిధ శాఖల సమన్వయంతో శాసనసభ్యులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనమండలి విప్ అద్దంకి దయాకర్ శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ యశస్విని రెడ్డి , పాల్వాయి హరీష్ రావు, శాసనమండలి సభ్యులు తాత మధుసూదన్ రావు భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి శాసనమండలి కార్యదర్శి నరసింహచార్యులు శాసనసభ కార్యదర్శి ఆర్ తిరుపతి వివిధ క్రీడా వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**28న ప్రారంభం :**

మొదటి ఎడిషన్ లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 ప్రారంభ వేడుకలు ఎల్బీ స్టేడియంలో 28వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభమవుతాయని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తోపాటు ఉభయ సభల వివిధ పక్ష నేతలు విప్ లు అన్ని పార్టీల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు.

# మేము విడిపోవాలని కోరుకుంటున్నారా..

''నేను నా భర్త నిక్ జొనాస్.. బయటి విషయాల కంటే కూడా మమ్మల్ని మేం పట్టించుకుంటూ సంతోషంగా ఉంటున్నాం''ని అంటోంది కథానాయిక ప్రియాంక చోప్రా. ప్రస్తుతం హాలీవుడ్ ప్రాజెక్టులతో పాటు రాజమౌళి- మహేశ్ బాబు కలయికలో వస్తోన్న 'వారణాసి'లో కథానాయికగా నటిస్తోంది. ఆమె.. కెరీర్ గురించే కాదు.. అవకాశం వచ్చినప్పుడల్లా వ్యక్తిగత జీవితం గురించి కూడా అభిమానులతో పంచుకుంటుంది. ఈ నేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియాంక చెప్పిన ఆసక్తికర సంగతులు.

''మేం విడాకు లు తీసుకుంటున్నా మంటూ కొన్ని వార్తలు నా చెవిన పడ్డాయి. మా పెళ్లి బంధం ముగిసిపోవాలని కోరుకుంటున్నారా? అస్సలు ఎందుకు మా బంధం గురించి ఇలాంటి రూమర్లు వస్తున్నాయో తెలియడం లేదు. అయినా ఇదంతా వాళ్ల భ్రమ. మా ఇద్దరి మధ్య బంధం కొందరికి ఎందుకు ఇంత ఇబ్బంది కలిగిస్తుందో అర్థం కావడం లేదు. బహుశా వేర్వేరు దేశాలు, వేర్వేరు మతాలు, వయసు తేడా అయి ఉండవచ్చు. మేము ఎనిమిదేళ్లుగా కలిసే ఉంటున్నాం. ఇతరులు ఏమనుకుంటున్నారో అని ఆలోచించడం మానేశా. మా పరిచయం తర్వాత ఆరు నెలల్లోనే పెళ్లి చేసుకున్నాం. అప్పుడు అది నిజమో కాదో కూడా తెలియని పరిస్థితుల్లో ఉండిపోయా. అయితే నిక్ లో నిజాయతీ ఉంది''.



**నాకు భద్రత అవసరం లేదు**

''మా కుటుంబ భద్రత విషయంలో కూడా నేను చాలా జాగ్రత్తగా ఉంటా. ముఖ్యంగా మా కుమార్తె గురించి మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తాను. ఎవరైనా నన్ను సంప్రదించి ఫొటోలు తీసుకోవడం నాకిష్టం. నాతో మాట్లాడటానికి వచ్చే వ్యక్తులను నేను ఇష్టపడతానని మా సెక్యూరిటీ గార్డులకు తెలుసు. అనుమతి లేకుండా మమ్మల్ని ఫొటోలు తీయకుండా వారు చూసుకుంటారు. ఈరోజుల్లో ప్రతి ఒక్కరి దగ్గర సెల్ ఫోన్లు ఉంటున్నాయి. మేము పార్కులో ఉన్నా.. ఏదైనా తింటున్నా కూడా క్షణాల్లో దాన్ని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. అందుకే నా కూతురి కోసం సెక్యూరిటీని పెట్టుకున్నా. లేకపోతే నాకు భద్రత అవసరం లేదు''.

**ఉద్యోగాలు నచ్చకపోయినా..**

''నా దృష్టిలో నిజమైన విజయం అంటే నేను ఇష్టపడే వృత్తిలో పనిచేయడం, కుటుంబం కోసం సమయం కేటాయించడం మాత్రమే. జీవితంలో చాలా మంది రోజూ పనిచేయాల్సి ఉంటుంది. కొంతమందికి వారు చేసే ఉద్యోగాలు కూడా నచ్చవు. కానీ వారు బతకడం కోసం, కుటుంబాలను పోషించడం కోసం ఉద్యోగం చేయాలి. నాకు అదే విజయమని భావిస్తున్నా''.

**ఇప్పుడు నా ఇష్టం**

''ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో బాలీవుడ్ లో మంచి పేరును సంపాదించుకున్నా. ఆ తర్వాత 30ఏళ్ల వయసులోనే హాలీవుడ్ లో అడుగుపెట్టినప్పుడు మళ్లీ కెరీర్ ప్రారంభించిన అనుభూతి కలిగింది. నేను సురక్షితంగా ఉన్నా. ఆర్థికంగా కూడా బాగానే ఉన్నా. మంచిగా స్థిరపడ్డాను. అయినా అన్నింటినీ వదులుకొని హాలీవుడ్ కి వెళ్లడం ఆందోళనగా అనిపించింది. అక్కడ నా సినీ కెరీర్ ను మొదలెట్టిన కొత్తలో స్టీరియోటైప్ పాత్రలే ఎక్కువ వచ్చేవి. ఇప్పుడు నాకు ఇష్టం ఉన్న పాత్రల్నే ఎంపిక చేసుకోగలుగుతున్నా''.

# రామ్ చరణ్ కంటికి సర్జరీ..

రామ్ చరణ్ 'పెద్ది' షూటింగ్లో గాయపడిన విషయం తెలిసిందే. ఆయన కంటికి చిన్న సర్జరీ జరిగినట్లు చిరంజీవి సోషల్ మీడియాలో వెల్లడించారు. చరణ్ కు సర్జరీ చేసిన వైద్యులకు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సర్జరీ గురించి చిరంజీవి స్పందిస్తూ.. ''చరణ్ కనురెప్పకు మీరు సరైన సమయంలో, ఎంతో నైపుణ్యంతో సర్జరీ చేసినందుకు ధన్యవాదాలు. మొదట మాకు కొంత ఆందోళన కలిగినప్పటికీ, మీ మాటలు భయాన్ని పోగొట్టి ధైర్యాన్నిచ్చాయి'' అని పేర్కొన్నారు. చికిత్స అందించిన వైద్యులకు తమ కుటుంబం ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటుందని చిరంజీవి తన పోస్ట్లో రాసుకొచ్చారు.













Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.